అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 17-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 230 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00



ఢిల్లీని తాకిన గోరఖ్‌పూర్ సెగ

యూపీ భవన్ వద్ద విద్యార్థుల నిరసన

- చిన్నారుల మృతికి రాష్ట్ర సర్కార్‌దే బాధ్యత
- యోగి రాజీనామా చేయాలని డిమాండ్

న్యూఢిల్లీ : గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి చిన్నారులు మృతిచెందిన ఘటనపై దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంత్రికార్ యువ సంఘటన్ (కేవైఎస్) నేతృత్వంలో ఢిల్లీ యూనివర్సిటీ (డీయూ), జామియా మిలాయ్ ఇస్లామియా, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థులు యూపీ భవన్ ఎదుట బుధవారం ధర్నా చేశారు. యోగి ...9లో

జలధారగా పిలవబడిన మేడిగడ్డ ప్రాంతంలో ఇసుక తవ్వకాలతో విధ్వంసం జరుగుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలను ఉపయోగించి ఇసుక తోడేస్తున్నారు. గుట్టలను తలపించే భారీ డంపింగ్‌ల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఓవర్‌లోడ్ పేరిట ఇసుక మాఫియా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నది. విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టడం వల్ల పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లే ప్రమాదముందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇసుక లారీల అతి వేగంతో మూడు నెలల్లో ఎనిమిది మంది చనిపోగా.. 60కిపైగా మూగ జీవాలు మృత్యువాతపడ్డాయి.

మేడిగడ్డలో మాఫియా

జలధారలో ఇసుక అక్రమ తవ్వకాలు

నిబంధనలకు విరుద్ధంగా యంత్రాల వినియోగం

- వరుస రోడ్డు ప్రమాదాలు...మూడు నెలల్లో ఎనిమిది మంది మృతి
- 60కి పైగా మూగజీవాల మృత్యువాత



నవతెలంగాణ-జయశంకర్ ప్రతినిధి

16.17 టీఎంసీల నీటి నిల్వ గల మేడిగడ్డ బ్యారేజీ నుంచి ప్రతిఏటా ఎనభై రోజుల్లో ప్రతిరోజూ 2 టీఎంసీల చొప్పున 160 టీఎంసీలను కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా ఎగువ ప్రాంతాలకు తరలించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు నిర్మాణం పనులు చేపడుతున్నారు. మేడిగడ్డ బ్యారేజీ ముంపు ప్రాంతంలో 4కోట్ల 18 లక్షల 80వేల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నట్లు గనులు, భూగర్భ వనరులు, సాగునీటి పారుదల శాఖలు సంయుక్తంగా నిర్ణయించాయి. అందులో తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 3.03కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు తవ్వేందుకు నిర్ణయించారు. దీన్ని మూడేండ్ల వ్యవధిలో తవ్వేలా ఒప్పందం జరిగింది. ఇప్పటి వరకు మేడిగడ్డ బ్యారేజీ పరిధిలోని ఇసుక క్వారీల నుంచి 20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తరలించినట్టు టీఎస్ఎండీ అధికారులు పేర్కొంటున్నారు.

దీర్ఘకాలికంగా పెనుముప్పు

ఇన్నేండ్లు దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రశాంత జీవితం గడిపిన గిరిజనులకు లారీల రణగొణ ధ్వనులతో ప్రశాంత కరువైంది. ప్రతి రోజూ వందలాది లారీల తాకిడికి రోడ్లు గుంతలమయం అవుతున్నాయి. రోడ్డెక్కితే ఎటువైపు ...9లో

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం



త్రిపుర సీఎం ప్రసంగాన్ని కేంద్రం అడ్డుకోవడంపై ఏచూరి

- మోడీ సర్కారుది నిరంకుశ వైఖరి
- దేశంలో ఎమర్జెన్సీకి మించిన దారుణ పరిస్థితులు
- రాష్ట్రాల హక్కులపై కేంద్రం జోక్యం.... 2లో
- బీజేపీయేతర ముఖ్యమంత్రులు స్పందించాలి..
- మోడీ ప్రసంగంపై తమకూ అభ్యంతరాలున్నాయని వెల్లడి

ఉద్యోగాల భర్తీకి రోడ్‌మ్యాప్

నియామకాల ప్రక్రియ ఇక వేగవంతం

న్యాయపర ఇబ్బందుల్లేకుండా నోటిఫికేషన్లు

పూర్తి వివరాలు 10లో..

- శాఖలవారీగా ఖాళీలు, విద్యార్హతలు, రోస్టర్ సిద్ధం చేయాలి: అధికారులకు కడియం ఆదేశం
- సీఎం ఆదేశాల మేరకు సీఎస్, టీఎస్‌పీఎస్సీ, ఉన్నతాధికారులతో భేటీ
- పది జిల్లాల ప్రకారమా, 31 జిల్లాల ప్రకారమా అన్నదానిపై మీమాంస



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, చిత్రంలో ఘంటా చక్రపాణి, సీఎస్ ఎస్పీ సింగ్, తదితరులు



(ఫైల్)

రోహిత్ ఆత్మహత్య వెనుక..

ప్రపంచ వ్యవహారాలే: ఏకే రూపన్‌వాలా నివేదిక

- కేంద్రమంత్రులకు క్లీన్‌చిట్
- యూనివర్సిటీ చర్యలకు సమర్థన

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ప్రపంచ వ్యవహారాల వల్ల మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని విశ్రాంత న్యాయమూర్తి ఏకే రూపన్‌వాలా కమిటీ తన నివేదికలో పేర్కొన్నది. యూనివర్సిటీ అధికారుల చర్యల వల్ల ఆత్మహత్యకు పాల్పడలేదని ఆ నివేదికలో ఆయన తెలిపారు. పైగా ఈ వ్యవహారంతో కేంద్రమంత్రులు స్మృతిఇరానీకి, బండారు దత్తాత్రేయకు సంబంధం లేదని పేర్కొనడం గమనార్హం. ఇక విద్యార్థులు ఇతర అంశాల జోలికి వెళ్లొద్దనే రోహిత్ వేములతో పాటు మరికొంత ...9లో

కాంగ్రెస్‌కు పెరిగిన సీట్లు

- మధ్యప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు విడుదల
- 27 చోట్ల సీఎం చౌహాన్ ప్రచారం..అందులో 13 చోట్ల పరాజయం
- మందసోర్‌లో మూడు స్థానాల్లోనూ కాంగ్రెస్ విజయం
- బీజేపీకి 26 స్థానాలు, కాంగ్రెస్‌కు 14



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని 43 మున్సిపాల్టీలు, పంచాయతీ ప్రతినిధుల ఎన్నికల ఫలితాలు భారీ బందోబస్తు నడుమ అధికారులు బుధవారం విడుదల చేశారు. వీటిలో బీజేపీ అభ్యర్థులు 26 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్‌కు 14 సీట్లు దక్కాయి. మరో మూడు స్థానాల్లో స్వతంత్ర ...9లో

ఆ అధికారమెక్కడిది?

కుంతియాతో ఒరిగేదేమీ లేదు

- త్వరలో రాహుల్, సోనియాగాంధీని కలుస్తాం : మీడియాతో కోమటిరెడ్డి బ్రదర్స్



నవతెలంగాణ-యాదాద్రిభువనగిరి/నల్లగొండ ప్రతినిధులు

2019 వరకు టీపీసీసీ అధ్యక్షునిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనసాగుతాడని చెప్పే అధికారం ఏఐసీసీ కార్యదర్శి కుంతియాకు ఎక్కడిదని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. కుంతియాతో ఒరిగేదేమీ లేదని తేల్చిచెప్పారు. దీనిపై త్వరలో సోనియా, రాహుల్‌గాంధీలను కలుస్తామని చెప్పారు. నల్లగొండలో వెంకట్‌రెడ్డి, యాదాద్రిభువనగిరిలో రాజగోపాల్‌రెడ్డిలు బుధవారం విలేకర్లతో మాట్లాడారు. నల్లగొండలో సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ...కార్యకర్తలకు అందుబాటులో ఉండే యువ నాయకత్వంతోనే పార్టీకి మేలు జరుగుతుందన్నారు. కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయజెండా సాక్షిగా లక్ష ...9లో

బేటీ బచావో ఏమైంది?

ఆడపిల్లను కనాలంటే భయంగా ఉంది

- సమాజంలో జరుగుతున్న క్రూరమైన నేరాలపై.. బుల్లితెర నటి దివ్యాంక త్రిపాఠి భావోద్వేగ ట్వీట్లు 2లో
- ఛండీగఢ్‌లో మైనర్‌పై లైంగికదాడి నేపథ్యంలో..



కొక్కొరోకో..



ఆ పథకాలు మన దాక చేరితే..
ప్రపంచానికే ఆదర్శం అయ్యేవిరా..!!

మోకాలి ఇంప్లాంట్స్ ధరలు తగ్గింపు

జీఎస్టీ అదనపు భారం యథాతథం

న్యూఢిల్లీ: మోకాలి శస్త్రచికిత్సల భారం తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నది. శస్త్రచికిత్సలో అమర్చే ఇంప్లాంట్స్ ధరలను సగానికిపైగా తగ్గించింది. ఈ తరహా శస్త్ర చికిత్సల్లో విరివిగా ఉపయోగించే క్రోమియం కోబాల్ట్ ఇంప్లాంట్స్ ధరను రూ.1,58,324 నుంచి రూ.54,720కు తగ్గించింది. దీనికి జీఎస్టీ అదనం. దీంతో పాటు ఇతర ఇంప్లాంట్స్ ధరలనూ 60 నుంచి 70 శాతం వరకు తగ్గించింది. ఈ మేరకు జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ ఆయా ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది.కాగా ఓవైపు ధర తగ్గించి మరోవైపు జీఎస్టీ భారాన్ని యథాతథంగా ఉంచటం పట్ల రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



గులాబీకి సినీ గ్లామర్

బడా నిర్మాతలను ఆకర్షించే ప్రయత్నం

- పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీఆర్ఎస్ పెద్దలు
- ఒకరిద్దరికి టికెట్లు ఇస్తామని కూడా ఆశలు
- క్షేత్రస్థాయిలో తగినంత పార్టీ నిర్మాణం లేకపోవడమే..

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గులాబీ పార్టీకి సినీగ్లామర్ అద్దేందుకు టీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ తెగ ప్రయత్నిస్తున్నారు. ఇన్నాళ్లు తెలంగాణ సెంటిమెంట్ నినాదంతో పార్టీని, ప్రభుత్వాన్ని నడిపినా, తిరిగి 2019లో అధికారంలోకి రావాలంటే కొద్దిగా సినీవాసన కూడా అవసరమని టీఆర్ఎస్‌పార్టీ నాయకత్వం భావిస్తున్నది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన బడా నిర్మాతలను పార్టీలోకి తీసుకోవాలన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నట్టు తెలుస్తోంది. అవసరమైతే తెలంగాణలో స్థిరపడిన ఇతర రాష్ట్రాలకు చెందిన సినిమావారి సేవలను కూడా ఉపయోగించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే చేనేత వస్త్రాల బ్రాండ్ అంబాసిడర్‌గా సినీనటి సమంతను తీసుకున్నారు. పైగా ఆమె సినీనటుడు నాగార్జున కాబోయే కోడలు కూడా. నాగార్జునతోనూ ప్రభుత్వానికి సత్సంబంధాలు ఉన్నాయి. ఇంకా కొంతమంది సినిమా పెద్దలతోనూ మాట్లాడుతున్నట్టు సమాచారం. ఇటీవల ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ కొంతమంది సినీ రచయితలు, సింగర్స్, ఆ పరిశ్రమ రంగానికి చెందిన వారితో సమావేశమైన విషయం తెలిసిందే. హరితహారం కోసం, ఇతర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పాటలు రాయాలని ముఖ్యమంత్రి కోరారు. అదేవిధంగా రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ చిన్న చిన్న నటులతో చర్చిస్తున్నారని తెలిసింది. వారికి ప్రభుత్వపరంగా కూడా ...9లో



(ఫైల్)



(ఫైల్)

'బేటీ బచావో' ఏమైంది?

- ఆడపిల్లను కనాలంటే భయంగా ఉంది : బుల్లితెర నటి దివ్యాంక త్రిపాఠి భావోద్వేగ ట్వీట్లు

ముంబయి: స్వాతంత్య్ర దినోత్సవం సాక్షిగా.. చిన్నారిపై లైంగికదాడి ఘటన జరిగిన నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీకి బుల్లితెర నటి దివ్యాంక త్రిపాఠి సామాజిక మాధ్యమంలో భావోద్వేగ ట్వీట్లు చేశారు. 'అమ్మాయిని కాపాడుటంలో 'బేటీ బచావో' కార్యక్రమం ఏమైంది? కొడుకును కనాలని నేను ఎప్పుడూ కోరుకోలేదు. కానీ, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న క్రూరమైన నేరాలను చూస్తే... అమ్మాయిని కనాలంటేనే భయంగా ఉంది. ఈ నరక కూపంలో జీవించడానికి నేను ఆమెకు ఎలా జన్మనివ్వాలి? నేను ఆ అమ్మాయికి ఏం చెప్పగలను?' అని దివ్యాంక ట్వీట్ చేశారు. 'క్రూరమైన నేరాలు చేసే వారిని ఎందుకు క్రూరంగా శిక్షించరు? మనం ఏ స్వతంత్రం గురించి మాట్లాడుకుంటున్నాం? దేశానికి మహిళలు ముఖ్యం కాదు అనుకునే పార్టీలకు మహిళలు ఓట్లు వేయకూడదు. 70ఏండ్ల స్వాతంత్య్రం మాకు ఇంకా స్వేచ్ఛనివ్వలేదు. అన్ని పార్టీలు ఇప్పుడు నిద్రలేవాలి. భద్రత ప్రతి మహిళా హక్కు' అని పేర్కొన్నారు. 'ఇలాంటి క్రూరమైన చర్యలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి.. ఆ శిక్ష అలాంటి నేరాలకు పాల్పడాలన్న ఆలోచన ఉన్నవారికి ఒక గుణపాఠం కలిగేలా ఉండాలి. మీ మీద మాకు విశ్వాసం ఉంది. ఇలాంటి నేరాలను ఆపేందుకు ఏదో ఒకటి చేయండి' అని ఆమె ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు. 'భయంతో బతుకుతున్నాం. నేరస్థులు మాత్రం నిర్భయంగా బతికేస్తున్నారు. గొప్ప విలువలను నా కూతురికి నేను నేర్పగలను. కానీ, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న ఘటనల నేపథ్యంలో మంచి జీవితాన్ని ఇస్తానన్న వాగ్దానాన్ని నేను ఆమెకు ఇవ్వలేను' అని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. దివ్యాంక ప్రస్తుతం యే హై మొహబత్తీన్‌లో కీలక పాత్ర పోషిస్తోంది.

కేరళ 'లవ్ జిహాద్' కేసు
ఎన్ఐఏ దర్యాప్తునకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఒక హిందూ మహిళ ఇస్లాం మతంలోకి మారి ముస్లిం యువకుడిని పెండ్లి చేసుకున్న ఘటనకు సంబంధించిన 'లవ్ జిహాద్' కేసును సుప్రీంకోర్టు ఎన్ఐఏకు అప్పగించింది. ఎన్ఐఏ దర్యాప్తును అత్యున్నత న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వి రవీంద్రన్ పర్యవేక్షించనున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, జస్టిస్ డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. అఖిల అశోకన్ ఇస్లాం మతంలోకి మారడం, ముస్లిం యువకుడ్ని పెండ్లి చేసుకున్న ఘటన ఇది ఒక్కటే కాదనీ తొలుత ఈ కేసు విచారణ సమయంలో ఎన్ఐఏ కోర్టుకు వివరించింది. పెద్దవాళ్ల ఇష్టానికి వ్యతిరేకంగా హిందూ బాలికలను ఇస్లాంలోకి మార్చిన పలు సందర్భాలున్నాయంటూ ఎన్ఐఏ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం... కేసు విచారణను ఎన్ఐఏకు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేసింది.

దీర్ఘకాల సాగునీటి నిధి
రూ.9020 కోట్లకు పెంపు

- సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఊతం
- కేంద్ర క్యాబినెట్ ఆమోదం

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

దేశవ్యాప్తంగా ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్న 99 ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.9020 కోట్ల అదనపు బడ్జెట్ కేటాయించేందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద వివిధ రాష్ట్రాల్లో చేపడుతున్న ప్రాజెక్టుల నిర్మాణానికి ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం ఆరు శాతం వడ్డీతో నాబార్డు ద్వారా రాష్ట్రాలకు అందజేయనుంది. ఈ మేరకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో సమావేశమైన క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది.

సత్వర సాగునీటి లబ్ది కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం నిర్ణయం తీసుకుంది. 2019 డిసెంబర్ లోగా ఈ 99 ప్రాజెక్టులను పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు కేంద్ర ఆర్థికమంత్రి గతంలో ప్రత్యేక దీర్ఘకాల సాగునీటి నిధిని ప్రకటించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి నాబార్డు నుంచి కేంద్రం ఆరు శాతం వడ్డీతో రాష్ట్రాలకు రుణాలు అందజేస్తోంది. ప్రాజెక్టులను నిర్ధేశిత కాలంలో పూర్తి చేసిన రాష్ట్రాలకు సంబంధించిన రుణాల భారం కేంద్రమే భరించనుంది. 2016-17 యేడాదిలో నాబార్డు మొత్తంగా రూ.9086 కోట్లు పంపిణీ చేసింది.

ఇందులో ఒక్క పోలవరం ప్రాజెక్టుకు రూ.2414.16 కోట్లు విడుదల చేసింది. మిగిలిన రూ.6671.86 కోట్లు మిగతా ప్రాజెక్టులకు కేటాయించింది. ఇదే యేడాదికి సంబంధించి కేంద్ర సాయంగా రూ.924.9 కోట్లు విడుదల చేశారు. ఇక 2017-18 యేడాదికి గాను దీర్ఘకాల సాగునీటి నిధి రూ.29,000 కోట్లు అవనుందని కేంద్రం అంచనా వేసింది. ఇందులో అదనపు బడ్జెట్ రూ.9020 కోట్లు అవసరమని భావించి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. బంగారం ఎగుమతులపై కేంద్రం కొన్ని ఆంక్షలు విధించింది. 22క్యారట్ల కంటే ఎక్కువ స్వచ్ఛత ఉన్న బంగారు ఆభరణాలు, ఇతర రూపంలో ఉన్న వాటి ఎగుమతులపై పూర్తిగా నిషేదించింది.


సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

71వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా వామపక్ష నేతృత్వంలోని త్రిపుర రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సర్కారు ప్రసంగాన్ని దూరదర్శన్‌లో, ఆలిండియా రేడియోలో ప్రసారం చేయకుండా కేంద్రం అడ్డుకోవడాన్ని సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తీవ్రంగా ఆక్షేపించారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విఘాత మని, రాష్ట్రాల హక్కులపై కేంద్రం జోక్యం చేసుకోవడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్రమోడీ సర్కారు హయాంలో దేశంలో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ కన్నా దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయంలో బీజేపీయేతర ముఖ్యమంత్రులు స్పందించాలని లేకపోతే కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు ముప్పు ఏర్పడే ప్రమాదముందని హెచ్చరించారు.

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్‌సర్కారు రాష్ట్ర ప్రజలనుద్దేశించి మంగళవారం చేసిన ప్రసంగాన్ని దూరదర్శన్, ఆలిండియా రేడియోలో ప్రసారం చేయలేదు. ప్రసంగంలోని అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. వాటిని సవరించుకుంటే ప్రసారం చేస్తామని పేర్కొన్నారు. దీనిపై బుధవారం సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీతారాం ఏచూరి మాట్లాడారు. కేంద్రం తీరును ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. 'ప్రజల చేత ఎన్నికైన ముఖ్యమంత్రులు స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా చేసే ప్రసంగాలకు సెన్సార్‌షిపు చేయాలనడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తెలియజేస్తోంది' అని విమర్శించారు. దీన్ని ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించబోమని స్పష్టం చేశారు.

'రాజ్యాంగంలో పేర్కొన్న సమాఖ్య వ్యవస్థకు పూర్తి విఘాతం'అని చెప్పారు. ఈ విషయంలో కేంద్రం వ్యవహరించిన తీరు రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ఈ అంశంలో బీజేపీయేతర ముఖ్యమంత్రులు స్పందించకుంటే కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు ముప్పు పొంచిఉందని హెచ్చరించారు. విజయదశమి నాడు ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రసంగాన్ని దూరదర్శన్‌లో ప్రసారం చేయడాన్ని ఈ సందర్భంగా ఏచూరి ప్రస్తావించారు. ప్రజల చేత ఎన్నికకాని వ్యక్తి ప్రసంగాన్ని దేశవ్యాప్తంగా ఎలా ప్రసారం చేశారని ప్రశ్నించారు. పైగా కేరళపై తప్పుడు ప్రచారాలు చేసేందుకు బీజేపీ నేతలు ఏర్పాటు చేస్తున్న విలేకరుల సమావేశాలను సైతం దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారాలు చేయడంలో మర్మం ఏమిటని నిలదీశారు. యూపీలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ రాష్ట్ర సీఎం ఆదేశించినందుకు పెద్దఎత్తున కేంద్ర బలగాలను, పోలీసులను దుర్వినియోగం చేశారని అన్నారు. 'ఆర్ఎస్ఎస్ ఆదేశాలకనుగుణంగా గణతంత్ర భారతదేశాన్ని అసహన హిందూరాష్ట్రంగా మార్చే కుట్రలో భాగంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుర్వినియోగం చేస్తున్నాయి' అని ఏచూరి విమర్శించారు.



'ఎర్రకోట బురుజు నుంచి ప్రధానమంత్రి చేసిన ప్రసంగంపై కూడా మాకు చాలా అభ్యంతరాలున్నాయి. నోట్లరద్దు తరువాత 1.75 లక్షల కోట్లు అనుమానిత లావాదేవీల ద్వారా వచ్చాయని ప్రధాని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఎంతమొత్తం నగదు బ్యాంకుల్లో జమ అయ్యిందో ఎందుకు చెప్పలేదు. నోట్లరద్దు నిర్ణయం తీసుకుని దాదాపు ఎనిమిది నెలలు కావొస్తోంది కానీ ఇప్పటి వరకు ఎంతమొత్తంలో నగదు జమ అయ్యిందో ఆర్‌బీఐ, ప్రధాని ఎవరూ చెప్పడం లేదు. నోట్లరద్దు నిర్ణయం ఓ పెద్ద కుంభకోణం. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారు. నకిలీ నోట్లను చట్టబద్ధం చేశారు' అని విమర్శించారు. పైగా కాశ్మీర్ సమస్యను ఆత్మీయ ఆలింగనం ద్వారా పరిష్కారం చూపుతామన్న ప్రధాన మంత్రి... గతంలో అభివృద్ధి ఖండం సభ్యులకు ఇచ్చిన వాగ్దానాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

'ప్రధానమంత్రి ప్రసంగంపై మాకున్న అభ్యంతరాలను పార్లమెంట్‌లో ప్రశ్నిస్తాం. అలాగే ఒకవేళ త్రిపుర సీఎం ప్రసంగంలో ఎవరైనా అభ్యంతరాలు వుంటే రాష్ట్ర అసెంబ్లీలో సమాధానం చెబుతారు. అంతేకానీ కేంద్రం ఎలా 'సెన్సార్‌షిప్ చేస్తుంది?' అని ప్రశ్నించారు. 'మాణిక్‌సర్కార్ త్రిపురలో 19 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇలాంటి సమస్య ఎన్నడూ ఉత్పన్నం కాలేదు' అని ఏచూరి వివరించారు. మరో ఆరు నెలల్లో రాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల దృష్ట్యా పెట్టుకునే కేంద్రం దురుద్దేశంతో ప్రసంగాన్ని అడ్డుకుందని ఓ ప్రశ్నకు జవాబుగా ఏచూరి చెప్పారు. ప్రసంగంలో రాజకీయ అంశాలున్నాయన్న ఓ విలేకరి ప్రశ్నకు స్పందిస్తూ.. 'రాజకీయ అంశాలుంటే తప్పేంటి? రాజకీయాల వల్లే కదా నరేంద్రమోడీ ప్రధానమంత్రి.. మాణిక్ సర్కార్ ముఖ్యమంత్రి అయ్యింది' అని అన్నారు. ఇక బీజేపీ సర్కారు మీడియా సంస్థలను నియంత్రిస్తూ, ప్రభావితం చేస్తూ 'తప్పుడు నిజాలను ప్రచారం చేస్తున్నాయని ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు. త్రిపుర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని అడ్డుకున్న అంశంపై గురువారం 18 ప్రతిపక్ష పార్టీలతో జరగనున్న సమావేశంలో లేవనెత్తుతామని వివరించారు.

శిశు మరణాల కేసులో వెలుగు చూస్తున్న వాస్తవాలు

ఔషధాలకు నిధులు కేటాయించని ప్రభుత్వం

- ఔషధాల తలసరి వార్షిక బడ్జెట్ రూ.152.62
- వాస్తవాలను కప్పిపెడుతున్న కేంద్ర దర్యాప్తు బృందం
- కేంద్రం వాదనను ఖండిస్తున్న ఆస్పత్రి రికార్డులు

లక్నో/గోరఖ్‌పూర్ : గత శుక్రవారం గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్‌దాస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో సంభవించిన శిశుమరణాల కేసులో దిగ్భ్రాంతికర వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఈ వైద్య కళాశాల ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్లు మాత్రమే కాక, ఔషధాల సరఫరా కూడా పూర్తిగా నిలిచిపోయినట్టు తెలుస్తోంది. ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపరుస్తామని స్వయంగా ముఖ్యమంత్రి ఆదిత్యనాద్ ప్రకటించినా ఇక్కడి అనేక మంది రోగులు, వారి బంధువులు ప్రయివేటు షాపుల నుండి ఔషధాలను కొనుగోలు చేయాల్సిన దుస్థితి కొనసాగుతోంది. ప్రయివేటు షాపులనుండి ఔషధాలు కొనుగోలు చేసుకోవాలంటూ వైద్యులే తమకు సూచిస్తున్నారని కొంత మంది రోగులు ఫిర్యాదు చేస్తున్నారు.



ఆస్పత్రి తలసరి వార్షిక బడ్జెట్ రూ.152.62

గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆస్పత్రికి ఏటా వేలాది మంది రోగులు మెదడువాపు వ్యాధి, మెనింజైటిస్ వంటి వ్యాధులతో వస్తుంటారు. ఏటా దాదాపు 4 లక్షల మందికి పైగా రోగులు వచ్చే 955 బెడ్‌లు ఉన్న ఈ ఆస్పత్రికి ఔషధాల బడ్జెట్ కేవలం రూ.5.32 కోట్లు మాత్రమేనని రాష్ట్ర ఆర్థికశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 150 బెడ్‌లకు మాత్రమే అత్యవసర చికిత్సకు వెంటిలేటర్స్ అందుబాటులో వున్నాయి. ఈ ఆస్పత్రికి వచ్చే రోగులకు అందించే చికిత్సకోసం ప్రభుత్వం రూ. 152.62ల తలసరి వార్షిక బడ్జెట్‌ను కేటాయిస్తోం దని నిపుణులు చెప్పారు. తమ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై వుండే పేషెంట్‌కు రోజుకు రూ. 5 వేల నుండి 8 వేల వరకూ ఖర్చవుతోందని, సగటున బెడ్‌కు వెయ్యి రూపాయల నిధులైనా అవసరమని ప్రముఖ వైద్య నిపుణుడు ప్రొ.దేవేంద్రగుప్తా వివరించారు. ప్రభుత్వం ఈ ఆస్పత్రి బడ్జెట్ పెంపుదలపై ఇప్పుడైనా దృష్టిసారించాల్సిన అవసరం వుందని, ఆస్పత్రికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు లేకపోవటంతో రోగులు తమకు అవసరమైన మందులు, వైద్య పరికరాలను బయటి నుండే కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు.

రోజులు గడిచినా మెరుగుపడని పరిస్థితులు

గడచిన 24 గంటల్లో ఈ ఆస్పత్రి ఎన్‌సెఫలైటిస్ వార్డులో మరో ఐదుగురు చిన్నారులు కనుమూశారు. దీనితో ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటి వరకూ 145 మరణాలు నమోదయినట్టు తెలుస్తోంది. శుక్రవారం నాటి శిశుమరణాలకు ఆక్సిజన్ కొరతే ప్రధాన కారణమని చెప్పలేమని బుధవారం ఈ ఆస్పత్రిని సందర్శించిన ఢిల్లీ వైద్య నిపుణుల బృందం వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేసింది.

కేంద్రం వాదనను ఖండిస్తున్న ఆస్పత్రి రికార్డులు

శుక్రవారం నాటి మరణాలలో అధికశాతం మేర మెదడు వాపు వ్యాధితో జరిగినవేనంటున్న ప్రభుత్వ వాదన అవాస్తవమని ఆస్పత్రి రికార్డులు వివరిస్తున్నాయి. నవజాత శిశువులకు మెదడు వాపు వ్యాధి లక్షణాలుండవని న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డా.దినేష్ కపిల్ చెప్పారు. శుక్రవారం నాటి శిశు మరణాల జాబితాలో అధికశాతం మంది నవజాత శిశువులేనని, వీరందరికీ అత్యవసర వైద్యచికిత్స అవసరమన్న విషయాన్ని ఆస్పత్రి రికార్డులు సూచిస్తున్నాయని అన్నారు. ఇటువంటి కేసులకు మాత్రమే వెంటిలేటర్లు అవసరమవుతాయన్నారు.

నాలుగో 'బ్లూవేల్' మరణం

- కేరళలో ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య
- ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..

న్యూఢిల్లీ : దేశంలో బ్లూవేల్ చాలెంజింగ్ గేమ్ ఆడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకొస్తున్నాయి. ఈఆట ఆడుతూ దేశంలో ఇదివరకు ముగ్గురు చనిపోగా.. బుధవారం మరో ఘటన వెలుగులోకొచ్చింది. కేరళకు చెందిన ఐటీఐ విద్యార్థి సావంత్(22).. బ్లూవేల్ ఆటకు బానిసై గతనెలలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని సావంత్ తల్లి.. పోలీసులకు బుధవారం తెలిపారు. ఆన్‌లైన్ ఆటలకు బానిసైన సావంత్ రాత్రంతా నిద్రపోయేవాడు కాదని తెలిపాడు. మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌లో ఎప్పుడు చూసినా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ ఉండే వాడని చెప్పారు. సావంత్‌ను పలుమార్లు కౌన్సెలింగ్ సెంటర్లకు తీసుకెళ్లినా ఫలితం దక్కలేదన్నారు. చేతిపై వివిధ ఆకారాలు వచ్చేలా బ్లేడుతో కొన్నిసార్లు కోసుకున్నాడని తెలిపారు. అయితే డిప్రెషన్‌తోనే ఇలా చేశాడని భావించామన్నారు. కానీ, కొద్ది రోజులుగా బ్లూవేల్ గురించి వస్తున్న కథనాలు చూసినప్పుడు సావంత్ చేతిని కోసుకోవడానికి, ఆత్మహత్యకు చేసుకోవడానికి అసలు కారణం తెలిసొచ్చిందన్నారు.

లింకులు తొలగించకుంటే కఠిన చర్యలు: రవిశంకర్ ప్రసాద్

ఆత్మహత్యలకు కారణమవుతున్న బ్లూవేల్ గేమ్ లింకులను వెబ్‌సైట్ల నుంచి తొలగించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్నెట్ సంస్థలను కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ హెచ్చరించారు. లింకుల తొలగింపుపై గూగుల్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, గూగుల్, యాహూ సంస్థలకు ఇదివరకే ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన వివరించారు. ఈ ఆదేశాలను సోషల్‌మీడియా వెబ్‌సైట్లన్నీ తప్పకుండా పాటించాలని, ధిక్కరిస్తే చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.

1984 సిక్కులపై హింస..
235 కేసుల విచారణకు ప్యానల్

న్యూఢిల్లీ : 1984లో చోటుచేసుకున్న సిక్కులపై హింసాత్మక ఘటనలకు సంబంధించి 235కుపైగా కేసుల విచారణకు ఇద్దరు రిటైర్డ్ న్యాయమూర్తులతో ప్యానెల్‌ను అత్యున్నత న్యాయస్థానం ఏర్పాటుచేసింది. ఈ కేసులకు సంబంధించి దాఖలుచేసిన తుది నివేదికను పరిశీలించి, సమీక్షించి మూడు నెలల్లో నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించింది. గుర్లాండ్ సింగ్ కహ్లోన్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం పై ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసులకు సంబంధించి తన సూచనలను దాఖలు చేయాల్సిందిగా సుప్రీంకోర్టు పిటిషనర్ కహ్లోన్‌ను ఈ నెల 2న ఆదేశించింది. అల్లర్ల బాధితులకు వేగవంతంగా న్యాయం జరిగేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేయాలని కహ్లోన్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కాగా, బుధవారం ఈ కేసు విచారణకు వచ్చిన సందర్భంగా కోర్టు ప్యానెల్‌ను ఏర్పాటుచేస్తూ ఆదేశాలు జారీచేసింది.


ఎన్‌కౌంటర్‌లో లష్కరే టాప్ కమాండర్ హతం

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా టాప్ కమాండర్ ఆయుబ్ లెల్హారీ(27) హతమయ్యాడు. జిల్లాలోని కాక్పోరా ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు భద్రతాబలగాలు బుధవారం సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆయుబ్ హతమైనట్టు జమ్మూకాశ్మీర్ డీజీపీ ఎస్‌పి వేద్ ట్విట్టర్లో వెల్లడించారు. ఇదే ఘటనలో ఒక జవాను తీవ్రంగా గాయపడినట్టు తెలిపారు. ఆయుబ్ 17 ఏండ్ల వయస్సులోనే లష్కరే తోయిబాలో చేరాడని, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో అతనొకరని ఆయన చెప్పారు. షోపియాన్ జిల్లాలో ఇటీవల జరిగిన ఎదురుకాల్పుల్లో హిజ్‌బుల్ కమాండర్ యాసిన్ మటూ సహా ముగ్గురు ఉగ్రవాదులు హతమైన సంగతి తెలిసిందే. ఇదే ఘటనలో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

రైతు ప్రయోజనాలను విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

చెన్నై : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం తమ ప్రయోజనాలను విస్మరిస్తున్నాయని ఆరోపిస్తూ తమిళనాడులో అన్నదాతలు బుధవారం ఆందోళనకు దిగారు. వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో దాదాపు రెండు వేల మంది రైతులు కోయంబత్తూర్‌లో ఆందోళన చేశారు. జాతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలన్నిటినీ మాఫీ చేయాలని కోరుతూ దాదాపు ఏడాదిగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న రైతులు ఆత్మహత్యల నుండి తమను కాపాడాలంటూ నినదించారు. రుణమాఫీతోపాటు, ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 ప్రధాన కేంద్రాల్లో లక్షలాది మంది రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. 'మా సమస్యలను మరోసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఈ ఆందోళనను చేపట్టాం. వెంటనే ప్రభుత్వాలు రైతుల మొర ఆలకించాలి' అని డీఎంకే రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కెపి రామలింగం అన్నారు.

ఒబామా ట్వీట్‌ను
30లక్షల మంది ఇష్టపడ్డారు!



వాషింగ్టన్: అమెరికాలో శ్వేతజాతి, మరో గ్రూపు మధ్య వివక్ష పెరిగిపోతోంది. ఈనెల 12న వర్జీనియా రాష్ట్రంలోని చార్లొట్స్‌విల్లేలో జరిగిన ర్యాలీ హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్‌ఒబామా సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన ట్వీట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఒబామాకు ప్రజాధరణ ఏమాత్రం తగ్గలేదు. సోషల్ మీడియాలో ఆయన పోస్టులకు భారీ స్పందన లభిస్తోంది. చార్లొట్స్‌విల్లే నగరంలో ఇటీవల జరిగిన దాడులపై స్పందిస్తూ ఒబామా పెట్టిన ట్వీట్‌ను బుధవారం నాటికి 30లక్షల మంది నెటిజన్లు ట్వీట్ చేశారు. "పుట్టేటప్పుడు ఎవరూ ఇతరులను ద్వేషిస్తూ జన్మించలేదు. చర్మం రంగు, నేపథ్యం, మతాన్ని బట్టి వివక్ష చూపించడం పుట్టుకతో వచ్చినది కాదు.." అని వ్యాఖ్యానించారు. దక్షిణాఫ్రికా జాతిపిత నెల్సన్ మండేలా జీవితచరిత్ర 'లాంగ్ వాక్ టు ఫ్రీడమ్' నుంచి ఆయన ఈ మాటలను కోట్ చేశారు. మనుషుల మధ్య ఉండాల్సింది విద్వేషం కాదని, ప్రేమని బోధిస్తున్న వాక్యాలను మూడు ట్వీట్లుగా పెట్టారు. మేరీల్యాండ్‌లో 2011లో తీసిన ఫొటోను మొదటి ట్వీట్‌లో పోస్ట్ చేశారు. దీనికి 28 లక్షల పైచిలుకు లైకులు వచ్చాయి. 11 లక్షలకు పైగా రీట్వీట్ చేశారు. ఒబామా ట్వీట్‌కు 46 వేల మందిపైగా జవాబిచ్చారు. ట్విట్టర్ చరిత్రలో అత్యధిక మంది ఇష్టపడిన ట్వీట్‌గా ఇది రికార్డుకెక్కింది. పాప్ స్టార్ అరియానా గ్రాండే ట్వీట్‌ను ఒబామా ట్వీట్ వెనక్కు నెట్టిందని ట్విట్టర్ అధికార ప్రతినిధి వెల్లడించారు. మే నెలలో మాంచెస్టర్‌లో మ్యూజిక్ కన్సర్ట్‌పై ఆత్మాహుతి దాడి జరిగినప్పుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ అరియానా గ్రాండే పెట్టిన ట్వీట్‌కు అప్పట్లో అత్యధిక లైకులు వచ్చాయి. కాగా, చార్లెట్‌విల్‌లో.. శ్వేతజాతీయులకు, మరో వర్గానికి మధ్య ఈనెల12న జరిగిన ఘర్షణల్లో ముగ్గురు మృతి చెందారు. 50 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. దీంతో అక్కడ ఎమర్జెన్సీ ప్రకటించారు.

నైజీరియా మార్కెట్‌లో ఆత్మాహుతి దాడి

- 27 మంది మృతి

మైదుగురి : నైజీరియాలో శరణార్థుల శిబిరానికి దగ్గరలో ఉన్న మార్కెట్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో 27 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. మైదుగురి ప్రాంతానికి సమీపంలో మూడు చోట్ల ఆత్మాహుతి దాడులు జరిగాయని అన్నారు. కాగా, ఈ ఘటనకు పాల్పడినట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. బొకోహరామ్ ఉగ్రసంస్థకు చెందిన సభ్యులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఓహియోలో నల్ల జాతీయుడిపై పోలీసుల దాష్టీకం



వాషింగ్టన్ : అమెరికాలోని ఓహియో రాష్ట్రంలో జాత్యహంకార ఘటన చోటుచేసుకున్నది. ఓ నల్ల జాతీయుడిపై స్థానిక పోలీసులు మూకుమ్మడి దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చారు. తీవ్ర గాయాలపాలైనప్పటికీ అతన్ని స్టేషన్‌కు తరలించారని బాధితుని తరుపు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు నల్లజాతీయుడిని నేలపై పడేసి బూట్లతో తన్నుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఓహియో పోలీసుల తీరు పట్ల నెటిజన్లు మండిపడుతున్నారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...రిచర్డ్ హబార్డ్ (25) తన భార్యతో కలిసి క్లీవ్‌లాండ్ వైపుకు కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉండగా మైఖెల్ అమియట్ అనే అధికారి తనిఖీ నిమిత్తం వారి కారును ఆపారు. రిచర్డ్ దగ్గర రద్దయిన డ్రైవింగ్ లైసెన్స్‌ను గుర్తించారు. కారు ఆపాలని కోరినా మైఖెల్ ఏమాత్రం పట్టించుకోలేదని పోలీసులు ఆరోపించారు. ధ్రువీకరణ పత్రాలు చూపాలని అడిగినప్పటికీ స్పందించలేదని అన్నారు. రిచర్డ్‌కు మెరుగైన చికిత్స అందించిన తర్వాతే స్టేషన్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. కాగా, ఓహియో పోలీసుల తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. తన భర్త చెప్పిన సమాధానాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా పోలీసులు చితకబాదారని భార్య ఆరోపించింది. ' నల్లజాతీయుడా...నీ ముఖాన్ని మాకు చూపించొద్దు' అంటూ బూట్లతో తన్నారని వాపోయింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి తన భర్తపై దాడికి పాల్పడ్డ పోలీసులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేసింది.

ఫిలిప్పీన్స్‌లో నరమేధం

పోలీసు కాల్పుల్లో 32 మంది మృతి

- రోడ్రిగో ప్రభుత్వంలో పెరిగిన హక్కుల ఉల్లంఘనలు

మనీలా : ఫిలిప్పీన్స్‌లో మానవ హక్కుల ఉల్లంఘన ఘటనలు పెరిగిపోయాయి. తాజాగా, బులాకన్ ప్రావిన్స్‌లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై 32మంది పౌరులను మనీలా పోలీసులు కాల్చి చంపారు. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడిగా రోడ్రిగో డ్యుటెర్టే బాధ్యతలు చేపట్టిన తర్వాత డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగదారులపై కొరఢా ఝుళిపిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో, మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు పాల్పడుతున్న ముఠాల పట్ల పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నారు. అయితే, దాడుల్లో పట్టుబడ్డ వారిని విచారించకుండా మట్టుబెట్టడం పట్ల అంతర్జాతీయ హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి. రాజధాని మనీలాకు ఉత్తరం వైపున ఉన్న బులాకన్ ప్రావిన్సులో చోటు చేసుకున్న తాజా ఘటనలో 32 మంది పౌరులు మృతి చెందారు. మరో వంద మంది డ్రగ్స్ అక్రమ రవాణాదారులు అరెస్ట్ అయ్యారు. అంతేగాకుండా, ఈ దాడిలో భారీఎత్తున మత్తుపదార్థాలు, అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా, గతేడాది జులై30 న సదరన్ సిటీ ప్రాంతంలో జరిగిన ఆపరేషన్‌లో నగర మేయర్‌తోపాటు 16 మందిని పోలీసులు హతమార్చారు. 12 నగరాల్లో 26 యాంటీ డ్రగ్ ఆపరేషన్లు నిర్వహించినట్టు పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. 3.3 మిలియన్ల జనాభా ఉండే బులాకన్ ప్రాంతంలో గత కొద్ది మాసాల్లో డ్రగ్స్ కేసులో అనేక మందిని అరెస్టు చేయడమే కాదు, నేరాలకు పాల్పడినవారిని కాల్చిచంపారు. ఫిలిప్పైన్స్‌లో గతేడాది నుంచి జులై 26 వరకు 3,451 మంది నేరస్థులు హతమయ్యారు.



ఆఫ్రికాలో మట్టిచరియలు విరిగిపడి
600 మంది అదృశ్యం



ఫ్రీటౌన్: ఆఫ్రికాలోని సియెర్రా లియోన్‌లో భారీ వరదల వల్ల మట్టి చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 600 మంది అదృశ్య మయ్యారు. దేశ రాజధాని ఫ్రీటౌన్ అస్తవ్యస్తంగా మారిం ది. మట్టి చరియల కింద చిక్కుకున్న వారిని రక్షించాలని ఆ దేశాధ్యక్షుడు ఎర్నెస్ట్ బాయ్ కొరోమా ప్రపంచ దేశాలను అభ్యర్థించారు. మట్టిచరియలు విరిగిపడిన ఘటనలో 400 మంది మృతిచెందినట్టు అధికారులు ధ్రువీకరించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. రెడ్ క్రాస్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి.

చీటింగ్ కేసులో..
అమెరికాలో ప్రవాస భారతీయునికి జైలు

వాషింగ్టన్: వినియోగదారులను ఫోన్‌లో సంప్రదించి పలు స్కీమ్‌ల గురించి తప్పుడు సమాచారాన్ని ఇచ్చి మోసం చేసిన కేసులో ప్రవాస భారతీయునిపై మోపిన అభియోగాలు నిరూపితమయ్యాయి. అతనికి 40 నెలల జైలుశిక్ష, జరిమానా విధించినట్టు స్థానిక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం..ఆనంద్‌కుమార్ జయంతిలానాయి అనే వ్యక్తి గత కొంతకాలంగా అమెరికన్లకు ఎరవేసి తప్పుడు సమాచారాన్ని ఇచ్చాడు. వివిధ స్కీమ్‌ల పేరిట బాధితుల నుంచి 150,000 డాలర్లు (రూ.96,30,375)వసూలు చేశాడు. బాధితుల డెబిట్ కార్డులు, బ్యాంకు ఖాతాల వివరాలను తస్కరించాడు. బాధితులు పంపిన మనీట్రాన్స్‌ఫర్ వివరాలను సేకరించాడు. ప్రజలను తప్పుదోవ పట్టించి భారీ మొత్తంలో దోచుకున్నాడు. ఆనంద్‌కుమార్‌పై మోపిన అభియోగాలన్నీ నిరూపితం కావడంతో కోర్టు అతన్ని శిక్షించింది.

బ్రిటన్ విమానాశ్రయం సమీపంలో పేలుడు

లండన్ : బ్రిటన్‌లో ఎసెక్స్ విమానాశ్రయం సమీపంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో, దట్టమైన మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలికి చేరుకుని మంటను ఆర్పివేశాయి. పేలుడుకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనలో ఆస్తి నష్టం జరిగినట్టు అధికారులు తెలిపారు. పేలుడు సంభవించిన సమయంలో ఘటనాస్థలంలో ఎవరూ లేకపోవడంతో అదృష్టవశాత్తూ ప్రాణనష్టం తప్పిందన్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించామని అన్నారు.

రేపటి నుంచి 'ఇఫి' జాతీయ మహాసభలు



మాట్లాడుతున్న ఆర్ సుధాభాస్కర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఫి) 8వ జాతీయ మహాసభలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఆహ్వానసంఘం తెలిపింది. బుధవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభల ఆహ్వానసంఘం సమన్వయకర్త ఆర్ సుధాభాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేశ్వర్లు (కిరణ్), కోశాధికారి కె ఈశ్వరరావు మాట్లాడారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ మహాసభల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 450 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. 18వ తేదీ ఉదయం 10 గంటలకు పతాకావిష్కరణతో మహాసభలు ప్రారంభమౌతాయి. ప్రారంభసభలో సీఐటీయు జాతీయ అధ్యక్షురాలు హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌లో పాటు ఏడుగురు జాతీయ ఆఫీస్ బేరర్లు పాల్గొంటారు. మహాసభల నిర్వహణ కోసం కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని తెలిపారు. 2014 విద్యుత్‌బిల్లును పార్లమెంటులో ఆమోదం పొందేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోన్నదని, ఆ బిల్లులో విద్యుత్‌రంగాన్ని విధ్వంసం చేసే అనేక అంశాలు ఉన్నాయని చెప్పారు. వాజ్‌పేయి హయాంలో ప్రారంభమైన విద్యుత్ సంస్కరణలు ఆచరణలో పూర్తిగా విఫలమయ్యాయని, విద్యుదుత్పత్తి రంగంలో ప్రయివేటు పెట్టుబడుల వల్ల ప్రజలపై ఆర్థిక భారాలు పెరిగాయని వారు తెలిపారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, స్థిర, అస్థిర ఛార్జీల పేరుతో ప్రయివేటు సంస్థలకు అప్పనంగా ప్రజాధనాన్ని దోచిపెట్టేలా కేంద్రప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. కేంద్రం రూపొందించిన విద్యుత్‌బిల్లులో 'కంటెంట్-క్యారియర్' విధానం వల్ల విద్యుత్‌రంగం మరింత నష్టాలకు గురౌతుందని చెప్పారు. ఈ మహాసభల్లో విద్యుత్‌రంగ సంస్కరణలు, ఉద్యోగుల పాత్ర, కాంట్రాక్ట్ విధానం ద్వారా శ్రమదోపిడీ వంటి అనేక అంశాల్ని చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటామని తెలిపారు.

రాష్ట్రాల హక్కుల్ని హరించేందుకే జీఎస్టీ

దాడులు చేస్తూ కలిసిపోదామనడం సిగ్గుచేటు

- సీఐటీయూ సెమినార్‌లో ఎల్ఐసీ నేత తిరుపతయ్య



మాట్లాడుతున్న తిరుపతయ్య

నవతెలంగాణ-మహబూబాబాద్

రాష్ట్రాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వాలు వసూలు చేసే పన్నులను 'ఒకే దేశం ఒకే పన్ను' పేరుతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తీసుకొచ్చి రాష్ట్రాల హక్కులను హరించి వేస్తోందని ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు తిరుపతయ్య విమర్శించారు. మహబూబాబాద్ జిల్లాలోని స్థానిక వర్తకసంఘం భవనంలో తోటభిక్షం ఆధ్వర్యంలో "జీఎస్టీ-వివిధ రంగాలపై ప్రభావం' అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ...ఒకేదేశం ఒకే పన్ను పేరుతో కేంద్ర ప్రభుత్వం చిరువ్యాపారులను రోడ్డుకీడుస్తోందన్నారు. పన్నులు విధించడంలో ప్రామాణికత పాటించలేదన్నారు. చిన్న రాష్ట్రాలు, ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీసేలా జీఎస్టీ విధానముందన్నారు. పేద కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తోందని, మధ్యతరగతి వ్యాపారిపై అదనపు భారం పడుతోందని వాపోయారు. చిన్న చిన్న కిరాణాకొట్టుదారులు కూడా కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్లు కొనాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. వెంటనే జీఎస్టీ పన్నులను తిరిగి పరిశీలించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు మాట్లాడుతూ.. దేశంలో మైనార్టీలపైనా, దళితులపైనా బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని వాపోయారు. మరోవైపు "ప్రజలారా కలిసిపోదాం" అని మోడీ ప్రభుత్వం పిలుపు నివ్వడం సిగ్గుచేటన్నారు. జీఎస్టీ వల్ల ఆర్థిక నియంతృత్వం సాధించమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలో చేనేత, బీడీ, గ్రానైట్, పరిశ్రమలు జీఎస్టీ వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. కార్మికులు తమ హక్కులు కోల్పోతున్నారన్నారు. మానవత్వం లేకుండా వికలాంగ పరికరాలకు కూడా పన్ను విధించారన్నారు. అణగారిన ప్రజలపై పన్నులు విధించడం దేశభక్తా అని విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా ఆర్భాటలకు పోయి ప్రకటనలు చేస్తోందన్నారు. హక్కుల కోసం, ఉపాధి భద్రత కోసం కార్మికులు ఉద్యమాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంట ఉపేందర్, ఆకుల రాజు, పాల్గొన్నారు.

లోక్‌సత్తా 16జిల్లాల అధ్యక్షుల నియామకం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర లోక్‌సత్తా పార్టీ 16 జిల్లాల అధ్యక్షులను నియమించినట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రవీందర్ తెలిపారు. మిగిలిన జిల్లాల అధ్యక్షులను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీరితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అల్లేని నిఖిల్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌రావు, అధికార ప్రతినిధులుగా జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బాలస్వామి, కార్యదర్శిగా జయంత్‌ను నియమించారు.

ఉద్యోగ వ్యతిరేక చర్యలను విడనాడండి...

- 'పీర్‌లెస్'కు సీఐటీయూ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీర్‌లెస్ సంస్థ అనుసరిస్తున్న ఉద్యోగ వ్యతిరేక చర్యలను మానుకోవాలని సీఐటీయూ హితవు పలికింది. అనేక ఏండ్ల నుంచి కంపెనీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఉద్యోగులను వీఆర్ఎస్ పేరుతో బయటకు పంపేందుకు యత్నించటం శోచనీయమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి ఎమ్.సాయిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ మనుగడ కోసం, సంస్థలోని ఉద్యోగుల మనుగడ కోసం న్యాయ పోరాటం చేస్తున్న వారికి నష్టదాయకమైన వీఆర్ఎస్ పథకాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యోగులు నిర్వహిస్తున్న ఆందోళనలకు సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున వారు పూర్తి మద్దతును ప్రకటించారు.

21న జంతర్ మంతర్ వద్ద ధర్నా

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాము అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామంటూ ఎన్నికల ప్రణాళికలో చెప్పిన కేసీఆర్.. అందుకు విరుద్ధంగా ఇప్పుడు రాష్ట్రంలో ప్రజాతంత్ర హక్కులను పూర్తిగా కాలరాస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. ధర్నాచౌక్‌ను రద్దు చేసిన సీఎం.. నియంతలా వ్యవహరిస్తున్నారని ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ధర్నాచౌక్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 21న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ప్రజలు, మేధావులు, అభ్యుదయవాదులకు ఆయన పిలుపునిచ్చారు.

21న ఉప రాష్ట్రపతికి పౌర సన్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉప రాష్ట్రపతి ఎమ్.వెంకయ్యనాయుడుకు ఈనెల 21న పౌర సన్మానం నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఇందుకోసం రాజ్‌భవన్‌లో అధికారులు ఏర్పాట్లను పూర్తి చేయనున్నారు. వెంకయ్య గౌరవార్థం అదే రోజు దిల్‌ఖుషా అతిథి గృహంలో ప్రభుత్వం విందును ఏర్పాటు చేయనుంది.

ఉమ్మడి జిల్లాల డీఎస్సీ కోసం నేడు విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఉమ్మడి జిల్లాల ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ గురువారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించనున్నట్టు డీఎడ్,బీఎడ్ అభ్యర్థుల సంఘం ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీనునాయక్, రవి, సరస్వతి తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త జిల్లాల ప్రకారం డీఎస్సీ నిర్వహిస్తే, 28 జిల్లాల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. 13వేలమంది విద్యావాలంటీర్లు పనిచేస్తున్నారనీ, ఆ ఖాళీలకు అనుగుణంగా డీఎస్సీ పోస్టులు పెంచాలని కోరారు.

గొర్రెల పంపిణీలో అంతులేని అవినీతి

- తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గొల్ల, కురుమలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న గొర్రెల పంపిణీలో అంతులేని అవినీతి చోటు చేసుకుంటుందని తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. అవినీతిని అరికట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాల యంలో గొర్రెలు, మేకల పంపెకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాల్వ నర్సయ్య యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భ ంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి వెంకట్రాములు మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకం కొనుగోలులో మధ్య దళారులను నియంత్రించి వృత్తిదారుల ద్వారానే గొర్రెలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

కాల్వ నర్సయ్య యాదవ్ మాట్లాడుతూ పట్టణాల్లోని గొల్ల, కురుమలకు వడ్డీలేని రుణాలిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 50 ఏండ్లు నిండిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పిం చాలని, ప్రమాదవశాత్తు మరణించిన వృత్తిదారుల కుటుంబానికి రూ.3వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు వౌడంగి శ్రావన్‌కుమార్, కటికరెడ్డి, బుచ్చన్న యాదవ్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఐటీఐఆర్‌పై ఎందుకంత నిర్లక్ష్యం

- కేటీఆర్‌కు దాసోజు శ్రవణ్ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిరుద్యోగులు ఉద్యోగాల కోసం పడిగాపులు కాస్తుంటే లక్షలాది మంది ఉద్యోగాలు కల్పించే అవకాశమున్న ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్‌వెస్టుమెంట్ రీజియన్ (ఐటీఐఆర్)ను రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కి, నిరుద్యోగుల నోట్ల మట్టి కొట్టిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఐటీ శాఖ మంత్రిగా ఉన్న పొన్నాల లక్ష్మయ్య కేంద్రంలోని 18 శాఖల నుంచి సాంకేతికంగా అన్ని అనుమతులు పూర్తి చేసినా కూడా తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఫలితంగా లక్షలాది మంది నిరుద్యోగుల పొట్ట కొట్టిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పథకాన్ని కొనసాగిస్తే ఆ పాలకులకు మంచి పేరు వస్తుందని కారణంతో కేటీఆర్ ఆ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.టీఆర్ఎస్ నాయకులు కమీషన్లు దండిగా తెచ్చి పెట్టే మిషన్ భగీరథ పథకంలో పావు వంతు ఈ పథకానికి కేటాయిస్తే ఏటా 50 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చేవన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కేటీఆర్ రాసిన లేఖలో పలు అనుమానాలున్నాయన్నారు.ఐటీఐఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

దళితులకు మద్దతిస్తే బహిష్కరిస్తారా?

పెత్తందారుల ఆగడాలను అరికట్టాలి: ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆశాలత

- అండగా ఉంటామని ఇందిరకు భరోసా


బాధితురాలిని పరామర్శిస్తున్న ఆశాలత

నవతెలంగాణ-వేములవాడరూరల్/వేములవాడ

దళితురాలికి మద్దతుగా మాట్లాడి, అండగా నిలిచినందుకు మహిళను కుల బహిష్కరణ చేస్తారా? అని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆశాలత ప్రశ్నించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం మల్లారంలో పెత్తందారుల చేతిలో కుల బహిష్కరణకు గురైన సామ ఇందిరను బుధవారం ఆమె పరామర్శించారు. జరిగిన పరిణామాలను, అవమానాలను ఆశాలతకు వివరిస్తూ ఇందిర కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం ఆశాలత మాట్లాడుతూ... భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న దళిత మహిళా రైతు కొంపెల్లి లక్ష్మిని అకారణంగా అడ్డుకుని కొందరు పెత్తందార్లు కులంపేరుతో దూషించారని తెలిపారు. బాధితురాలికి మద్దతుగా సాక్ష్యం చెప్పినందుకు ఇందిరారెడ్డిని సదరు పెత్తందారులు కుల బహిష్కరణ చేశారని వివరించారు. భూమిని కాజే యాలనే ఉద్దేశంతోనే లక్ష్మిని వేధించారని, అడ్డు చెప్పిన ఇందిర కుటుంబాన్ని బహిష్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె కుమార్తె వివాహానికి ఎవరూ వెళ్లకుండా అడ్డుకోవడం, తమ్ముడి వరుసైన వెంకట్‌రెడ్డి పెండ్లికి వస్తే అతనికి జరిమానా విధించడం సిగ్గుచేటన్నారు. పెత్తందారులను ధైర్యంగా ఎదుర్కొంటున్న ఇందిరకు ఐద్వా ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితురాలికి న్యాయం జరిగేవరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఇందిరను కలిసిన వారి లో ఐద్వా జిల్లా నాయకులు కల్పన, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుర్రం అశోక్, సీపీఐ(ఎం) వేము లవాడ కన్వీనర్ అశోక్, అడ్వకేట్ పిల్లి మధు ఉన్నా రు. అనంతరం కులబహిష్కరణ చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వేములవాడ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆశాలత ఫిర్యాదు చేశారు.

22న రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలు

- హోం మంత్రి నాయిని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లో రెడ్డి హాస్టల్‌ను స్థాపించి వంద సంవత్సరాలు పూర్తవుతున్నందున ఈ నెల 22న రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలను అధికారికంగా నిర్వహించనున్నట్టు హోం మంత్రి నాయిని నర్సింహరెడ్డి తెలిపారు. రాజాబహద్దూర్ ఎడ్యూకేషన్ సొసైటీకి నగర శివారులోని బుద్వేల్‌లో 10 ఎకరాల స్థలం, భవన నిర్మాణాలకు గాను రూ.10 కోట్లను ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేశారన్నారు.

బుధవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నిజాం కాలంలో విద్యా వికాసం కోసం రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. తెలంగాణ ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేసిన నిస్వార్థ కృషిని గుర్తు చేసుకుని ప్రతి ఒక్కరూ రాజా బహద్దూర్ వెంకట్‌రామ్‌రెడ్డికి నివాళులు అర్పించాలని తెలిపారు.

ఆ రెండు ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచండి

ఎస్సారెస్పీ రెండవ దశ, తుపాకులగూడెం ప్రాజెక్టులను 2018 జూన్ నాటికి పూర్తి చేయాలి

- నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశం


మాట్లాడుతున్న హరీశ్‌రావు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

శ్రీరామ్‌సాగర్ రెండవదశ, తుపాకులగూడెం ప్రాజెక్టుల పనులను 2018 జూన్ నాటికి పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. బుధవారం జలసౌధలో ఈ రెండు ప్రాజెక్టుల పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈ రెండు ప్రాజెక్టుల పనుల గురించి ఇకపై ప్రతివారం సమీక్షించాలని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. తుపాకులగూడెం బ్యారేజీ పూర్తయితేనే కాళేశ్వరం దేవాదుల ఎత్తిపోతల పంప్‌లు 10 నెలల కాలం పనిచేస్తాయని మంత్రి అన్నారు. తపాకులగూడెం బ్యారేజీ ద్వారా దేవాదుల ప్రాజెక్టులో 6 లక్షల ఎకరాల స్థిరీకరణ సాధ్యమవుతుందన్నారు. ఎస్సారెస్పీ రెండవదశ నుంచి పూర్వపు వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని కరువు పీడిత ప్రాంతాల్లో 4 లక్షల ఎకరాలకు సాగునీరందించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఎస్సారెస్పీ రెండవదశ కింద రూ. 1,321 కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. 2005 నుంచి 2014 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. కాకతీయ ప్రధాన కాల్వలో లైనింగ్ దెబ్బతినడం, పూడిక వంటి కారణాలతో వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో కరువు పీడిత ప్రాంతాలకు నీరందించలేక పోతున్నట్టు మంత్రి చెప్పారు. పూర్తి స్థాయిలో సాగునీటిని అందించడానికి ఆయకట్టు ప్రాంతంలో ఫీడర్ చానల్స్‌కు మరమ్మత్తులు చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ఈ పథకం ద్వారా పూర్వపు నల్లగొండ జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ అసెంబ్లీనియోజకవర్గాల పరిధిలో 2,13,175 ఎకరాలకు, ఖమం జిల్లాలోని పాలేరు, మధిర నియోజకవర్గాల పరిధిలో 75, 262 ఎకరాలకు, వరంగల్ జిల్లాలో వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్ నియోజకవర్గాల్లో 1,09,512 ఎకరాలకు సాగునీరందుతుందని మంత్రి గుర్తు చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకు సాగునీరందించాలని సీఎం కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటూ ఎమ్మెల్యేలు, ఎంపీల సహకారంతో సమస్యలను అధిగమించి సకాలంలో పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాది కాళేశ్వరంతో శ్రీరామ్‌సాగర్‌ను అనుసంధానం చేస్తున్నందువల్ల ఎస్సారెస్పీ రెండవదశ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. లోయర్ మానేర్ డ్యాం కింద ఉన్న కాల్వల్లో నీటి ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులూ లేకుండా చూడాలన్నారు. శ్రీరామ్‌సాగర్ నీరు ఇప్పటి వరకూ చూడని జయశంకర్ భూపాలపల్లి మహబూ బాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు సాగునీరం దించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని చెప్పారు. ఈ సమావేశంలో ఈఎన్‌సీలు మురళీధ రరావు, నాగేంద్రరావు, వివిధ కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కలెక్టర్‌గా యోగితా రాణా

- ప్రభుత్వ ఉత్తర్వులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా యోగితా రాణాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఇప్పటి వరకూ నిజామాబాద్ కలెక్టర్‌గా పనిచేశారు. యోగితా రాణాను హైదరాబాద్‌కు బదిలీ చేసిన నేపథ్యంలో తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు నిజామాబాద్ జాయింట్ కలెక్టరే.. కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ ప్రపంచంలో ద్వేషాన్ని ద్వేషం ద్వారా నిర్మూలించలేం. ప్రేమ ద్వారా మాత్రమే దాన్ని పరిమార్చగలం. –గౌతమబుద్ధుడు.

సంపాదకీయం

అమెరికాలో ఫాసిస్టు హింస

గత వారాంతంలో వర్జీనియా రాష్ట్రంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల స్థాపకులలో ఒకరైన థామస్ జపర్‌సన్‌చే నిర్మించబడిన చార్లోట్‌విల్లే పట్టణంలో చెలరేగిన ఫాసిస్టు హింస అమెరికాలోను, యావత్తు ప్రపంచంలోను కోట్లాది ప్రజలను నిశ్చేష్టులను చేసింది. నాజీ అనుకూలురైన శ్వేతజాతి దురహంకారులు 46000జనాభా వున్న ఈ నగరంపై దాడి చేశారు. ఈ నాజీ మూకలు చేసిన దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. వీరు 32ఏండ్ల హీథర్ హేయర్‌ను క్రూరంగా హత్యచేశారు. అమెరికా సమాజం సామాజికంగా, రాజకీయంగా ఎంత భ్రష్టుపట్టి పోయిందో ఈ ఘటనలు తెలియ జేస్తున్నాయి. పోలీసులు ప్రేక్షక పాత్రను పోషిస్తూ చూస్తుండగా నాజీ గుండాలు ఒక విశ్వవిద్యాలయ ప్రాంతంలో బీభత్సాన్ని సృష్టిస్తూ విద్యార్థులను, ఆ ప్రాంతంలో నివసిస్తున్న ఇతరులను భయోత్పాతానికి గురిచేశారు. చట్టబద్ధమైన పాలనకు, స్థిరమైన ప్రజాస్వామ్యానికి ప్రతీకగా ఉన్నానని గొప్పలు చెప్పుకునే అమెరికా ప్రపంచ ప్రజలముందు నవ్వులపాలవుతున్నది. జరిగిన సంఘటనలపట్ల అమెరికాలో ప్రధాన రాజకీయ పార్టీలుగావున్న రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీలు, కార్పొరేట్ మీడియా మొసలి కన్నీరు కారుస్తున్నాయి. వీరు జారీచేస్తున్న ప్రకటనలలో నిజాయితీ కొరవడింది.

ప్రగతిశీల కార్యక్రమం ఆధారంగా కార్మిక వర్గాన్ని సమీకరించటం ద్వారా మాత్రమే ఫాసిజాన్ని ఎదుర్కోగలమని సుధీర్ఘ చారిత్రక అనుభవం చెబుతున్నది. అన్ని జాతులను, వర్ణాలను, కార్మికవర్గంలోని అన్ని విభాగాలను ఐక్యంచేయటం ద్వారా మాత్రమే పచ్చి ప్రగతి వ్యతిరేక మితవాదులకు వ్యతిరేకంగా పోరాటాన్ని నిర్మించగలం.

ఏ సామాజిక, రాజకీయ పరిస్థితులనుంచి ఈ హింస చెలరేగుతున్నదో సునిశితంగా పరిశీలించాలనే స్పృహ హింసకు వ్యతిరేకంగా వీరు జారీ చేస్తున్న ఖండనలలో లేదు. ఉదాహరణకు జరిగిన హింసకు బాధ్యత వహించాల్సిన శ్వేత దురహంకారులను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఖండించకపోవటం దుర్మార్గం అని న్యూయార్క్ టైమ్స్ పత్రిక రాసింది. తన స్వీయ ప్రయోజనాలకోసం విద్వేషపూరితమైన రాక్షసత్వాన్ని ట్రంప్ ప్రోత్సహిస్తున్నారని, విఫలమౌతున్న తన పాలననుంచి ప్రజల దృష్టిని మరల్చటానికి ఆయన ఇలా చేస్తున్నారని ఆ పత్రిక తన సంపాదకీయంలో రాసింది.



ట్రంప్ కాకుండా మరొకరైతే అమెరికా వీధుల్లో సోదర సౌభ్రాతృత్వం వెల్లివిరిసి ఉండేదని టైమ్స్ అభిప్రాయపడింది. అయితే 'ట్రంప్ దుష్టత్వం' అనే వ్యాఖ్యానం చరిత్రను విశ్లేషించజాలదు. శ్వేత భవనంలో ఒక దుష్టుడు తిష్టవేయటం, చార్లోట్‌విల్లేలోవలే హింస చెలరేగటంవంటి విషయాలు వ్యవస్థలో నెలకొన్న ఒక లోతైన సంక్షోభానికి చెందిన ప్రతీకలుగా ఉన్నాయి. తీవ్ర స్థాయి సంక్షోభానికి గురైన పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధించిన ఒక రాజకీయ, సామాజిక ఉత్పాదనగా ఫాసిజం ఉంటుంది. బూర్జువా వర్గ నియంతృత్వానికి అందుబాటులోవుండే పార్లమెంటరీ తెరలు, సాధారణ పోలీసు, మిలిటరీ వనరులు తన ఆధిపత్యంలోని సమాజాన్ని సమతౌల్యంలో ఉంచలేని స్థితిలో బూర్జువా వర్గం ఫాసిజాన్ని ఆశ్రయిస్తుంది. ఫాసిస్టు సంస్థల ద్వారా మధ్యతరగతిలోని మితవాదులను, కార్మికులలో నిరాశా, నిస్పృహలకు లోనైన భ్రష్టమూకలను పెట్టుబడిదారీ వ్యవస్థ సమీకరిస్తుంది. నిజానికి దవ్య పెట్టుబడి విశృఖలత్వంవల్లనే వీరందరూ ఇటువంటి నిరాశా, నిస్పృహలకు గురవుతారు. అమెరికాలో ఫాసిజం ఇంకా ప్రజా ఉద్యమంగా మారలేదు. అత్యంత మితవాద సంస్థల సమీకరణ ఇప్పటికీ జాతీయ స్థాయిలో నామమాత్రంగానే ఉన్నది.

ప్రజలలో మద్దతు పరిమితంగానే ఉన్నప్పటికీ ఈ పచ్చి అభివృద్ధి నిరోధక శక్తులకు శ్వేత భవనంతోసహా ప్రభుత్వంలో అత్యంత పలుకుబడిగల సమూహాల మద్దతు ఉన్నది. వీరికి రాబర్ట్ మెర్సర్ లాంటి బిలియనీర్ల ఆర్థిక సహకారం ఉన్నది. అంతేకాకుండా పోలీసు, మిలిటరీ యంత్రాంగంలో అనేకమంది క్రియాశీలురకు వీరిపట్ల సానుభూతి ఉన్నది. సుధీర్ఘ ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రక్రియల పర్యవసానంగా ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. నాలుగు దశాబ్దాలపాటు నిరంతర యుద్ధాలతో కొనసాగిన అమెరికా నియంతృత్వ విధానాలకు ప్రతిబింబంగా ఆయన నాయకత్వంలోని యంత్రాంగం అంతా ద్రవ్య పెట్టుబడిదారుల తోను, సైన్యాధికారులతోను నిండి ఉన్నది. డెమోక్రటిక్, రిపబ్లికన్ ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగిన హింస, డ్రోన్లను ఉపయోగించి రాజకీయ హత్యలు చేయటం, పోలీసులు చేస్తున్న శ్వేత జాతికి చెందనివారి హత్యల నేపథ్యంలో చార్లోట్‌విల్లే సంఘటనలు జరిగాయి.

ప్రగతిశీల కార్యక్రమం ఆధారంగా కార్మిక వర్గాన్ని సమీకరించటం ద్వారా మాత్రమే ఫాసిజాన్ని ఎదుర్కోగలమని సుధీర్ఘ చారిత్రక అనుభవం చెబుతున్నది. అన్ని జాతులను, వర్ణాలను, కార్మికవర్గంలోని అన్ని విభాగాలను ఐక్యంచేయటం ద్వారా మాత్రమే పచ్చి ప్రగతి వ్యతిరేక మితవాదులకు వ్యతిరేకంగా పోరాటాన్ని నిర్మించగలం. యుద్ధాలకు, సామాజిక అసమానతలకు, నిరుద్యోగానికి, తక్కువ స్థాయి వేతనాలకు, పోలీసు హింసకు, పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తిచేస్తున్న సకల అవలక్షణాలకు వ్యతిరేకంగా సాగే పోరాటాలతో ఫాసిజానికి వ్యతిరేకంగా నిర్మిచబడుతున్న పోరాటం మమేకం కావాలి. కార్మిక వర్గ ప్రయోజనాలకు ఒక రూపాన్నిచ్చి, ఆ ప్రయోజనాలను ముందుకుతీసుకు పోయేందుకు ఉపయోగపడే ఒక స్వతంత్ర రాజకీయ సంస్థ అవతరించకపోతే మితవాద శక్తులు లాభపడ తాయి. కాబట్టి కార్మికవర్గం సామాజిక పునాదిగా ఒక ప్రగతిశీల పార్టీ నిర్మాణాన్ని చేపట్టవలసిన ఆవశ్యకత నేడు అమెరికా ప్రజల ముందు ఉన్నది.

ప్రజావాణి

అభివృద్ధిని కబళిస్తున్న అవినీతి?

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారినాయి. సామాన్య ప్రజానీకం తమ పనుల నిమిత్తం మండల, డివిజన్, జిల్లా కేంద్రాలలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే పైసలివ్వనిదే ఫైలు కదలడం లేదు. లంచాలకు అలవాటు పడిన అధికారులు ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి ప్రజలను జలగల్లా పీడించి అక్రమ సంపాదనకు మొగ్గుచూపుతున్నారు. ఒకవైపు అవినీతి నిరోధకశాఖ అధికారులు అవినీతి అధికారుల భరతం పడుతూ అవినీతి తిమింగలాలను పట్టుకుంటున్నా అవినీతి తగ్గుముఖం పట్టడం లేదు. గత ప్రభుత్వంలో కంటే ప్రస్తుత ప్రభుత్వంలోనే అవినీతి తారాస్థాయికి చేరిందని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గ సమావేశంలో, ఉన్నతాధికారుల సమీక్షా సమావేశాలలో అవినీతికి దూరంగా ఉండాలని ప్రతీసారి చెబుతున్నా పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పులేదు. ముఖ్యంగా రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, ఖజానా కార్యాలయం, మండల ప్రజాపరిషత్, పోలీసు ట్రాన్స్ పోర్టుశాఖలలో అవినీతి జరుగుతోందనే ఆరోపణలున్నాయి. 'మీసేవ కేంద్రాలలో సైతం సర్టిఫికెట్లను నిర్దేశించిన ధర కన్నా అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో పౌరసేవా పత్రాలను (సిటిజన్‌ఛార్టర్) అమలు చేస్తేనే అవినీతి తగ్గుముఖం పడుతుంది. అవినీతి అధికారులను కఠినంగా శిక్షించాలి.


కేఎస్ఆర్, జయశంకర్‌పల్లి.

కల్తీ నివారించాలి...

ఆహార పదార్థాల్లో కల్తీ జరుగుతున్నది. ఈ మధ్య ప్రతిదానిలో కల్తీ బాగా జరుగుతున్నది. మార్కెట్‌లోకి కల్తీనూనెలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ కల్తీ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కల్తీ నివారించడంలో సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదు. నామమాత్రపు తనిఖీల కారణంగా మార్కెట్‌లో ఈ కల్తీ వస్తువులు రాజ్యమేలుతున్నాయి. కల్తీపై సంబంధిత అధికారులు ఉక్కుపాదం మోపి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవల్సిన అవసరం ఎంతైనా ఉంది. కల్తీని ప్రోత్సహించేవారిని కఠినంగా శిక్షిస్తే కల్తీ అసలు జరగదు.

షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్.

సంక్షోభంలో సేద్యం.. బక్కరైతు ఛిద్రం



పి. దామోదర్ ప్రసాద్

దేశంలో వ్యవసాయరంగం నానాటికీ సంక్షోభంలో కూరుకుపోతున్నది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాజస్థాన్, హర్యానా, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలలో పంటలకు కనీస మద్దతు ధరలకోసం ఆందోళనలు జరుగుతున్నాయి. తీవ్రమవుతున్న రుణభారం నుండి గట్టెక్కించడానికి బ్యాంకులు, సహకార సంఘాలు తదితర పరపతి సంఘాల నుండి తీసుకున్న రుణాలను రద్దు చేయాలని కోరుతూ రైతులు ఉధృతంగా సాగిస్తున్న ఆందోళనలు గ్రామీణ భారతంలో నెలకొన్న తీవ్ర దుస్థితికి నిదర్శనం. బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో పంట ఉత్పత్తులు, పాలకు గిట్టుబాటు ధర కోసం ఆందోళన సాగిస్తున్న రైతులపై జరిపిన కాల్పుల్లో ఆరుగురు రైతులు దుర్మరణం చెందినా, వివిధ రాష్ట్రాలలో, రాజధాని ఢిల్లీ వేదికగా తమిళనాడు తదితర రాష్ట్రాల రైతులు అర్ధనగ్నంగా, దిగంబరంగా, స్వమూత్రపానం చేసి వివిధ రీతుల్లో నిరసన తెలియజేసినా నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పట్టించుకోకపోవడం పల్లెలపై కమలనాథుల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం. దేశ వ్యవసాయరంగంలో ఇంతటి సంక్షోభం నెలకొన్నా ఉదయపు వేళ వార్తా ప్రసారాలు, పత్రికల్లో కొంత ప్రచారం మినహా నగరాలు, పట్టణాలలో నివసిస్తున్న పాలకవర్గాలు, ఆలోచనా పరులు పట్టించుకోవడం లేదు. నాలుగైదు నెలల క్రితం టమోటా, ఉల్లిగడ్డలు క్వింటాల్ రూ.100కు కూడా కొనేనాథుడు లేక వాటిని మార్కెట్‌లకు తెచ్చిన రైతులు సరుకు అక్కడే వదిలేసి, రోడ్లపక్క పారేసి లారీలు, ట్రాక్టర్ల బాడుగలు కూడా చెల్లించలేక దిగులుతో కుములుతూ ఇంటిబాట పట్టిన దయనీయ దృశ్యాలు ఎందరినో కదలించినా పాలకులు కండ్లు తెరవలేదు. వేల లీటర్ల పాలు కిందపోసి నిరసన తెలిపినా దయ కలుగలేదు. గత ఏడాది పప్పుదినుసులను విరివిగా పండించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపుతో వివిధ రాష్ట్రాల్లో విరివిగా పప్పుదినుసులను పండించగా ధరలు 60శాతం పడిపోవడంతో అమ్ముకోలేక అన్నదాతలు కుదేలైనారు.

> **కీలకమైన సేద్యపురంగంలో ఉత్పత్తిని ఉత్పాదకతను పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పథకాలు చేపట్టి రైతుల్లో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపాలి. మేలిరకం విత్తనాలు, ఎరువులు, సూక్ష్మపోషకాలు.. అవసరమైన పరపతి, మార్కెటింగ్ సౌకర్యాలు, గిట్టుబాటు ధర కల్పిస్తే దిగుమతుల అవసరం లేకుండా దేశాన్ని ఆహారోత్పత్తులు సాధించగలరు. కావలసింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకార ప్రోత్సాహాలే.**

పంటలు పండించడానికి అయ్యే ఖర్చుకు 50శాతం లాభం కలిపి రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతు కమిషన్ 2006లో కేంద్రానికి సమర్పించిన నివేదికలో సిఫార్సు చేసింది. యూపీఏ ప్రభుత్వం ఆ నివేదికను పట్టించుకోలేదు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి, రైతుల సంక్షేమానికి చర్యలు చేపడతామని మోడీ సహా బీజేపీ నేతలు వాగ్దానాలెన్నో చేశారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఆమేరకు హామీ ఇచ్చారు. తీరా గద్దెనెక్కాక ఆ విషయం అటకెక్కించారు. సేద్యపురంగ సంక్షోభం – రైతాంగ దుస్థితిపై ప్రజాప్రయోజన వ్యాజ్యం సుప్రీంకోర్టులో దాఖలు కాగా, స్పందించాలని కోర్టు కోరినప్పుడు స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తే ధరలు పెరిగి ప్రజలపై పెనుభారం పడుతుందని, ద్రవ్యోల్బణం పెరుగుతుందని కనుక వాటిని అమలు చేయలేమని ఎన్‌డీయే ఏలికలు చేతులెత్తేసాయి. ప్రజలను వంచించడంలో యూపీఏ – ఎన్‌డీఏ ఒక్కటేననే సంగతి జనానికి అర్థమౌతోంది.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లు పూర్తయిన సందర్భంగా మే 25నుండి జూన్ 15వరకూ దేశమంతటా భారీగా విజయోత్సవ సంబరాలు జరిపారు. అయితే పత్రికల్లో, టీవీల్లో భారీ ప్రకటనలు, లఘు ప్రచార చిత్రాలతో మోడీ ఘనవిజయ పరంపరను హోరెత్తించినా బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, యూపీ, రాజస్థాన్‌లలో ఆగ్రహంతో ఉన్న అన్నదాతలు పంటలకు కనీస మద్దతు ధరలు, రుణాల రద్దు కోరుతూ పెద్ద ఎత్తున ఉద్యమించడంతో కమలనాథుల సంబరాలపై నీళు చల్లినట్టయింది. తొలుత ఈ ఆందోళనలు ప్రతిపక్ష కాంగ్రెస్, ఎన్‌సీపీ ప్రేరేపితమని ప్రకటించిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, పంట ఉత్పత్తులను కనీస మద్దతు ధరల కంటే తక్కువ ధరకు కొంటే శిక్షార్హనేరమని ప్రకటించగా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ రెండున్నర ఎకరాల లోపు రైతుల రుణాలరద్దును ప్రకటించక తప్పలేదు. పంటలు ఎండిన ప్రాంతాల్లోగాక పుష్కలంగా పంటలు పండించిన ప్రాంతాలలో గిట్టుబాటు ధరల కోసం రైతాంగం ఉద్యమించడం గమనార్హం. ప్రధాని మోడీ స్వయంగా యూపీలో ఎన్నికల గోదారి ఈదినట్టే లెక్క. దానికి స్వయంగా రైతుల రుణాల రద్దు వాగ్దానం చేయడంతో కొత్తముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రుణాల రద్దును ప్రకటించక తప్పలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమదైన రీతిలో రైతు రుణాల రద్దును అమలు చేసినా రైతులకు ఇంకా తిప్పలు తప్పలేదు. గత ఏడాది క్వింటాల్ రూ.10వేలకు అమ్మిన కందుల ధర ఈ ఏడాది రూ.3వేలకు, కేజీ రూ.50 వరకు అమ్మిన ఉల్లిగడ్డల ధర రూ.5కు పడిపోవడంతో ఆ పంటలు పండించిన రైతులు దారుణంగా అప్పులపాలై నష్టపోయారు.

రాజస్థాన్‌లోని కోట జిల్లాలో వెల్లుల్లి పండించిన రైతులు గతేడాది క్వింటాల్ రూ.8వేలకు అమ్మగా ఈ ఏడాది ఆ రేటు సగం కంటే తక్కువ ధరకు పడిపోవడం (రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు మేలిరకం రూ.3,200 ఇవ్వజూపడం)తో హతాశు లైన రైతులు గిట్టుబాటుధర కోసం పోరుబాట పట్టారు. గత ఏడాది రూ.7వేలు అమ్మిన ధనియాలు ఈ ఏడాది క్వింటాల్ రూ.7వేలు అమ్మినా, మెంతుల ధర రూ.2,200కు, గత ఏడాది క్వింటాల్ రూ.10వేలు పలికిన పప్పుశెనగ ధర ఈసారి



రూ.4వేలకు, సోయాబీన్, గోధుమ ధరలు పడిపోవడంతో సాగుకు ఖర్చులు పెరగడం ఫలితంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పంజాబ్, హర్యానాలలో ఆవాలు క్వింటాల్ కనీస మద్దతు ధర 3,700 కాగా రైతులు 3,300కు, సజ్జలు క్వింటాల్‌కు రూ.1,260 మద్దతు ధర ప్రకటించగా 1,100కే అమ్ముకోవలసి వస్తోంది. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో గతంలో ఎన్నడూ లేనంత వర్షాభావం, దుర్భిక్షం వల్ల పల్లెప్రజలు తల్లడిల్లిపోయారు.

భారత వ్యవసాయ రంగంలో పల్లెల్లో నెలకొన్న ఈ తీవ్ర దుస్థితిపై పాలకవర్గాల నిర్లక్ష్యం ప్రమాదకరం. దేశ ఆహార భద్రతకు సేద్యపురంగ పురోగతే కీలకం. 130 కోట్ల దేశ జనాభా అవసరాలు తీరాలంటే అన్నదాతల కండ్లల్లో ఆనందం, ఇండ్లల్లో వెలుగులు నిండాలి. వేలకోట్ల దిగుమతులు వృథాయే తప్ప దేశ అవసరాలు తీర్చలేవు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయ రంగ వాటా 17శాతానికి తగ్గినా ఇంకా దేశ జనాభాలో సగం మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది సేద్యం.

ప్రభుత్వం బియ్యం, గోధుమ వంటి ఆహార సేకరణకు కనీస మద్దతు ధర ప్రకటించింది. రైతులను ఆదుకోవడానికే అయితే ఆచరణలో ఇది బడా వ్యాపారులు, మిల్లర్లకే లాభం చేకూరుస్తోంది. కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొని హెచ్చుధరలు మళ్ళీ ప్రభుత్వ సంస్థలకు అమ్మి కోట్ల లాభాలు గడిస్తున్నారు. చిన్న రైతులు తమ అవసరాలు పోనూ మిగిలితే కొంత సరుకును పట్టణాలలో ఉన్న ప్రభుత్వ సంస్థల వద్దకు రవాణా ఖర్చు భరించి తీసుకువెళ్ళే ఆర్థిక స్థోమత ఉండదు. అందువల్ల పంట కోతలు కాగానే అందుబాటులో ఉన్న వ్యాపారులకు తక్కువ ధరలకే అమ్ముకోవలసి వస్తోంది. ఇక రైతులను ఆదుకోవడానికి నెలకొల్పిన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ)లు దోపిడీ నిలయాలు. అక్కడకుమ్మక్కైన వ్యాపారులు నిర్వహించే వేలంలో రైతుల సరుకులను వారు నిర్ణయించిన ధరలకే తరుగులు, ఇతర ఖర్చులు పోను అమ్ముకోవాల్సిన దుస్థితి. ఇతర విపత్తుల వల్ల రైతులు మరింత అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్టు నిపుణుల పరిశీలనలో తేలింది. పల్లెల్లో ఉపాధి కరువై గ్రామీణ యువత కోటి ఆశలతో పట్టణాలకు వలస వెళుతోంది. అయితే వివిధ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేకవారికి అక్కడ ఉపాధి కరువై నిరుద్యోగ సైన్యంలో చేరిపోతున్నారు.

ఈ పరిస్థితుల్లో ఏం చేయాలి. భూమి కొరత, కమతాలు చిన్నవి కాకుండా నివారించడం వీలుకాదు. సహకార సేద్యం ద్వారా ఈ పరిస్థితిని కొంతమేరకు నివారించవచ్చు నంటున్నారు నిపుణులు. పాడిపరిశ్రమ రంగంలో సహకార పద్ధతిలో సాధించిన విజయాలను సేద్యపురంగానికి విస్తరిస్తే సత్ఫలితాలిస్తాయంటున్నారు.

రైతుల ఆదాయాన్ని వచ్చే ఐదేండ్లలో రెట్టింపు చేస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటించింది. 2016–17లో బీమా కంపెనీలు రైతుల నుంచి రూ21,500 కోట్ల ప్రీమియం వసూలు చేసినా రైతులకు పంపిణీ చేసిన మొత్తం రూ.714 కోట్లే. (3.31శాతం). దేశంలో వివిధ ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల మొండి బాకీలు రూ.10 లక్షల కోట్లకు చేరడంతో సేద్యం, తదితర రంగాలకు పరపతి విస్తరణకు నిధుల కొరత. ఈ బాకీల వసూలుకు ఇటీవల చర్యలు చేపట్టినా సత్ఫలితాలివ్వలేదు. కీలకమైన సేద్యపురంగంలో ఉత్పత్తిని ఉత్పాదకతను పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పథకాలు చేపట్టి రైతుల్లో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపాలి. మేలిరకం విత్తనాలు, ఎరువులు, సూక్ష్మపోషకాలు.. అవసరమైన పరపతి, మార్కెటింగ్ సౌకర్యాలు, గిట్టుబాటు ధర కల్పిస్తే దిగుమతుల అవసరం లేకుండా దేశాన్ని ఆహారోత్పత్తులు సాధించగలరు. కావలసింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకార ప్రోత్సాహాలే.

సెల్: 9440990381

సమస్యల నిలయాలుగా గురుకులాలు



కోట రమేష్

అట్టహాసంగా ప్రారంభించిన గురుకులాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించడమే లక్ష్యంగా కృషిచేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. జూన్ 12న రాష్ట్రంలో 169 గురుకులాల్లో బీసీలకు 119, మైనార్టీలకు50 చొప్పున ప్రారంభించి, వీటితోనే రాష్ట్రంలో కేజీ టూ పీజీకి అంకురార్పణ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా సగటున ఒక్కో విద్యార్థిపై రూ.1.25లక్షలు ఖర్చు పెడుతున్నట్టు కూడా చెప్పింది. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల విద్యాభ్యున్నతి కోసం చేపట్టిన ఈకొద్దిపాటి చర్యలను స్వాగతించాల్సిందే. కానీ పాత, కొత్త గురుకులాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరైనది కాదు. కేవలం కొన్ని తరగతుల వారీగా గురుకులాలు ఏర్పాటు చేసి కొద్ది మందికి మాత్రమే విద్యనందిస్తామని చెప్పడం, వీటితోనే కేజీ టూ పీజీ ఉచిత నిర్బంధ విద్యా బాధ్యత తీరినట్టు భావించడం సరైందికాదు.

ఇప్పుడున్న గురుకులాలతోపాటు అదనంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో 741 విద్యాసంస్థల్లో రాబోయే ఐదేండ్లలో 4,74,240 మందికి మాత్రమే విద్యనందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు వారికి అత్యంత భద్రతా సౌకర్యం కల్పిస్తూ కొన్ని ప్రత్యేక గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తునట్టు తెలిపింది. ప్రభుత్వ గురుకులాల్లో ఇంటర్ వరకు ఉచిత విద్య, భోజనం, వసతి కల్పిస్తామని పేద పిల్లలు ఇంగ్లీషు మీడియంలో మంచి చదువులు చదివి రేపటి భారతదేశాన్ని నడిపించాలన్న సంకల్పంతోనే కృషిచేస్తున్నట్టు తెలిపింది. అయితే ఇప్పటికే ఉన్న గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న వాటిలో మెరుగైన సౌకర్యాలు ఎలా కల్పిస్తుందోననే అనుమానాలున్నాయి. అందరికి ఉచిత విద్యనందించాలనే చిత్తశుద్ధి ఉంతే ఈ కొద్ది పాటి గురుకులాలే కాదు ఇంకా వేల సంఖ్యలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అందరికీ విద్యనందించాలనే చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో కేవలం మూడు లక్షల మంది విద్యార్థులే ఉన్నారా? రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యలోనే సుమారు 60లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. మరి వాళ్లందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు నామమాత్రమేనని చెప్పాలి. కేజీ టు పీజీ విద్య అందిస్తామని ఊదరగొడుతున్న ప్రభుత్వం రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎక్కడా తరగతులు ప్రారంభించలేదంటే దీని అమలు తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈసారికి 5వ తరగతి ప్రవేశాలు నిర్వహిస్తే కొన్ని వేలల్లో దరఖాస్తులొచ్చాయి. ప్రభుత్వం మాత్రం గురుకులానికి 200మందిలోపు మాత్రమే ఎంపిక చేయడం లక్షలాది మంది విద్యార్థులను నిరుత్సాహానికి గురిచేసింది. డిమాండ్‌కు అనుగుణంగా సీట్ల సంఖ్య పెంచడంలోనూ, విద్యార్థులను ఎంపిక చేయడంలోనూ సర్కార్ వైఫల్యం కనిపిస్తోంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న గురుకులాలే కాదు. ఇప్పటికే కొనసాగుతున్న వాటిపై తీవ్రనిర్లక్ష్యం కొనసాగుతోంది.

ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించిన అనేక గురుకులాల్లో విద్యార్థులను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇస్తామని చెపుతున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం అమలు చేయడంలేదు. మెదక్ జిల్లా కొల్చారంలో రూ.20 కోట్లతో నిర్మించిన బాలికల గురుకుల పాఠశాల భవనాన్ని అన్ని హంగులతో ఏర్పాటు చేసినా మంచి నీళ్ల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే 333మంది విద్యార్థినులు ఉండగా మరో 423మంది డిగ్రీ విద్యార్థులకు కూడా ఇందులోనే వసతి కల్పించడంతో 700కు పైగా విద్యార్థినులకు



బోరునీళ్లు సరిపోకపోవడంచేత స్నానాలు, మరుగుదొడ్లు వంటి సమస్యతో అవస్థలు పడుతున్నారు. ఈఅవస్థలు చూడలేక తల్లిదండ్రులు పిల్లలను ఇంటికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఖమ్మంలోని మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని 48 మంది విద్యార్థినులు అనారోగ్యానికి గురయ్యారు. ఖమ్మం జిల్లాలోని ఎస్సీ బాలికల పాఠశాలల్లో పక్క ప్రాంతాల పాఠశాలలను కలిపి ఒకే భవనంలో మూడు గురుకులాలను ఊరు చివరన మూసివేసిన ఇంజనీరింగ్ కళాశాలల్లో కొనసాగిస్తున్నారు. వాటిల్లో దాదాపు 1200మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి సరైన సౌకర్యాలు లేవు. తరగతి గదుల్లోనే పడుకోవ్వాలిన పరిస్థితి.

సహజంగా ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలంటే సమస్యల నిలయాలనే నానుడి ఉంటుంది. ప్రస్తుతమూ అది కనిపిస్తున్నది. పాత, కొత్త గురుకులాల్లో ప్రధానంగా కనీస మౌలిక సౌకర్యాలు లేకపోవడం ప్రభుత్వ అలసత్వాన్ని తెలియజేస్తున్నది. ముందస్తు ఏర్పాట్లు లేకుండా ఆర్భాటంగా పాత భవనాల్లో కొత్త గురుకులాలు ఏర్పాటు చేయడం, కొన్ని చోట్ల అసలు సౌకర్యాలే లేని వాటిల్లో ఏర్పాటు చేయడం విద్యార్థులను అవస్థలకు గురిచేస్తున్నది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభించిన అనేక పాఠశాలలు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. వాటిల్లో ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్లులేవు. దీంతో విద్యార్థులు బహిర్భూమికి వ్యవసాయ క్షేత్రాలు, బావుల వద్దకు వెళ్తున్నారు. ఈ పరిస్థితి ఇలా ఉంటే సూర్యాపేట జిల్లాలో గురుకులం ప్రారంభించిన మొదటిరోజే పాఠశాల మూతపడడం గమనార్హం. సౌకర్యాల్లేని పాఠశాలల్లో తాము చేరబోమంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసనకు దిగారు. ఈ మధ్యకాలంలోనే మంచిర్యాల జిల్లా జైపూరు గురుకుల పాఠశాల విద్యార్థి రాకేష్ బెడ్ పైనుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. జోగిపేట ఎస్సీ గురుకులంలో కీర్తన అనే ఇంటర్ విద్యార్థిని కూడా అనారోగ్యంపాలై మరణించిన సంగతి తెలిసిందే.

మనుగూరు ఎస్సీ బాలుర గురుకులం పరదాలు కట్టి ఏర్పాటు చేశారు. సిబ్బంది, లెక్చరర్స్ ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇబ్రహీంపట్నంలోని ఎస్సీ డిగ్రీ గురుకుల కాలేజీలో మంచినీటి సమస్య ప్రధానంగా ఉన్నది. బీసీ బాలికల గురుకులంలో కూడా సరిపడ మరుగుదొడ్లు, బాత్‌రూమ్స్ లేవు. పూర్తి స్థాయిలో బోధన సిబ్బంది లేరు. గురుకుల విద్యార్థులకు ప్రతీ సంవత్సరం 4 జతల బట్టలు ఇవ్వాల్సి ఉన్నది. ఇప్పటి వరకు కనీసం టెండర్లు కూడా పిలవలేదు. 4 రంగారెడ్డి జిల్లా నల్లకంటి ఎస్సీ బాలికల గురుకులంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నది. మునుగోడు, చండుపట్లలో ఏర్పాటు చేయాల్సిన పాఠశాలలను కూడా నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలోనే పెట్టారు.

అందరికీ నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఎంచుక్ను మార్గం అమలు జరగాలంటే ఈరాష్ట్రంలో వేలాది గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలి. కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్య అమలుకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి. గురుకులాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలి. అన్నింటికీ సొంత భవనాలు నిర్మించాలి. గతంలో పెంచిన మెస్ చార్జీలు, మోనూను పకడ్బందీగా అమలు చేయాలి. మహాత్మ జ్యోతిబాపూలే పేరుతో ప్రారంభించిన గురుకులాల్లో ఇవన్నీ అమలు జరిగినప్పుడు మాత్రమే సార్థకత ఏర్పడుతుంది.

సెల్: 9618339490

మెయిల్ @ నవతెలంగాణ

మంచితనానికి తావులేదు

ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్‌లోని జీఆర్‌డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ అందుబాటులో లేని కారణంగా సుమారు 60మంది చిన్నారులు మృతిచెందడం బాధాకరం. ఆ ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్ కఫీల్‌ఖాన్ మాత్రం చిన్నారి పిల్లల ఆర్తనాధాలు విని ప్రాణాలు కాపాడేందుకు సొంత ఖర్చుతో సిలెండర్లు తెప్పించి కొందరి చిన్నారుల ప్రాణాలు కాపాడినందుకు అతన్ని బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం సమంజసమా? అతని మంచితనం సేవాభావం అతనికి శాపమైందా? అక్కడి ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్ పాలనలో ఇంతటి నిర్లక్ష్యం ఎందుకు జరిగింది? ఆక్సిజన్ సరఫరా చేసే వారికి బకాయిలు చెల్లించి ఉంటే.. ఆక్సిజన్ అందుబాటులో ఉండేది. ఒక్క చిన్నారి కూడా చనిపోయేది కాదు. ప్రాణరక్షకుడిగా డాక్టర్ కఫీల్ చేసిన కృషిలో సేవాభావంతో కొందరు చిన్నారు బతికిబయటపడ్డారు. అయితే కఫీల్ అహ్మద్ పనికి ప్రశంసించి మెచ్చుకోవడం పోయి బాధ్యతల నుంచి తొలగించడం సిగ్గుచేటు. ఆరోగ్యశాఖ వారి కుట్రపూరిత చర్య అనకతప్పదు. ప్రభుత్వం తన చేతకాని తనం కప్పిపుచ్చుకోవడానికై ఒక మంచి డాక్టర్ నిస్వార్థంగా సేవలందిస్తే అతనిపై వేటు వేశారు. ఇకముందైనా ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి. డాక్టర్ కఫీల్ తొలగింపును రద్దుచేసి, విధుల్లో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– ప్రసాద్, నిజామాబాద్.

టమాటా, క్యాబేజ్...

కావలసిన పదార్థాలు : సన్నగా తరిగిన క్యాబేజ్- ఒక కప్పు, తరిగిన టమాటాలు-రెండు కప్పులు, ఉప్పు-తగినంత, మిరియాల పొడి-ఒక చెంచా, నిమ్మరసం-ఒక చెంచా, ఆలివ్ నూనె-ఒక చెంచా, తరిగిన క్యాప్సికం-సగం కప్పు.

తయారీ విధానం: తరిగిన క్యాబేజ్ ముక్కల్లో కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలుపుకొని ఐదు నిమిషాలు పక్కన ఉంచుకోవాలి. క్యాబేజ్‌లోనే తరిగిన టమాటా ముక్కలు, కొద్దిగా ఉప్పు, చెంచా మిరియాల పొడి, నిమ్మరసం, ఆలివ్ నూనె కలుపుకోవాలి. చివరగా సన్నగా తరిగిన క్యాప్సికం ముక్కలను కలుపుకొని సర్వ్ చేసుకుంటే సరిపోతుంది.



చాలా మంది ఎక్కువగా ఫ్రై చేసిన ఆకుకూరలు, వేపుళ్లను తినడానికి ఇష్టపడుతున్నారు. అలా తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే కూరగాయలను ఎక్కువగా నూనెలో వేయించినా, ఉడికించినా వాటిలో ఉండే పోషకాలు గాల్లో కలుస్తాయి. అలా ఉడికించిన కూరగాయలను తీసుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. కాబట్టి అప్పుడప్పుడు కూరగాయలను సలాడ్స్ మాదిరిగా ఉదయం, సాయంత్రం వేళ తీసుకుంటే చాలు ఆరోగ్యం, ఆనందం మీ సొంతం అవుతాయి. మరెందుకు ఆలస్యం ఇన్ని ఉపయోగాలు ఉన్న సలాడ్స్‌ను ఒకసారి ప్రయత్నించి చూడండి !

పసందుగా పచ్చికూరగాయలు...



వెజ్ పెప్పర్...

కావలసిన పదార్థాలు: క్యారెట్ ముక్కలు-ఒక కప్పు, బీన్స్-ఒక కప్పు, ఆలుగడ్డలు-ఒక కప్పు, బ్రోకోలి-ఒక కప్పు, తరిగిన క్యాప్సికం-ఒక కప్పు, ఉప్పు-రుచికి తగినంత, మిరియాల పొడి-ఒక చెంచా, వెన్న-రెండు చెంచాలు, తరిగిన వెల్లుల్లి-ఒక చెంచా.

తయారీ విధానం: క్యారెట్, బీన్స్, ఆలుగడ్డను బాగా ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాత్ర పెట్టి వెన్న వేసుకోవాలి. వెన్న కాస్త వేడి కాగానే వెల్లుల్లి, సన్నగా తరిగిన క్యాప్సికం ముక్కలను వేసి వేయించుకోవాలి. దీంట్లోనే ఉడికించిన కూరగాయలను వేసుకొని పది నిమిషాలు సిమ్‌లో పెట్టుకోవాలి. తర్వాత దాంట్లో ఉప్పు, మిరియాల పొడి కలుపుకుంటే చాలు వెజ్ పెప్పర్ సలాడ్ రెడీ !



సాబుదాన...



కావలసిన పదార్థాలు: నానబెట్టిన సగ్గుబియ్యం-ఒక కప్పు, క్యాప్సికం ముక్కలు-ఒక కప్పు, క్యారెట్ ముక్కలు-సగం కప్పు, కీరదోసకాయ ముక్కలు-సగం కప్పు, ఉప్పు-రుచికి తగినంత, జీలకర్ర పొడి-ఒక చెంచా , తరిగిన పచ్చిమిరపకాయలు- రెండు, తరిగిన కొత్తిమీర-కొద్దిగా, నిమ్మరసం-ఒక చెంచా.

తయారీ విధానం: ముందుగా సగ్గుబియ్యం 20 నిమిషాలు నానబెట్టుకోవాలి. తర్వాత నీటిలో ఒక చెంచా ఉప్పు వేసుకొని సగ్గుబియ్యాన్ని మెత్తగా ఉడికించుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత మరో పాత్రలో క్యాప్సికం ముక్కలు, క్యారెట్ ముక్కలు, కీర ముక్కలు, సన్నగా తరిగిన పచ్చిమిరపకాయలు వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో ఉడికించిన సగ్గుబియ్యం, జీలకర్ర పొడి, కొద్దిగా ఉప్పు, నిమ్మరసం, కొత్తిమీర తురుము కలుపుకుంటే సరిపోతుంది. రుచికరమైన సాబుదాన సలాడ్ రెడీ !

మిక్స్‌డ్ వెజ్ సలాడ్...

కావలసిన పదార్థాలు: కీరదోసకాయలు-రెండు, క్యారెట్‌లు-రెండు, టమాటాలు-రెండు, వెనిగర్-ఒక చెంచా, ఉప్పు-రుచికి సరిపడా, మిరియాల పొడి-సగం చెంచా, ఉల్లిముక్కలు-ఒక కప్పు, క్యాప్సికం-ఒకటి.

తయారీ విధానం: ముందుగా కూరగాయలను శుభ్రంగా కడగాలి. ఇలా కడిగిన తర్వాత అన్నింటినీ చిన్నచిన్న ముక్కలుగా కట్ చేసుకొని దాంట్లో కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలపాలి. ఇలా చేయడం వల్ల కూరగాయలు తొందరగా ఉప్పును పీల్చుకొని రుచిగా ఉంటాయి. ఉప్పు కలిపిన ఐదు నిమిషాల తర్వాత వెనిగర్ వేసి కలిపి కొత్తిమీర, పుదీనా ఆకులతో గార్నిష్ చేసుకుంటే సరిపోతుంది.



నేరప్రవృత్తికి కారణం సమాజమే



క్లారా విచ్మన్
(17 ఆగస్టు 1885 - 15 ఫిబ్రవరి 1922)

Women of the day

ఒక మనిషి నేరం చేశాడంటే అందుకు కారణం సమాజమే అని వాదించే స్త్రీవాద న్యాయవాది ఆమె. నేరం, న్యాయం, శిక్షలపై ప్రజలల్లో అవగాహన కల్పిస్తూ ఎన్నో వ్యాసాలు రాసారు. ఎన్నో ప్రసంగాలు చేశారు. ఆమె క్లారా విచ్మన్. జర్మన్-డచ్ న్యాయవాది, రచయిత, ఫెమినిస్ట్.

క్లారా హాంబర్గ్‌లో జన్మించినప్పటికీ నెదర్లాండ్స్‌లో ఎక్కువ కాలం ఉన్నారు. ఆమె తండ్రి ప్రొఫెసర్ ఆర్థర్ విచ్మన్. ఆయన ఖగోళ శాస్త్రం, భూగోళశాస్త్రంలో విశ్వవిద్యాలయ ప్రొఫెసర్‌గా పనిచేశారు. విద్యార్థిగా క్లారా విచ్మన్ స్త్రీవాద ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1902 లో ఆమె తత్వశాస్త్రం, జార్జి విల్హెల్ ఫ్రెడ్రిచ్ హెగెల్ రచనలను అభ్యసించారు. 1905లో ఆమె న్యాయవిద్యను పూర్తిచేశారు. ఆమె నేరాలను చూసే తీరుపై, న్యాయశాస్త్ర అవగాహన పై అనేక వ్యాసాలు రచించారు. నేరాలు, న్యాయవ్యవస్థ, శిక్ష అంశాలపై అనేక రచనలు చేశారు. 1919 లో ఆమె క్రైమ్ అండ్ పనిష్మెంట్ విధానానికి వ్యతిరేకంగా కమిటీని ఏర్పాటుచేశారు. 1920, మార్చ్ 21 న 'క్రైమ్, శిక్ష మరియు సమాజం'పై ఆమె చేసిన ప్రసంగం అత్యంత ప్రసిద్ధ చెందింది. ఈ ఉపన్యాసంలో సామాజిక అన్యాయాల నుండి నేర ప్రవృత్తి పెరుగుతుందన్న అభిప్రాయాన్ని ఆమె వెల్లడించారు.

మానవ హక్కులు, మహిళా సాధికారత కోసం పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ సోరోప్టిమిస్ట్ ఇంటర్నేషనల్‌లో కీలక సభ్యురాలిగా ఆమె పనిచేశారు. మహిళల హక్కులను క్లారా సమర్థించారు. హక్కులపై అవగాహన కల్పించేలా ఎన్నో రచనలు చేశారు. ఆమె పేరుతో ఏర్పాటుచేసిన 'క్లారా విచ్మన్ ఇనిస్టిట్యూట్'(1987-2004)లో మహిళలకు వర్కషాప్‌లు నిర్వహిస్తున్నారు. ❄

సహజమైన తేమ...



చర్మం తేమగా ఉండాలంటే.. అందరూ చెప్పేమాట 'ఆ క్రీమ్ వాడండి... ఈ మాయిశ్చరైజర్ ఉపయోగిచండి' అని. కానీ లోషన్లు, క్రీములు అందించే తేమకన్నా... చర్మం లోపలనుంచి వచ్చే తేమ చర్మ ఆరోగ్యానికి మంచిది. ఇది ముడతలురాకుండా కాపాడుతుంది. పొడిబారకుండా చేస్తుంది. మరి సహజంగా తేమ పొందాలంటే...

- మనం వాడే సబ్బుల్లో గాఢత ఎక్కువగా ఉంటుంది. అది చర్మంపై ఉన్న సహజమైన నూనెలను పోగొడుతుంది. దీంతో చర్మం పొడిబారుతుంది. లేదంటే దురదగా మారుతుంది. సబ్బులేని క్లెన్సర్లను తీసుకుని రోజుకు రెండుసార్లు ముఖం కడగండి.
- అలాగే వారానికోసారి ముఖాన్ని మసాజ్ చేయండి. కొబ్బరి, బాదం, ఆలివ్, జోజోబా వంటి నూనెలను అందుకు ఉపయోగించండి. ఇవి రక్త ప్రసరణను పెంచి చర్మం లోపలిపొరల వరకు వెళ్తుంది.
- రోజు సరిపడా నీటిని తాగండి. అంటే రోజుకు ఎనిమిది నుంచి పది గ్లాసుల నీటిని తప్పనిసరిగా తీసుకోండి. అయితే ఒక్కసారే రెండు మూడు గ్లాసుల్లా కాకుండా రోజంతాతాగుతూ ఉండండి. దానివల్ల చర్మం తాజాగా ఉంటుంది.
- కాఫీనో, టీనో తాగనిది రోజు గడవనివాళ్లు, పనిచేయలేని వాళ్లు చాలామంది ఉంటారు. కానీ ఎక్కువగా తాగడం వల్ల శరీరం డీ హైడ్రేట్ అవుతుంది. అదే డల్‌నెస్‌కు కారణమవుతుంది. కాబట్టి కెఫీన్ తీసుకోవడానికి తగ్గించండి.
- నీళ్లను తినండి. నీళ్లను తినడమేంటి? అనుకుంటున్నారా? నీళ్లు అధికంగా ఉండే ఆహారపదార్థాలను తినండి. ఆకు కూరలు, ఆకుపచ్చని కూరగాయలు, దోస, టమాట, పుచ్చ, బెర్రీస్ వంటివి రెగ్యులర్‌గా ఆహారంలో తీసుకోండి.
- ఇప్పుడు ఆఫీసులే కాదు... చాలా మంది ఇళ్లల్లో సైతం ఏసీలు ఉంటున్నాయి. కానీ ఈ ఎయిర్‌కండీషనర్లు చర్మానికి ప్రమాదకరం. తొందరగా పొడిబారేలా చేస్తాయి. అందుకే మరీ తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్న గదిలో ఉండటం మానేయండి. వీలయితే పెద్ద గిన్నెల్లో నీటిని పెట్టండి.
- వారానికోసారి సహజమైన ఫేస్ మాస్కులను ప్రయత్నిచండి. తేనె, పాలు, కలబంద, పెరుగు, గుడ్లు వంటివాటిని ఉపయోగించండి. ❄

24 గంటలు ఆగండి...

నా కొడుకు రోహణ్. బాస్కెట్ బాల్ ఆడుతున్నాడు. అది అతని ఫస్ట్ గేమ్. మొదటిసారి ఆడుతున్నందుకు ఎగ్జైటెడ్‌గా ఉన్నాడు. కొంత నెర్వస్‌గా కూడా ఫీలవుతున్నాడు. తల్లిగా నాకు అంతే ఎగ్జైట్‌మెంట్ ఉంది. ఎలా ఆడతాడో ఏమో అని. అయినా అతనికి ప్రోత్సాహమిచ్చి పొద్దున్నే స్కూల్‌కు పంపించాను. తరువాత నేనూ వెళ్లాను.

స్టేడియం చాలా సందడిగా ఉంది. కేవలం నేను ఒక్కదాన్నే కాదు.. నాలాగే చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడికి వచ్చారు. తెలిసినవాళ్లతో మాట్లాడుతున్నారు. కలిసిన వాళ్లను విష్ చేస్తున్నారు. నేను అలాగే రోహణ్ ఫ్రెండ్స్ పేరెంట్స్ కొందరిని విష్ చేసి వెళ్లి మంచి చోటు చూసుకుని కూర్చున్నాను.

టీమ్స్ స్టేడియంలోకి అడుగుపెట్టాయి. రోహన్‌కు నా కళ్లతోనే ధైర్యం చెప్పాను. ఆట మొదలైంది. అందరూ బాగా ఆడుతున్నారు. ఒకసారి రోహణ్ టీమ్‌కు పాయింట్ వస్తే... మరోసారి ప్రత్యర్థి టీమ్‌కు పాయింట్ వస్తోంది. అలా ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో చివరకు రోహణ్ టీమ్ కాకుండా ప్రత్యర్థి టీమ్ గెలిచింది. ఒక్కసారిగా నిరుత్సాహం ఆవరించింది.



ఆటోలో ఇద్దరం ఇంటికి వచ్చేటప్పుడు 'వాడు చేసిన తప్పులేమిటి? ఒప్పులేమిటి?' అన్నీ వివరంగా చెబుదాం... అనుకున్నా. వాళ్ల టీమ్ ఓడిపోవడానికి కారణాలేంటి, రోహన్ ఎందుకు బాగా ఆడలేకపోయాడు... అన్నీ అడిగేద్దాం అని బలంగా నిశ్చయించుకున్నా. కానీ ఇంటికి రాగానే పనిలో పడి... ఆ విషయాన్ని మరిచిపోయా. అందరం భోజనం చేసి పడుకున్నాం.

పొద్దున్నే లేచాను. రోహణ్ మ్యాచ్ జరిగి 24 గంటలు గడిచింది. బాబుతో చర్చించాలనుకున్న విషయాలు గుర్తుకొచ్చాయి. కానీ నిన్నటితో పోలిస్తే... అది అంత బలమైనవి అనిపించలేదు. అప్రధానమైనవి అనిపించింది. ఏముంది మొదటిసారి ఆడుతున్నాడు.. అవతలి వైపు ఉన్నది కూడా ఫ్రెండ్సే కానీ అందరూ బాగా ఆడారు. ఓడటం, గెలవడం అనేది చిన్న విషయం. చిన్న విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకుని, వాడితో చర్చించి ఎందుకు ఇబ్బంది పెట్టడం అనిపించింది. వెంటనే వివరిద్దామనుకున్న ఆలోచనను విరమించుకున్నా. 24 గంటల సమయం నాకో విషయాన్ని నేర్పించింది. కాబట్టి పిల్లలతో సీరియస్‌గా చర్చించేముందు 24 గంటలు ఆలోచించాలి అనిపించింది. ❄

నెయిల్ ఆర్ట్స్...



ఈమోజీ నెయిల్ ఆర్ట్స్ అంటే ఇష్టపడని యువత ఉండరు. గోళ్లపై వివిధ ఆకారాల్లో నెయిల్ పాలిష్‌ను డిజైన్స్‌లా వేసుకోవడం వల్ల డిఫరెంట్ లుక్ లో కనిపిస్తాయి. అలాంటి నెయిల్ ఆర్ట్స్‌ను ఒకసారి ప్రయత్నించి చూడండి !

- నెయిల్ ఆర్ట్స్ కు ముఖ్యంగా మూడు లేదా నాలుగు రంగుల నెయిల్ పాలిష్‌లు, సన్నటి బ్రష్‌లు, కాటన్, నెయిల్ షైనర్ ఉంటే సరిపోతుంది.
- ముందుగా గోళ్లను శుభ్రంగా కడిగి, కాటన్ క్లాత్‌తో తుడుచుకోవాలి. ఆ తర్వాత గోళ్లను అందంగా కట్ చేసుకోవాలి.
- అలా కట్ చేసుకున్న తర్వాత ఇష్టమైన నెయిల్ పాలిష్‌ను ఎంచుకొని దాన్ని గోళ్ల మీద సింగిల్ కోట్ మృదువుగా వేసుకోవాలి. ఆ తర్వాత దాని మీద నెయిల్ షైనర్ వేసుకొని ఆరిపోయే వరకు అలాగే ఉంచాలి.
- ఇలా చేసుకున్న తర్వాత సన్నటి బ్రష్‌తో ఇష్టమైన బొమ్మలను, వివిధ రకాల మొక్కలను, జంతువులను, పువ్వులను, వస్తువులను ఇలా డిజైన్స్ జాగ్రత్తగా వేసుకుంటే సరిపోతుంది. ❄

కష్టాన్నే నమ్ముకుని...

దిగుబడి లేని పొలం.. ఇద్దరు ఆడపిల్లల బాధ్యత వాళ్ల భవిష్యత్‌పై భయంతో పొట్ట చేతపట్టుకుని పట్నం వచ్చింది ఆమె. మట్టి, పచ్చని చెట్టు తప్ప మరోటి తెలియదు. ఆ మట్టినే నమ్ముకుంది. తోట పని చేయడానికి సిద్ధమైంది. నెలకు వెయ్యిరూపాయల జీతం. ఒకపూటైనా బిడ్డలకు కడుపునిండా అన్నం పెట్టవచ్చనుకుంది. ఏరోజు కూలీ ఆ రోజు గ్రాసానికే అన్నట్టుగా పరిస్థితి మారింది. బిడ్డలను సాకాలంటే తాను పస్తులు ఉండాల్సిందే. ఏదో చేయాలన్న తపనతో కష్టపడిన ఆమె ముప్పై రూపాయల కూలీ నుంచి మూడువందల రూపాయలు కూలి ఇచ్చే స్థాయికి ఎదిగింది. ఆమే... విజయలక్ష్మి. కష్టపడితేనే విజయం వరిస్తుందని నమ్మేవ్యక్తి.. ఆమె జీవనయానం.. ఆమె మాటల్లోనే..



"మాది జనగామ. ఇరవై ఏండ్ల కింద పట్నం వచ్చినం. ఊళ్లో పొలం ఉంది. నీళ్లు లేవు. బోర్లు వేసినా లాభం లేదు. పొలం చేసినా.. తిండి గింజలు కూడా రాకపాయే.. ఇద్దరు ఆడపిల్లలు. ఇక లాభం లేదని పొలం వేరేవారికి కౌలుకు ఇచ్చి పట్నం వచ్చినం. ఖాళీ జాగాలో రెండు తడకలు అడ్డంగా వేసుకుని చిన్న తావు ఏర్పాటుచేసుకున్నాం. మా ఇంటాయన ఎక్కువ కష్టపడలేడు. ఆ పని ఈ పని చేసినా.. పూట బత్తెం వచ్చేది కాదు. మా గుడిసెల పక్కనే ఒక ఆఫీస్ ఉండేది. అందులో పెద్ద తోట పెంచెటోళ్లు. తోట పనిచేయడానికి పోతుంటి. నెలకు వెయ్యి రూపాయలు ఇచ్చేటోళ్లు. పెద్దమ్మ గుడి దగ్గరనే ఈ ఆఫీస్ ఉండేది. ఆఫీస్ చుట్టూ ఉన్న మొక్కలకు రోజూ నీళ్లు పోయడం.. కొత్త మొక్కలు నాటడం నా పని. మా ఆఫీస్ పక్కనే ఒక నర్సరీ ఉండేది. అక్కడ మొక్కలకు ఆసరా నిచ్చే కట్టెలను తయారుచేసేవారు. అన్నం తినేయాలకు నేను అక్కడకు వెళ్లేదాన్ని. వారితో కూర్చొని కట్టలు కట్టేదాన్ని. కొద్దిరోజుల్లోనే నాకు నెట్‌లో నాచు పెట్టి చుట్టడం వచ్చింది.

చెరువులో నాచు తీసుకువచ్చి..

రోజుకు 30రూపాయల కూలీ. దాంతో ఎట్ల బతకాలే.. ఇంకేదైనా చేయాలన్న ఆత్రం నిద్రపట్టనిచ్చేది కాదు. కట్టెలకు నెట్ చుట్టడం వచ్చింది కదా.. తయారుచేసి సూద్దామని ఒకరోజు అనిపించింది. సక్కని కట్టెలు కొట్టుకువచ్చిన.. పొద్దుగాల మబ్బులనే లేచి చెరువుకు పోయిన. అక్కడ ఉన్న నాచు ఒక గంపకు ఎత్తుకున్న. ఇంటికి వచ్చి దాన్ని నెట్‌ల పెట్టి కట్టెలకు సూట్టిన. మొత్తం 30కట్టెలు అయినవి. నెత్తిన పెట్టుకుని జూబ్లీహిల్స్‌లో తిరిగిన.. ఒక బిల్డింగ్ ముందు నిలబడిన ఒకాయన.. లోనికి రమ్మని పిలిచిండు. భయపడుతూనే పోయిన.. నెత్తిమీది మోపు కిందికి దించిన. కట్టెలను చూసిన ఆ పెద్దమనిషి 'ఇలా కట్టెలకు చుట్టకూడదు. కరెంటు పైపులకు చుట్టాలే' అని చెప్పి.. నాచు ఎక్కడ తెచ్చినవు? అని అడిగారు.. చెరువుల తెచ్చిన అని సెప్పినా.. 'నాచు, నెట్ హైదర్‌గూడలో దొరుకుతయి. పోయి తెచ్చుకో' అని చెప్పిండు. ఆ అయ్య చెప్పవట్టే నేను ఈ రోజు ఎన్నో నర్సరీలకు నెట్ పైపులు అందిస్తున్న.

రెండు రోజులకు తొమ్మిది వందలు..

నెత్తిన మోపుతో ఒక నర్సరీకి పోయిన.. ముప్పై కట్టెలు తీసుకుని తొమ్మిది వందల రూపాయలు చేతిల పెట్టిండు. నాకు నోటమాటరాలే. రోజంతా కష్టపడితే ముప్పై రూపాయల కూలీ. రెండురోజులు కష్టపడితే తొమ్మిది వందలు. ఇందులో మూడు వందల రూపాయలు పైపులు, నాచు, నెట్‌కు ఖర్చుచేసినా మిగతా ఆరువందల రూపాయలు నా కష్టం. ఇక కూలీ వద్దు.. ఇదే బాగుంది అనుకున్నా. మరి వీటిని ఎట్ల అమ్మాలి అన్న ఆలోచన మళ్లీ నిద్రపట్టనియ్యలే..

ఒక నర్సరీ నుంచి మరో నర్సరీ

మొదట్ల కట్టెలు వేసిన నర్సరీకి పోయిన.. మీ దగ్గరకు వచ్చే వాళ్లకు సెప్పితే.. నేను రెండురోజుల్ల తయారుచేసి ఇస్త అని చెప్పిన. ఆ అన్న సరే అన్నాడు. వేరే నర్సరీల నుంచి అక్కడకు వచ్చేవాళ్లు కూడా ఆర్డర్స్ ఇచ్చిండ్రు. ఇప్పుడు హైదరాబాద్‌లో చాలా నర్సరీలకు, హైదర్‌గూడలోని షాపులకు మేమే తయారుచేసి ఇస్తున్నం.

మొదట్లో కిలో.. ఇప్పుడు కింటాళ్లు..

మొదట్ల రోజూ కిలో నాచు తీసుకువస్తె సరిపోయేది. ముప్పై పైపులకు వచ్చేది. ఆర్డర్స్ పెరగడంతో ఇప్పుడు ఉత్తరాఖండ్ నుంచే డైరెక్ట్‌గా నాచు తెప్పిస్తున్నాం. ఒకేసారి లారీ లోడ్ వస్తుంది. కొబ్బరి పీచు నాగోల్ నుంచి తీసుకువస్తున్నాం. రోజూ ముగ్గురు కూలీకి వస్తారు. నెట్ చుట్టడం నేర్పించిన దాసన్న, మా అల్లుడు పైపులకు కొబ్బరి పీచు చుడతారు. నేను, మా అమ్మ, మరో ఇద్దరు కలిసి రోజూ 50 వరకు పైపులకు నాచు పెట్టి, నెట్ చుడతాం. నర్సరీలు ఒకేసారి వందల్లో ఆర్డర్లు ఇస్తున్నాయి. ఆటో, ట్రాలీలో తీసుకుపోయి ఇచ్చివస్తాను.

రెండు అడుగుల నుంచి ఐదు అడుగుల వరకు వివిధ సైజుల్లో నెట్ కడతాం. నెలకు అన్ని ఖర్చులు పోనూ 15వేల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. ఆర్డర్లు ఉన్నయంటే రాత్రంతా నిద్రపోకుండా పనిచేస్తాం. ఎండాకాలం పని ఉండదు. చినుకులు పడగానే.. ఆర్డర్లు పెరుగుతాయి. ఇద్దరు బిడ్డల పెండ్లిల్లు చేసిన.. నేను ఇల్లు కట్టుకున్న... నాతో పాటు మరికొంతమందికి ఇదే జీవనాధారంగా మారింది"

వి. యశోద

ఇట్లచేద్దాం

ఆలుగడ్డలు ఉడికించిన నీటిని పారబోస్తుంటారు. అలా కాకుండా ఆ నీటిలో వెండి నగలను కాసేపు నాన బెట్టండి. తర్వాత ఒక బ్రష్ తీసుకొని శుభ్రం చేయండి. నగలు మిల మిల మెరుస్తాయి.

వైసీపీకి గంగుల ప్రతాప్‌రెడ్డి గుడ్‌బై

- రోజుకో మలుపు తిరుగుతున్న నంద్యాల ఉపఎన్నిక పోరు
- తటస్థంగా జనసేన, ఎంఐఎంలు



కర్నూలు : నంద్యాల ఉపఎన్నిక పోరు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇటీవలే ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి టీడీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి టీడీపీకి షాక్ ఇచ్చాడు. ప్రస్తుతం మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి వైసీపీని వీడి బుధవారం టీడీపీలో చేరారు. గంగుల సుదీర్ఘకాలం పాటు ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా పనిచేశారు. పార్లమెంట్ సభ్యుడిగానూ, రాజ్యసభ సభ్యుడిగానూ నంద్యాల డీవీజన్‌లో చక్రం తిప్పారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉన్న గోస్పాడు మండలంలో ఆయనకు పెద్దఎత్తున అనుచరగణం ఉంది. మొదటి నుంచి వైసీపీకి మంచి మెజారిటీ గోస్పాడు నుంచి వస్తుందని భావించిన టీడీపీ మండలంలో బాగా పట్టు ఉన్న పీపీ.నాగిరెడ్డిపై ఒత్తిడి పెంచారు. పీపీ.నాగిరెడ్డిని టీడీపీలో చేర్చుకునేందుకు ఆయనకు ఆర్థికంగా ఇబ్బందులు సృష్టించినా శిల్పా వెంటే నిలిచేందుకు మొగ్గుచూపారు. దీంతో టీడీపీ అధిష్టానం గంగుల ప్రతాప్‌రెడ్డిపై దృష్టి సారించింది. గంగులను టిడిపిలో చేర్పించేందుకు మాజీమంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, అచ్చెన్నాయుడు కీలక పాత్ర పోషించినట్లు తెలిసింది. మరోవైపు జనసేన, ఎంఐఎంలు తాము ఏ పార్టీకి మద్దతు ఇవ్వలేదని, తమ పార్టీలు తటస్థంగా ఉన్నాయని ప్రకటించడం గమనార్హం. నంద్యాల ఉపఎన్నిక ప్రారంభం నుంచి నాయకుల కుప్పిగంతులు పోలింగ్ నాటికి ఏ రూపం దాల్చుతాయోనని నంద్యాల ప్రజలు విసిగిపోతున్నారు.

రక్తమోడిన వంశధార

- నిర్వాసితులపై పోలీసుల లాఠీఛార్జి
- ఒకరి పరిస్థితి విషమం
- 40 మంది అరెస్టు

శ్రీకాకుళం : వంశధార రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతంలో బుధవారం నిర్వాసితుల రక్తం చిందింది. శ్రీకాకుళం జిల్లా హిరమండలంలోని తులగాం రెవెన్యూ పరిధిలోని పంట పొలాలను యంత్రా లతో అధికారులు చదును చేయిస్తున్న సమ యంలో అడ్డుకున్న నిర్వాసితులపై పోలీసులు అత్యంత పాశవికంగా లాఠీఛార్జి చేశారు. దీంతో పలువురుకి తీవ్రగాయాల య్యాయి. వారిలో పాడలి గ్రామానికి చెందిన పోలూరు శ్రీనివాసరావుకు పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. బాధితులకు వైద్యమంది ంచకపోగా పోలీసులు వారిని అరెస్టు చేసి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పాడలి, దుగ్గుపురం గ్రామాల పంట పొలాల్లోని మట్టి తవ్వకాలకు అధికారులు భారీ యంత్రాలను తీసుకొచ్చారు. పోలీసు బందోబస్తు మధ్య పనులకు ఉపక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామాల నిర్వాసితులు సుమారు 200 మంది అక్కడికి చేరుకున్నారు. పంటపొలాల్లో మట్టి తవ్వొద్దని వేడుకున్నా.. అధికారులు మట్టి తవ్వకం పనులు కొనసాగించేందుకు ఉపక్రమించడంతో నిర్వాసితులు అడ్డుకున్నారు. పోలీసులు వారిని అక్కడి నుంచి చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో పోలీసులు రెచ్చిపోయారు. వృద్ధులు, మహిళలు అనే తేడా లేకుండా లాఠీలతో విరుచుకుపడ్డారు. వాహనాలపై వస్తున్న నిర్వాసితులను గ్రామ పొలిమేరల్లో అడ్డగించి చిదకబాదారు. పోలీసుల దెబ్బలకు రక్తం ధారగా కారుతున్న నిర్వాసితులను సైతం వాహనాల్లోకి బలవంతంగా ఎక్కించి జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. సుమారు 40 మంది నిర్వాసితులను అరెస్టు చేశారు. వారిలో 21 మందిని మెళియాపుట్టి పోలీస్ స్టేషన్లో ఉంచినట్లు సమాచారం. పోలీసుల లాఠీఛార్జి సందర్భంగా గొడవలో జెఆర్‌పురం సీ.ఐ, వీరఘట్టం, లావేరు ఎస్‌ఐలతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పిహెచ్‌సికి తరలించారు. వార్తను సేకరించడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి విలేకరి ప్రసన్న కుమార్‌పై పోలీసులు లాఠీ ఛార్జి చేశారు. ఆముదాల స్టేషన్‌కు తరలించి, అనంతరం విడుదల చేశారు.

లాఠీఛార్జికి సీపీఐ(ఎం) ఖండన

వంశధార నిర్వాసితులపై లాఠీఛార్జిని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి వి. కృష్ణమూర్తి కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడారు. రైతులు కష్టపడి పండించు కుంటున్న పంటలను చంద్రబాబు ప్రభుత్వం దౌర్జన్యంతో ధ్వంసం చేయడాన్ని అడ్డుకున్న దుగ్గిపురం, పాడలి, తులగాం ప్రజలపై పాశవికంగా దాడి చేయడం అమానుషమన్నారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో పోలీసు లను మోహరింపజేసి నిర్వాసితులపై యుద్ధం ప్రకటించడం, ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. ఇటువంటి రాక్షస చర్యలను సీపీఐ(ఎం) ఖండిస్తోందని, వంశధార నిర్వాసితులకు అండగా నిలుస్తుందని తెలిపారు.



నిర్వాసితులను అరెస్టు చేస్తున్న పోలీసులు

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు : ఎస్పీ

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ త్రివిక్రమవర్మ హెచ్చరించారు. లాఠీఛార్జి అనంతరం పాడలి, దుగ్గుపురం ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆ తర్వాత హిరమండలం పోలీస్ స్టేషన్లో విలేకర్లతో మాట్లాడారు. పనులను నిర్వాసితులు అడ్డుకుంటే సహించేది లేదన్నారు. అదుపులోకి తీసుకున్న నిర్వాసితులను జిల్లా మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తామని చెప్పారు. నిర్వాసితులు సంయమనం పాటించాలని అన్నారు.

అడ్డుగా ఉందని కన్న కూతురినే అమ్మేసింది

విజయవాడ: కన్నపేగు పంచుకొని పుట్టిన కూతురు అని కూడా ఆలోచించకుండా ఓ వ్యభిచార గృహానికి అమ్మేసింది ఓ తల్లి. ఈ దారుణ ఘటన విజయవాడ నగరంలో పాయకాపురం ఉడా కాలనీలో జరిగింది.. 14 ఏండ్ల కుమార్తెను మూడు నెలల క్రితం వ్యభిచార గ హ నిర్వాహకులకు తల్లి విక్రయించింది. మూడు నెలలపాటు చిత్రవధ అనుభవించిన ఆ బాలిక నరకకూపం నుంచి తప్పించుకొని నున్న పోలీసులను ఆశ్రయించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టం మణి, చిన్నప్పలకు 14ఏండ్ల కుమార్తె ఉన్నది. మణి ప్రవర్తన నచ్చకపోవడంతో కొన్నేండ్ల క్రితం చిన్నప్ప ఆమెను వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటినుంచి ఆమె మల్లికార్జున్ అనే వ్యక్తితో సహజీవనం కొనసాగిస్తోంది. వీరిద్దరి అక్రమ సంబంధానికి అడ్డుగా ఉందనే కారణంతో కన్నతల్లే తన కుమార్తెను వ్యభిచారగృహ నిర్వాహకులకు అమ్మివేసింది.తనపై ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు నున్న పోలీస్ స్టేషన్‌లో తమ కుమార్తె అదృశ్యమైందంటూ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా.. అసలు విషయం వెలుగులోకి రావడంతో వారు నివ్వెరపోయారు.

బాలయ్యపై రోజా సంచలన వ్యాఖ్యలు

నంద్యాల : నంద్యాల ఉపఎన్నికకు సమయం దగ్గర పడుతున్నకొద్దీ.. రాజకీయం రసవత్తరంగా మారుతోంది. నంద్యాల ఉపఎన్నిక ప్రచారం సంద ర్భంగా వైసీపీనుద్దేశించి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు రోజా కౌంటర్ ఇచ్చారు. మహిళలను బాలకృష్ణ అగౌరవ పరుస్తున్నారని ఆరోపించారు. 'ఆడపిల్ల కనిపిస్తే ముద్దులు పెట్టండి, కడుపులు చేయండి' అంటారు.. అలాంటి వ్యక్తికి వైసిపిని విమర్శించే స్థాయి లేదని రోజా అన్నారు. బాలకృష్ణ అమాయకులు అని, ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదువుతారని వ్యాఖ్యానించారు. తల్లిపాలు తాగి రొమ్ములు గుద్దారని టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిన శిల్పా చక్రపాణి నుద్దేశించి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై రోజా అంతే ఘాటుగా స్పందించారు. తల్లిపాలు తాగి రొమ్ములు గుద్ది టీడీపీలో చేరిన ఆదినారాయణ రెడ్డి, అఖిల ప్రియ, అమర్‌నాథ్ రెడ్డిలను పక్కన పెట్టుకొని బాలయ్య డైలాగ్‌లు కొడుతున్నారని రోజా విమర్శించారు.

దూరదర్శన్, ఆకాశవాణిలో నిరాకరించిన

త్రిపుర ముఖ్యమంత్రి ప్రసంగం ఇదే..

దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ తమ రాష్ట్ర ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగాన్ని యథాతథంగా ప్రసారం చేయడానికి దూరదర్శన్, ఆకాశవాణి అగర్తలా కేంద్రం నిరాకరించాయి. దీనిపై మాణిక్ సర్కార్ స్పందిస్తూ 'ఇది అసాధారణం, అప్ర జాస్వామికం, అసహనం, నిరంకుశత్వం' అని విమర్శించా రు. స్వయం ప్రతిపత్తిగలిగిన దూరదర్శన్, ఆకాశవాణిలు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖలో భాగమైనట్లు వ్యవహ రించడం ఏమిటని వామపక్షాలు నిలదీశాయి. మళ్లీ ఎమర్జె న్సీ కాలం నాటి ఆంక్షలు వస్తున్నాయని ప్రజాస్వామ్య వాదులు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాణిక్ సర్కార్ ప్రసంగ పాఠాన్ని అందిస్తున్నాం.

ప్రియమైన త్రిపుర ప్రజలారా!

"దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మీ అందరికీ శుభాకాంక్షలు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమర వీరుల కు నానివాళులు. స్వాతంత్ర్యం కోసం పోరాడి ఇప్పటికీ మనందరి మధ్యనున్న యోధులకు నా గౌరవ వందనాలు. స్వాతంత్ర్య దినోత్సవం అంటే సాంప్రదాయబద్ధంగా ఏటా జరుపుకునే ఓ పండుగ కాదు. ఈ రోజున చారిత్రక ప్రాధా న్య తతోపాటు మన భావోద్రేకాలు ముడివడి ఉన్నాయి. ఈ సందర్భంగా మనం ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవస రం ఎంతైనా ఉంది. భిన్నత్వంలో ఏకత్వం మన సంప్రదాయ సంస్కృతి. లౌకిక భావాల వల్లనే మన భారతీయులంతా కలిసిమెలిసి బతుకుతున్నారు. ఈరోజున మన లౌకిక భావా నికి ముప్పు వాటిల్లుతోంది. లౌకిక విధానంపై దాడి జరుగు తోంది. కులమతాల ప్రాతిపదికన సమాజంలో విభనలు తీసుకురావడానికి కుట్రలు జరుగుతున్నాయి. సంకుచిత భావాలు జాతీయ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయి. గోరక్షణ పేరి ట దళితులు, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. వారిలో అభద్రతా భావం పెరిగిపోతోంది. భారత దేశంలో మత రాజ్యాన్ని స్థాపించేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయి. స్వాతంత్ర్య పోరాటానికి పురిగొల్పిన ఆదర్శాలు, కన్న కలలను దెబ్బతీసే విధంగా విచ్ఛిన్నకర శక్తులు రాజ్యమేలు తున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమంతో ఏ మాత్రం సంబంధం లేని, పైగా స్వాతంత్ర్య ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయ త్నించిన జాతి వ్యతిరేకులు నేడు రకరకాల పేర్లతో చెలామణి అవుతూ దేశ ఐక్యతను, సమగ్రతలను దెబ్బతీస్తున్నారు. దేశ భక్తిగల ప్రతి పౌరుడు దేశ ఐక్యతకు కట్టుబడి ఈ విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా సంఘటితంగా నిలబడాలని ఈ రోజు ప్రతిజ్ఞ చేయాలి. దేశంలో మైనార్టీలకు, దళితులకు, అణగా రిన వర్గాల భద్రత కొరకు ఐక్యంగా ఉద్యమించాలి. దేశంలో ప్రస్తుతం నెలకొన్న రుగ్మతలకు వ్యతిరేకంగా మనమందరం నిలబడాలి. నేడు సమాజంలో ధనిక, పేద అంతరాలు పెరిగిపోతున్నాయి. అపారమైన దేశ సంపద కొద్ది మంది వ్యక్తుల చేతుల్లోకి చేరిపోగా మెజారిటీ ప్రజలు తినేందుకు తిండి కూడా దొరకక కుమిలిపోతున్నారు. అధిక శాతం ప్రజలు పేదరికంలో మగ్గిపోతున్నారు. ప్రస్తుత విధానాలకు బాధితులవుతున్నారు. తిండి, ఇల్లు, బట్టలు, విద్యా, వైద్య సదుపాయం, ఉద్యోగ భద్రతలకు లేకుండా అల్లాడుతు న్నారు. ఇవన్నీ ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం హామీ ఇవ్వాలి. అదే దేశ స్వాతంత్రోద్యమ లక్ష్యం. ప్రస్తుత కేంద్రం విధానాలు ఆ విధంగా లేవు. ప్రజా వ్యతిరేక విధానాలు పెరుగుతున్నాయి. దేశానికి నిరుద్యోగం ప్రధాన సవాళ్లుగా మారింది. ఉద్యోగం లేక యువత ఎదురుచూపులు చూస్తున్నారు. ఉద్యమాల ద్వారానే ఈ విధానాల మార్పు సాధ్యం. అందుకు విద్యార్థులు, యువత, కార్మికులు ఐక్యంగా ఉద్యమించేందుకు ఈ రోజున ప్రతిన బూనాలి.

కొద్ది మంది కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ సామాజిక అంతరాలను పెంచి పోషిస్తోన్న ప్రస్తుత ఆర్థిక, సామాజిక విధానానికి ప్రత్యామ్నాయ విధానం తప్పకుండా ఉంది. మెజారిటీ పేద ప్రజలను ఆదుకునే అలాంటి ప్రత్యామ్నాయ ఆర్థిక, సామాజిక విధానాన్ని సాధించడం కోసం త్రిపుర ప్రజలంతా ఒక్కటవ్వాలి. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు భిన్నంగా రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు తన పరిధిలో ఈ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇది సరిపోదు. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాన్ని సాధించడం ఒక్కటే పరిష్కారం. అందుకు జరిగే పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని కోరుకుంటున్నాను."

– మాణిక్ సర్కార్, త్రిపుర ముఖ్యమంత్రి

ఆడబిడ్డ వద్దు...

- పోషించలేమన్న తల్లిదండ్రులు
- శిశువిహార్‌కు చేరిన 16 రోజుల పాప

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



కన్నపేగు ముందు కుటుంబ వారసుడే ముఖ్యమయ్యాడు.. వారడొ స్తాడనుకుంటే.. ఐదో సంతానంలోనూ ఆడబిడ్డే పుట్టింది. ఈ బిడ్డను సాకలే మని తల్లిదండ్రులు శిశు విహార్‌కు అప్పగించారు. 16రోజుల ఆ పసికం దు అందరూ ఉన్నా అనాథగా శిశు విహార్‌కు చేరుకుంది. అందుకు సం బంధించిన వివరాలు. రంగారెడ్డి- నల్లగొండ జిల్లా సరిహద్దుల్లోని ముచ్చ ర్లకుంట తండాకు చెందిన మూడవత్ బోజి- గణేష్ దంపతులకు ఇప్పటికే నలుగురు ఆడపిల్లలున్నారు. కానీ, వారసుని కోసం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోలేదు. కానీ, ఈనెల ఒకటో తేదీన ఇబ్రహీంపట్నంలోని శ్రీరామరక్ష ఆస్పత్రిలో బోజికి ఐదో సంతానంగా మళ్లీ ఆడబిడ్డే పుట్టింది. దాంతో ఆ దంపతుల్లో కలవరం మొదలైంది. ఈ నేపథ్యంలో పటేల్‌చెరువు తండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్ ఆ పాపపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పాపను ఎవరికీ అమ్మకుండా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దాంతో వారు శిశువిహార్‌కు అప్పగించేందుకు ముం దుకొచ్చారు. పాప నాయనమ్మ లక్ష్మీ, తండ్రి గణేష్ చేతుల మీదుగా ఇబ్ర హీంపట్నం సీపీడీఓ శాంతిశ్రీ, సూపర్‌వైజర్లకు చిన్నారిని అప్పగించారు.

నేరెళ్లలో లాఠీచార్జి ఎందుకు చేయాల్సి వచ్చింది..? : హైకోర్టు

హైదరాబాద్ : సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, రామచంద్రాపురం వాసులపై పోలీసులు ఎందుకు లాఠీచార్జి చేయాల్సివచ్చిందో.. గ్రామస్థులే తప్పు చేస్తే లాఠీచార్జి చేశామనే ప్రభుత్వం ఎస్పీని ఎందుకు సస్పెండ్ చేసిందో.. వివరణ ఇవ్వాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. లాఅండ్ ఆర్డర్ కోసమే లాఠీచార్జి చేస్తే ఎస్పీకి పదోన్నతి ఇవ్వాలేగానీ సస్పెన్షన్ చేస్తారా అని హైకోర్టు నిలదీసింది. ఎస్పీని సస్పెండ్ చేయడానికి కారణాలు వివరిం చాలని కోరింది.పోలీసులు చట్టాన్ని దుర్వినియోగం చేశారని, గ్రామస్థుల ను విచక్షణారహితంగా చితకబాదారని పిటిషనర్ తరపు న్యాయవాది వి.రఘునాథ్ వాదించారు. ఈఘటనను ఎస్పీనే దగ్గరుండి చేయించారని ఆరోపణ చేశారు.. బాధితులకు కరీంనగర్ ఆస్పత్రిలో జరిపిన వైద్య చికిత్స లపై నివేదికతోపాటు, జైలుకు తీసుకువెళ్లినప్పుడు బాధితులపై దెబ్బలపై జైలు సూపరింటెండెంట్ నివేదిక, ఎస్పీ సస్పెన్షన్‌పై కరీంనగర్ రేంజి డీఐజీ నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఘటనకు కారకులు ఎవరో చెప్పాలని, పోలీసులపై గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే వారిపై ఎందుకు కేసు నమోదు చేయలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నేరెళ్ల ఘటనపై సీబీఐ విచారణ జరపాలంటూ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ దాఖలు చేసిన పిల్‌ను బెంచ్ విచారించింది. గ్రామస్తులే పోలీ సుల్ని కొట్టారని అదనపు అడ్వకేట్ జనరల్ రామచం ద్రరావు వాదించారు. రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందితే ఆరెండు గ్రామాలవాళ్లు పోలీసు లపై దాడి చేశారని,ఈ సందర్భంగా ఎస్పీ స్పందిం చిన తీరు సబబుగా లేదనే సస్పెండ్ చేశామని చెప్పారు.ఈవరంగల్ ఎంజీఎం వైద్యుల నివేదిక ప్రకారం బాధితుల ప్రాణాలకు హాని లేదని, ప్రభుత్వం నుంచి నివేదికలు అందాక 30 తదుపరి విచారణ చేస్తామని హైకోర్టు ప్రకటించింది.

సీట్ల భర్తీ విధానం ఏమిటీ..?
హెచ్‌సీయూ రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం

హైచ్‌సీయూలో పీహెచ్‌డీ,ఎంఫిల్ సీట్ల భర్తీకి ఎంచుకున్న పద్ధతి ఏమిటో చెప్పాలనిహైకోర్టు న్యాయమూర్తి.రామలింగేశ్వరరావు వర్సిటీ రిజిస్ట్రీని ఆదేశించారు. సీట్ల సంఖ్యను తెలుపుతూప్రకటన ఇచ్చి వాటిని భర్తీ సమయంలో కుదించారని విద్యార్థి ఎస్.మున్న వేసిన రిట్‌ను బుధవారం న్యాయమూర్తి విచారించారు. సీట్ల తగ్గింపు వల్ల ఎస్సీ,ఎస్టీ,బీసీ అభ్యర్థులకు నష్టమని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదించారు. వారానికి విచారణ వాయిదా పడింది.

ఆ నిధులపై ఆడిట్ జరుగుతున్నదా..?

నియోజకవర్గాల అభివ ద్ధి పొగ్రాం పేరిట తెలంగాణ సర్కార్ ఖర్చు చేస్తున్న నిధులపై ఆడిట్ జరుగుతున్నదీ లేనిదీ తెలపాలని హైకోర్టు ఆదేశించింది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు సీడీపీ కింద ఏటా రూ.700 కోట్లు ఖర్చు చేస్తున్నా ఆ పనులపై పర్యవేక్షణగానీ, నిధుల వినియోగంపై ఆడిట్ గానీ లేదంటూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థ కార్యదర్శి పద్మనాభరెడ్డి వేసిన పిల్‌ను బుధవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్‌బెంచ్ విచారించింది. ఏటా రూ.700 కోట్ల వినియోగంపై మూడేళ్లుగా ఆడిట్ లేదని పిటిషనర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదించారు. ఆడిటర్ జనరల్ నివేదిక, అధికారుల తనిఖీలపై వివరాల్ని తెలుపుతామని తెలంగాణ అడ్వ కేట్ జనరల్ డి ప్రకాశ్‌రెడ్డి చెప్పారు. విచారణ 22కి వాయిదా పడింది.

రుణ విమోచన కమిషన్ ఏర్పాటుపై నిర్దిష్ట వ్యవధి తెలపండి..

తెలంగాణలో రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటుపై నిర్దిష్ట వ్యవధిని తెలపాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. రైతుల ఆత్మహత్యల నివారణకు రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటుకు వీలుగా తెలంగాణ సర్కార్ 2016 మే 27న చట్టం తెచ్చినా ఏర్పాటు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్.ఇంద్రసేనారెడ్డి వేసిన పిల్‌ను బెంచ్ విచారించింది. ఆ చట్టంలోని సెక్షన్ మూడు కింద హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి అధ్యతన అయిదు గురితో కమిషన్ ఏర్పాటు చేయాలని పిటిషనర్ న్యాయవాది వై.బాలాజి వాదించారు. కొంత గడువు కావాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.శరత్ కోరారు. విచారణ సోమవారానికి వాయిదా వేసింది.

బోరుబావుల్లో ప్రమాద నివారణకు చర్యలేంటీ.?

బోరు బావుల్లో పిల్లలు పడి మరణించకుండా ఏం జాగ్రత్తలు తీసుకున్నారో, తవ్విన. బోర్లు వదిలేసిన వారిపై చర్యలేమిటో తెలపాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ తెలంగాణ సర్కార్‌ను కోరింది. బోరుబావులపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు కోరుతూ న్యాయవాది బుద్ధారపు ప్రకాశ్ వేసిన పిల్‌ను బెంచ్ విచారించింది. చేవెళ్ల సమీపంలోని ఇక్కారెడ్డిగూడలో జరిగిన ఘటనపై నమోదైన కేసు పురో గతిని వివరించాలని కోరింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి బీఆర్ మీనా స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. మళ్లీ విచారణకు రావాల్సిన అవ సరం లేదని బెంచ్ స్పష్టం చేసింది గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మిడివరంలో బోరు బావిలో పడి బాలుడు చంద్రశేఖర్ ఘటనలో బాలు డు బతికాడని న్యాయవాది చెప్పారు విచారణ 30కి వాయిదా వేసింది.


పరిహారంలో దగా

సర్కారు మాటతప్పింది

- సుందిళ్ల బ్యారేజీ నిర్వాసిత రైతుల గోడు
- గోలివాడ రైతులకు ఇచ్చినంత చెల్లించాలని డిమాండ్
- ఎన్ని నిర్బంధాలైనా ఎదుర్కొంటాం : సిరిపురం రైతులు

సిరిపురం నుంచి బండెల రాజశేఖర్


'మా ఎమ్మెల్యే మధుకరన్న, అప్పటి కలెక్టర్ అళగు వర్షిణి, ఆర్డీవో వచ్చి నచ్చజెప్పారు. మేమంత నమ్మి బంగారంలాంటి భూములను బ్యారేజీ నిర్మాణ పనులకిచ్చినం. మొదట్లో చట్టం ప్రకారం కొంత పరి హారం ఇచ్చారు. ఇప్పుడు పెరిగిన ధరలకు అనుగు ణంగా ఇవ్వాలని అడిగితే పోలీసులతో కొట్టిస్తున్నరు. న్యాయం జరిగేదాకా పోరాడుతాం. ఎన్ని నిర్బంధాలై నా ఎదుర్కొంటాం' అంటూ సుందిళ్ల బ్యారేజ్ నిర్వాసి తులు భీష్మిస్తున్నారు. పరిహారం ఎక్కువిస్తమంటూ చెప్పి దగా చేసిన సర్కారుపై ఆగ్రహంతో రగిలి పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం-మేడిగడ్డ ప్రాజెక్టు కోసం పెద్దపల్లి జిల్లాలో రెండు పంపుహౌజ్‌లు, బ్యారేజ్ నిర్మాణాల పనులు నడుస్తు న్నాయి. సుందిళ్ల బ్యారేజ్ మంథని మండలంలో సిరిపురం వద్ద, అన్నారం పంపుహౌజ్ ఉప్పట్ల వద్ద, ఎల్లంపల్లిలోకి నీరు తీసుకెళ్లేందుకు కాళేశ్వరం పంపుహౌజ్ గోలివాడ వద్ద నిర్మాణాలు చేపట్టారు. సిరిపురం వద్ద నిర్మిస్తున్న సుందిళ్ల బ్యారేజ్ పనులకు మొదట్లో 130 ఎకరాల భూములు అవసరంగా గుర్తించారు. 60మంది రైతులకు చెందిన 120 ఎకరాల పట్టా భూములను సేకరించారు. నవంబర్ లో అప్పటి జిల్లా కలెక్టర్ అళగు వర్షిణి, ఎమ్మెల్యే పుట్టమధుకర్, మంథని ఆర్డీవో కలిసి తమ కార్యాల యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. మొదటగా 123 జీవో కిందనే పరిహారం ఇస్తామ న్నారు. రైతులు ఒప్పుకోకపోవడంతో పనులు మొద లు పెట్టలేదు. పనుల కోసం ముందుగా ఎనిమిది మంది రైతుల నుంచి బలవంతంగా 30 ఎకరాల వరకు తీసుకున్నారు. జనవరిలో మరోసారి రైతులను కలెక్టర్ వర్షిణి, ఎమ్మెల్యే మధుకర్ ఒప్పించి 2013 చట్టం ప్రకారం చెల్లిస్తామన్నారు. రైతులు తమ భూములిచ్చేందుకు అంగీకరించారు. ఒక్కో ఎకరానికి రూ.8లక్షలు, పంట నష్టానికి రూ. 40వేల చొప్పున ఇచ్చారు. 120 ఎకరాల్లో 80 ఎకరాలకు చెందిన 52 మంది రైతులకు పరిహారం ఇచ్చారు. మిగతా 30 ఎకరాలకు పెండింగ్‌లో పెట్టారు. ఇచ్చినవారికి 2013 చట్టం ప్రకారం పరిహారం ఇచ్చారు. అయితే, రాష్ట్రంలో మిగతా చోట్ల పరిహారం కోసం రైతులు ఆందోళనలు చేయడం, కోర్టులకు ఫిర్యాదు చేస్తున్న సందర్భంగా పరిహారం పెరిగితే ఆ ప్రకారం మళ్లీ చెల్లిస్తామని సిరిపురం నిర్వాసితులకు అధికారులు భరోసా కల్పించారు. ఆ నమ్మకంతోనే రైతులు భూములిచ్చారు. గోలివాడ రైతుల ఆందోళనతో పరిహారం అధికంగా అందింది. ఆ మాదిరిగా పరిహారం పెంచివ్వాలని సిరిపురం రైతులు కోరుతున్నారు. సిరిపురంలో నిర్వాసితులకు ఎకరాకు రూ.8 లక్షల పరిహారమే ఇచ్చారు. అలాకాకుండా, ఎకరాకు కనీసం రూ.13 లక్షల పరిహారం ఇవ్వాలని సిరిపురం నిర్వాసితులు కోరుతున్నారు.



నిర్బంధాలను ఎదుర్కొంటాం

ప్రభుత్వం మొదట్లో చెప్పిన విధంగా పెంచిన పరిహారం ఇవ్వాలి. జిల్లాలో గోలివాడ రైతులకు ఇచ్చిన విధంగా ఒక్కో ఎకరానికి రూ. 13లక్షలు చొప్పున ఇవ్వాలి. నన్ను పోలీసులు చిత్రహింసలు పెట్టారు. ఎన్ని నిర్బంధా లైనా ఎదుర్కుంటాం. న్యాయం కోసం పోరాడుతాం.

-దాసరిచంద్రమోహన్, నిర్వాసిత రైతు, సిరిపురం




హైకోర్టులో ఫిర్యాదు చేశాం

బలవంతంగా భూము లు తీసుకున్నారు. నాకున్న రెండు న్నరెకరాలు గుంజుకున్నారు. కేవలం రూ.8 లక్షల వరకు చెల్లించారు. రిజిస్ట్రేషన్ విలు వను బట్టి మార్పులు చేసి పరిహారం ఇవ్వాలని అడి గాం. మా గ్రామానికి చెందిన ఎనిమిది మంది రైతులం హైకోర్టులో పిటిషన్ వేశాం.

-బుద్ద సుధాకర్, నిర్వాసిత రైతు, సిరిపురం

యువరైతుపై జులుం.. రగిలిపోతున్న రైతులు

ఎమ్మెల్యే మధుకర్, అప్పటి కలెక్టర్, ఆర్డీవో మాటలు నమ్మి అధికారపార్టీకి చెందిన దాసరి చంద్రమోహన్ అనే యువరైతు గ్రామంలోని రైతులను భూములు ఇచ్చేందుకు ఒప్పించాడు. తన నాలుగున్నరెకరాలను కూడా బ్యారేజ్ పనులకు ఇచ్చాడు. వారం కింద పరిహారం అద నంగా చెల్లించాలంటూ ప్రాజెక్టు అధికారులను అడిగాడు. వారు ఒప్పుకోకపోవడంతో తమ పొలంలో పనులు చేయవద్దని నిరసన తెలిపాడు. ప్రాజెక్టు కాంట్రాక్టర్, ప్రాజెక్టు మేనేజర్ మంథని ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. దీంతో చంద్రమోహన్ ను పోలీసుస్టేషన్‌లో 34 గంటలపాటు ఉంచుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఈ నేపథ్యంలోనే నిర్వాసితులు ఆందోళన ముమ్మరం చేశారు. ఇప్పటికే ఎనిమిది మంది రైతులు హైకోర్టులో ఫిర్యాదు చేశారు. బుధవారం మళ్లీ ఆందోళనకు పూనుకున్నారు. మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రైతులను పరామర్శించారు. వారి పోరాటానికి సంఘీభావం తెలిపారు.



ప్రభుత్వం మోసం చేసింది

కోర్టు తీర్పుల తర్వాత పరిహారం ఎంత పెరిగితే అంత చెల్లిస్తామంటూ అధికా రులు, ఎమ్మెల్యే చెప్పారు. బ్యారే జ్‌ల కింద భూములు పోయిన రైతులకు పరిహారం పెరిగిందంటా. సర్కారు చెప్పినవిధంగా పరిహారం ఇవ్వాలని కోరితే పోలీసులు బెదిరిస్తున్నారు.

- గోపు పద్మ, నిర్వాసిత మహిళా రైతు, సిరిపురం

పోడు రైతుల అరెస్టు, రిమాండ్

మంత్రి హామీ..ఉత్తదే !

- మళ్లీ పోరుకు సిద్ధం : రైతులు

నవతెలంగాణ-ఏటూరునాగారం

పోడు రైతుల సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దున్నడానికి వెళ్లిన పోడు రైతులపై అటవీశాఖ అధికారులు మూకుమ్మడిగా దాడులు చేశారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ప్రొఫెసర్ జయశంకర్-భూపాలపల్లి జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఉద్రిక్తంగా మారింది. చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన పోడు రైతులు బుధవారం పోడు భూముల్లో దున్నడానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ రేంజర్ యాకయ్య 30మంది సిబ్బందితో కలిసి వెళ్లి వారిపై దాడి చేశారు. మరో 20 మంది స్థానిక పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. రైతులు సాల యాదిరెడ్డి, దూడ వెంకటయ్య, లక్కర్ష్ సమ్మయ్యను అరెస్టు చేసి అటవీశాఖ అతిథి గృహానికి తరలించి గంట పాటు బంధించారు. ఎఫ్ఐఆర్ పూర్తి చేసి ములుగు కోర్టుకు రిమాండ్‌కు తరలించారు.

అటవీశాఖ అధికారుల దాడులను నిరసిస్తూ జూన్ నెలలో పోడు రైతులు, మహిళా రైతులు మూడు రోజులపాటు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. అధికారుల ఆగడాలను నిరసిస్తూ నిరాహార దీక్ష చేపట్టారు. అధికారుల దిష్టిబొమ్మలతోపాటు సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న మంత్రి దిష్టిబొమ్మను



దహనం చేశారు. పోడు రైతులకు ప్రతిపక్ష, వామపక్ష పార్టీల నాయకులు అండగా నిలిచారు. దీక్ష చేపట్టిన రైతుల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంత్రి చందూలాల్ స్పందించి.. "మీ పోడు భూములు మీకే దక్కుతాయి" అని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు. కాగా, ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో దున్నడానికి వెళ్లిన రైతులను అధికారులు అరెస్టు చేశారు.

మళ్లీ ఉద్యమమే..

మళ్లీ ఉద్యమం తప్పదు. నిరాహార దీక్ష సమయంలో మంత్రి చందూలాల్ హామీ ఇచ్చినా ఫలితం లేదు. మంత్రి హామీలన్నీ నీటిమూటలుగా మిగిలిపోయాయి. ఇక తాడో పేడో తేల్చుకోవడానికి రైతులంతా సిద్ధమవుతున్నారు.

-వడ్కాపురం సారయ్య, రైతు జేసీసీ మండల అధ్యక్షుడు

ఆ రెండింటిని ఖండించండి...

- నిజామాబాద్, ఖమ్మం ఘటనలపై సీపీఐ(ఎం)
- పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో ప్రిన్సిపాల్ మహ్మద్ యాకుద్దీన్‌పై ఏబీవీపీ, బీజేపీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగటం అత్యంత దారుణమని సీపీఐ (ఎం) పేర్కొంది. మైనారిటీ తరగతికి చెందిన వ్యక్తి జెండా ఎగురవేయటాన్ని జీర్ణించుకోలేని మతోన్మాద శక్తులు అనేక సాకులతో అల్లర్లు సృష్టించాయని విమర్శించింది. ఈ విధంగా ప్రతి సంస్థలో మతతత్వాన్ని పెంచడానికి హిందుత్వ శక్తులు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయని పేర్కొంది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో సర్పంచ్‌గా ఉన్న ఎస్టీ మహిళను పక్కకుబెట్టి స్థానిక వీఆర్వో జెండా ఎగురవేయటంతో సమాజం నివ్వెరపోయిందని తెలిపింది. ఈ రెండు ఘటనలను తీవ్రంగా ఖండించాలని అభ్యుదయవాదులు, ప్రజాతంత్రశక్తులకు పిలుపునిచ్చింది. వీటికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ప్రజాతంత్ర, లౌకిక హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అందుకనుగుణంగా కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఐలాపూర్ ఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- ప్రిన్సిపాల్‌పై దాడిచేసిన 15 మందిపై కేసు



కలెక్టరేట్‌కు వెళ్లిన దళిత, ఎంబీసీ, మైనార్టీ సంఘాల నాయకులు

నవతెలంగాణ-నందిపేట్

స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ప్రిన్సిపాల్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఐలాపూర్ కాలేజీలో ఆవరణలో జెండా ఎగురవేస్తున్న ప్రిన్సిపాల్‌ను అడ్డుకోవడమేగాక బయటకు లాక్కెళ్లిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్, దళిత, ఎంబీసీ సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టర్ యోగితారాణాకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రిన్సిపాల్ పట్ల దురుసుగా ప్రవర్తించిన వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్దేశపూర్వకంగానే కార్యక్రమాన్ని అడ్డుకుని దాడికి యత్నించారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించినందుకు, స్వాతంత్ర్య వేడుకకు భంగం వాటిల్లినందుకు చట్టరీత్యా చర్య తీసుకోవాలని కోరారు.

జాతీయ నాయకులు కూడా షూ విప్పకుండా జెండా ఎగురవేశారని ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. అలాగే, నందిపేట్ తహసీల్దార్ ఉమాకాంత్‌కు, ఎస్సై జాన్‌రెడ్డికి కూడా పలువురు ముస్లిం యువకులు వినతి అందించారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు ఆర్మూర్ సీఐ నర్సింహ్మ ఆధ్వర్య ంలో 15మందిపై కేసు నమోదు చేశారు. జరిగిన ఘటనను యథావిధిగా రాసిన 'నవతెలంగాణ'కు ప్రిన్సిపాల్ మహమ్మద్ యాకునుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

మతోన్మాదుల దాడి అమానుషం : ఆవాజ్

జెండా ఎగురవేసిన కళాశాల ప్రిన్సిపాల్‌పై మతోన్మాదులు దాడి చేయడం అమానుషమని ఆవాజ్ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహ్మద్ అబ్బాస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్‌లోని ఐలాపూర్ జూనియర్ కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ యాకునుద్దీన్ జెండా ఎగురవేస్తే బీజేపీ, ఏబీవీపీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు దాడి చేసి, బలవంతంగా వేడుకల నుండి బయటకు తీసుకువెళ్లారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మత ఉద్రిక్తలను ప్రేరేపించడానికే బీజేపీ కుట్ర పన్నుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

పెట్టుబడి గ్రంథం ప్రాధాన్యత




బి.వి. రాఘవులు

- 8-

(సోమవారం తరువాయి భాగం)

మనం కర్టెన్ ఎందుకేస్తాం? మండీ..లోపల కనబడకుండా వేస్తము. లోపల కనబడాలంటే కర్టెన్ తీసేసి చూడాల్సిందే. కానీ మనం కర్టెన్ తీయనీయము. ఎందుకంటే ఎవరికీ కనబడకుండా చేయాలి. పెట్టుబడిదారీ విధానం కూడా జరిగే వాస్తవాలన్నింటినీ కనబడకుండా చేయాలనేది దాని స్వభావం. అందుకని పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క కీలకమైన లక్షణమే అది. జరిగే విషయాలనెప్పుడూ మరుగుపర్చి వాస్తవాలను కనబడకుండా చేసి..పెట్టుబడిదారీ విధానం ఎంత స్వచ్ఛంగా తయారవుతా ఉంటే ఈ మరుగు పర్చే లక్షణం అంత ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు భారత దేశం గురించి 1947లో స్వతంత్రం వచ్చినతర్వాత 1991 దాకా కొద్ది కొద్దిగా మనకు అర్థమవుతా ఉండేది. కానీ ఇప్పుడు అర్థం కాకుండా పోయింది. ఎందుకంటే ఈ రంగం కొత్త రంగాలకు, కొత్త ప్రాంతాలకు, కొత్త మూలాలకు విస్తరిస్తా ఉంది. ఏదైనా ఒక రంగం మనకు అర్థమవుతుందనుకుంటే.. మరుసటి రోజు పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరిస్తుంటే అది కూడా అర్థం కాకుండా పోతుంది. ఇప్పుడు మనం సుందరయ్య విజ్ఞానం కేంద్రం ద్వారా వ్యవసాయక సంబంధాలను అధ్యయనం చేస్తున్నాం. ఇదివరకంతా వ్యవసాయం బాగా అర్థమవుతుందని చెప్పేవాళ్లం. ఇపుడేమీ అర్థం కావడం లేదు చూస్తుంటే. అది మన తప్పుకాదు. పెట్టుబడిదారీ విధానం, పెట్టుబడిదారీ సంబంధాలు ఎక్కడైతే ప్రవేశిస్తాయో. అక్కడ మనకు అర్థం కాకుండా మభ్యపెట్టే లక్షణం ఉంటుంది. మీకు ఒక్క ఉదాహరణ ఇస్తాను. మీకు ఇంకా అనేక విషయాలు అర్థమవుతయ్, జీతం ఉదాహరణ. దీన్ని పెట్టుబడి గ్రంథంలో చాలా బాగా డిస్కస్ చేశాడు. మనమందరం జీతం గురించి చాలా మాట్లాడుతాము కాబట్టి. మీకు జీతం ఎందుకిస్తున్నరు అని అడిగితే మేం పనిచేస్తున్నం కావున ఇస్తున్నరు అని చెబుతారు. అలాగే మీరు జీతం ఎట్ల లెక్కగడ్తవు. 8 గంటలు రోజూ పనిచేస్తున్నం మూడు వేల రూపాయల కూలీ ఇస్తున్నారు. మీరు ఓవర్‌టైం చేస్తున్నారు. ఓవర్‌టైంకు ఎట్లా ఇస్తారు. రెట్టింపిస్తారు. డబుల్ వేజెస్ అనుకుంటాం. ఈ డబుల్ వేజెస్ అంటే ఏంటి.? గంటకు ఇంత జీతం. దానికి రెట్టింపు.. ఓవర్‌టైం అంటే ఇవన్నీ కలిపితే .. సారాంశం ఏంటంటే. మీకు జీతం ఎందుకిస్తున్నరంటే లేదా మీకు జీతం ఎంతిస్తున్నరు. ఎన్నిగంటలు పనిచేస్తే ఆ గంటలకి మీకు జీతమిస్తున్నారు. అంటే చేసిన పనికి జీతమిస్తున్నారు అనేది మనకు పెట్టుబడిదారీ విధానం అర్థం చేసేది. మీరు హాఫ్‌డే వెళ్లారనుకోండి రోజుకు 100 రూపాయలనుకోండి. మీకు 50 రూపాయలిస్తారు. అంటే 10 గంటలు చేసినపుడు 100 రూపాయలొస్తే నువు 5 గంటలే చేస్తే 50 రూపాయలే వస్తాయి. కాబట్టి మనం పని చేసిన గంటలకు జీతమిస్తున్నారు. దీన్నీ మనం చేసిన శ్రమకి జీతం అంటాం. పనికి తగిన వేతనం ఇవ్వడం లేదనీ మనం నినాదమిస్తం. మనకు బతకడానికి కావాల్సిన సరుకులకు జీతం ఇస్తున్నాడు. అది మాత్రం మనకు కనపడదు. మీరు ఓవర్‌టైం చేస్తే గంటల్లెక్క గడ్తున్నం. ఎనిమిది గంటలు పనిచేస్తే గంటకింత అని అంటున్నం. పనెగ్గొడితే ఇంత కటింగ్ అంటున్నం. అంతా గంటల్లెక్కనే..కాబట్టి పీస్‌రేటు తీసుకోండి.. నువు ఉత్పత్తి చేసిన వస్తువులను బట్టి నీకు జీతమిస్తున్నడు. పది వస్తువులుత్పత్తి చేస్తే పది రూపాయలు. ఇరవై వస్తువులు చేస్తే 20 రూపాయలు. కాబట్టి దేనికిస్తున్నడు జీతం. నువ్వు ఉత్పత్తి చేసిన వస్తువులకు ఇస్తున్నడు జీతం. సమాజంలో జరిగే ఈ పరిణామాలు మనకు భ్రమ. వాస్తవాన్ని మరుగుపర్చే ఒక అంశం దీంట్లో ఉంది. మనకు ఇస్తున్న జీతం మనం చేసిన పనికిస్తున్నట్టు కనబడుతుంది. కానీ పెట్టుబడిదారీ విధానంలో చేస్తున్న పనిక్కాదు జీతమిస్తున్నది. మనం బతకడానికి ఎంత అవసరమో దాన్ని జీతంగా ఇస్తున్నడు. అంటే మనం బతకడానికి అవసరాలకేమో జీతమిస్తున్నడు..మనం చేసిన శ్రమతో ఉత్పత్తులొస్తే ఆ ఉత్పత్తులు వాడు తీసుకుంటున్నడు. ఈ రెండూ వేరు వేరు. కానీ మనం బతకడానికిచ్చేది ఎప్పుడూ తక్కువగా ఉంటుంది. మనం ఉత్పత్తి చేసేది ఎప్పుడూ ఎక్కువగా ఉంటుంది. దీని గురించి మార్క్స్ ఇలా అంటాడు..ఏమండీ మనం చేసిన ఉత్పత్తికన్నా మనకు తినడానికిచ్చిన జీతం ఎక్కువగా ఉండొచ్చు కదా? అని మీరు అడగొచ్చు. ఉండొచ్చు మనం చేసిన ఉత్పత్తికన్నా బతకడానికిచ్చింది ఎక్కువగా ఉండొచ్చు. కానీ అప్పుడు పెట్టుబడిదారుడు ఉండడు. ఎందుకు పెట్టుబడి పెడతాడు. ఈ తేడానే కదా వాడు తీసుకునేది. మనకు బతకడానికిచ్చిన దానికీ, మనం చేసిన ఉత్పత్తికి మధ్య తేడానే పెట్టుబడిదారుడు లాభంగా తీసుకుంటున్నడు. అది లేనపుడు వాడు పెట్టుబడెందుకు పెడ్తడు. ఇక అట్లాంటి పరిస్థితి లేనపుడు పెట్టుబడిదారీ వ్యవస్థ నాశనమవుతుంది. సోషలిజం వస్తుంది. పెట్టుబడిదారులందరూ ఆ పనిచేస్తే మనకు కష్టం కూడా తప్పిపోద్ది. వానికి మనమిచ్చేదంతా వాడు మనకిచ్చేస్తే ఇక పోరాటమక్కర్లేదు. విప్లవమక్కర్లేదు ..ఇదంతా అవసరమే లేదు. అదిస్తే పెట్టుబడిదారీ వ్యవస్థే నాశనమవుతుంది. ఇవ్వరు కాబట్టి పెట్టుబడిదారీ వ్యవస్థ ఉంది. కానీ ఇది మనకు కనిపిస్తుందా.? కనిపించదు. అందుకనీ ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ స్పెషాలిటీ ఏంటంటే వాస్తవాల్ని మరుగుపర్చి అది కనపడకుండా చేసి.. పైపై విషయాలతో మనల్ని భ్రమల్లో ఉంచడం. పెట్టుబడిదారీ విధానం ఎంత విస్తృతంగా వ్యాపిస్తే ఈ లక్షణం అంత ఎక్కువగా పెరుగుద్ది. ఇపుడు లిబరలైజేషన్ ప్రైవేటైజేషన్ వచ్చిన తర్వాత ఇంకా ఎక్కడెక్కడన్న పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించలేదో..వాటన్నింటిలోకీ వ్యాపిస్తా ఉంది. అంతకు ముందు అర్థమయ్యే విషయాలు కూడా మనకు అర్థం కాకుండా పోతున్నయి. ఇంతకు ముందు విద్యారంగంలో పెట్టుబడిదారీ సంబంధాలు పెద్దగా లేవు. ప్రవేశించినయ్. వైద్యరంగంలో పెద్దగా లేవు. ప్రవేశించినయ్. కుటుంబ సంబంధాల్లో లేవు..ఇప్పుడు ప్రవేశించినయి. అంతకు ముందు కుటుంబాల్లో పరస్పర సహకారంతో జరిగే పెళ్లిల్లు, చావులు ఇట్టాంటి అన్నింటా కూడా పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించినయ్. అవి మనకు అర్థం కాని పరిస్థితులు వస్తున్నయి. వ్యవసాయంలో ఇంతకు ముందు కొన్ని అర్థమయ్యేవి. ఇపుడు అర్థం కాకుండా పోయినా మార్క్స్ కొన్ని విషయాలు చెబుతాడు. మీకు తెగల సమాజంలో ఎక్కడ ఏం జరుగుతుందో పారదర్శకంగా స్పష్టంగా కనపడేది. ఎందుకంటే అన్నీ బహిరంగంగా జరిగేవి. మళ్లీ వెనకేమీ జరిగేవి కావు. అలాగే ఫ్యూడల్ వ్యవస్థ దోపిడీ వ్యవస్థ ఐనా మనకు పారదర్శకంగా కనపడుద్ది.



(తరువాయి భాగం సోమవారం సంచికలో)

ప్రజా సైన్సు ఉద్యమ స్ఫూర్తి డాక్టర్ పి.ఎం. భార్గవ



డాక్టర్ కట్టా సత్యప్రసాద్


సైన్సు కేవలం నాలుగు గోడల మధ్యనే ఉండరాదని, సైన్సు వలన సమాజం చైతన్యవంతం కావాలని కాంక్షించిన వాళ్లలో డాక్టర్ సి.యం. భార్గవ ముందుంటారు. ఆయన ఒక పార్శ్వం శాస్త్రీయ దృక్పథమైతే, సామాజిక చైతన్యం రెండో పార్శ్వం. సైన్సు అంటేనే శాస్త్రీయంగా ఆలోచించటం, రుజువుల ఆధారంగా సత్యాన్ని ఆవిష్కరించటం. ఈ ప్రక్రియ సమాజ ప్రగతికి కూడా ఎంతో అవసరం. పిల్లల్లో శాస్త్రీయ ఆలోచనను ప్రోదిచేసే విధంగా డాక్టర్ భార్గవ 'శాస్త్రీయ పద్ధతి' అనే ఎగ్జిబిషన్‌ను రూపొందించారు. ఆలోచనలను రేకెత్తించిన ఈ ప్రదర్శనను అప్పటి ఎన్‌డీఏ పాలకులు మూయించివేశారు. హైదరాబాద్ కేంద్ర గ్రంథాలయంలో కొన్నేండ్లు నడిచినా చివరకు అక్కడినుంచి కూడా ఎత్తివేశారు. దీని వలన ప్రజలు రుజుమార్గంలో ఆలోచిస్తారనీ, ప్రశ్నించే తత్వం ఎక్కువవుతుందనీ కక్షకట్టారు. భార్గవ మేధోశక్తికి, సమాజంపై అది చూపే ప్రభావాన్ని అంచనా వేసేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలు.

ఆయన యువకుడుగా ఉన్నప్పటినుంచే 'శాస్త్రీయ దృక్పథం' అవసరాన్ని గుర్తించారు. 1946లోనే సైంటిఫిక్ వర్కర్ల సంఘాన్ని ఏర్పాటు చేయటంలో భార్గవ కీలకపాత్ర వహించారు. 1963లో ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ ధావన్, సైన్సు చరిత్రకారులు అద్దుర్ రహమాన్‌లతో కలసి సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించేందుకు జాతీయస్థాయి సంఘాన్ని ప్రారంభించారు. అప్పటి ప్రభుత్వాన్ని ఒప్పించి 42వ రాజ్యాంగ సవరణలో శాస్త్రీయదృక్పథం, మానవతా విలువలు ప్రోత్సహించటాన్ని చేర్చటంలో ప్రధాన పాత్ర పోషించిన ఘనత డాక్టర్ భార్గవది. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించే ప్రజా సైన్సు ఉద్యమానికి వెన్నుముకగా ఉండి వారి కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. జనవిజ్ఞాన వేదిక మహాసభల్లో, సెమినార్లలో ప్రసంగించి కార్యకర్తల్లో స్ఫూర్తి నింపారు. చేపమందుపై జేవీవీ చేపట్టిన ఉద్యమానికి దన్నుగా నిలవటమేగాక, తానే కోర్టులో వ్యాజ్యంవేశారు. వారిచ్చే 'మందు'లో మందులేదని పరీక్షలు నిర్వహించి మరీ నిరూపించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో స్వయంగా నిరసన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదికతో పాటు పాల్గొని మద్దతు తెలిపారు. తానెంత పెద్ద శాస్త్రవేత్త అయినా సామాన్యుల్లో సామాన్యుడిగా కలిసిపోయే అసమాన్యుడు డాక్టర్ భార్గవ. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం ఆయనది. భారతదేశంలో సైంటిఫిక్ టెంపర్‌ను గురించి తన "దేవతలు, రాక్షసులు, సైన్సు" అనే పుస్తకంలో రాశారు. 2000లో అప్పటి ఎన్డీయే ప్రభుత్వం జ్యోతిష్యాన్ని యూనివర్సిటీల్లో ప్రవేశపెట్టినప్పుడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోను, సుప్రీంకోర్టులోనూ రిట్‌వేసి మరీ పోరాడారు.

> **అవకాశాలు కల్పిస్తే భారతదేశం శాస్త్రవేత్తలు ఎవరికీ తీసిపోరని నిరూపించారు. ఈ సంస్థ పరిశోధనల ఫలితంగానే డీయన్‌ఏ పరీక్షలు నిర్వహించి నేరస్తులను, వారసులను గుర్తించే డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ టెక్నాలజీ వచ్చింది. లాకోన్స్ పేరుతో అరుదైన, అంతరించే ప్రమాదం ఉన్న వన్యప్రాణులకు జీవం పోసే సంస్థ కూడా దీని నుండి వచ్చిందే. శాస్త్ర ప్రపంచానికే గాక, ప్రజా సైన్సు ఉద్యమానికి భార్గవ లేని లోటు పూడ్చలేనిది. మతోన్మాదులు విజృంభించి ఆచారం పేరుతో, ఆహారం పేరుతో నరభక్షణ చేస్తున్న నేటి క్లిష్ట పరిస్థితుల్లో భార్గవ మృతి హేతువాదుల్ని, మానవతావాదుల్ని కలవరపరుస్తున్నది.**

భార్గవ చేపమందు అశాస్త్రీయతపైనే గాకుండ, అల్లోపతి మందుల ప్రామాణికతపై వినియోగదారులను చైతన్య పరిచేందుకు మెడికల్లీ అవేర్ సిటిజన్స్ ఆఫ్ హైదరాబాద్ (మార్చ్)లో ప్రతీనెల చర్చించేవారు. డయాగ్నిస్టిక్ పరీక్షల్లో ప్రమాణాలు నిర్దేశించేలా ప్రభుత్వానికి సూచించి కొంతమేర విజయం సాధించారు. జన్యుమార్పిడి పంటల వలన వచ్చే అనర్థాలను తెలియజెప్పి ప్రజలను చైతన్యపరచటంలో ప్రజా సైన్సు సంస్థలకు మార్గనిర్దేశం చేశారు. బీటీ వంకాయను అనుమతించవద్దని వేసిన వాజ్యాల్లో సుప్రీంకోర్టు డాక్టర్ భార్గవ అధ్యక్షతన నిపుణుల కమిటీని నియమించింది. మంచీ చెడులను శాస్త్రీయంగా విశ్లేషించి తగిన పరీక్షలు నిర్వహించకుండా జన్యుమార్పిడి పంటలను విడుదల చేయటం శ్రేయస్కరం కాదని సలహా యిచ్చారు.

ఎందరో యువ పరిశోధకులకు, శాస్త్రవేత్తలకు ఆయన మార్గదర్శి. ఆయన స్థాపించి, అభివృద్ధి చేసిన సీసీయంబీ (సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ)లో కొత్తగా చేరిన ఒక యువకుడు తనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నప్పుడు పరిశోధనపై అతనికి అవగాహన కల్పించటమే కాదు, ప్రేమను కురిపించి మంత్రముగ్ధుణ్ణి చేశారట. నీవు చేసేది దేశం కోసమైతే తప్పనిసరిగా చేయమని సలహా ఇచ్చారు. వాస్తవానికి నమ్మిన దాన్ని నిర్భయంగా, నిజాయితీగా ఆచరించడమే భార్గవ జీవితంలో మనకు కనిపిస్తుంది. విలువల కోసం ఎంతటి పదవిని త్యజించటానికైనా వెనుకాడేవాడు కాదు. ప్రజలకు, సమాజానికి నష్టం కలిగించేవాటిని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాడు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చట్టం తేవాలని పోరాడిన ధబోల్కర్‌ను హత్యచేసినప్పుడు, హేతువాదుల మీద దాడులు జరగటాన్ని నిరసిస్తూ పద్మభూషణ్ పురస్కారాన్ని గడ్డిపోచలా తిప్పిపంపాడు. ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నం దుకు నిరసనగా జాతీయ నాలెడ్జ్ కమిషన్ ఉపాధ్యక్ష పదవిని తృణప్రాయంగా వదిలేశారు. విదేశాల్లో స్థిరపడిన భారతీయ యువ శాస్త్రవేత్తలను ఒప్పంచి, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పరిశోధనలకు వసతులు కల్పించి భారతదేశంలోనే సాటిలేని పరిశోధనా సంస్థను తీర్చిదిద్దారు. శాస్త్రవేత్తల పనితీరును సమీక్షించి శాస్త్రవేత్తలందరూ ఉత్తమంగా పనిచేయటం తో వాళ్లందరినీ ప్రమోట్ చేయాలని డాక్టర్ భార్గవ రికమండ్ చేశారట. కానీ ఎవరో కొందరినే నామినేట్ చేయమని పైనుండి ఫైలు తిప్పిపంపారట. వారందర్నీ ప్రమోట్ చేయనైనా చేయండి లేదా నా రాజీనామాను అంగీకరించమని పట్టుబట్టి అందరు శాస్త్రవేత్తలకూ పదోన్నతి కల్పించారని చెప్పుకుంటారు. విదేశీ ఆకర్షణలను కాదని భార్గవ మాటపై వచ్చిన నాటి యువకులు ఈనాడు వారిరంగాల్లో గణనీయంగా విజయం సాధిస్తున్నారు. అవకాశాలు కల్పిస్తే భారతదేశం శాస్త్రవేత్తలు ఎవరికీ తీసిపోరని నిరూపించారు. ఈ సంస్థ పరిశోధనల ఫలితంగానే డీయన్‌ఏ పరీక్షలు నిర్వహించి నేరస్తులను, వారసులను గుర్తించే డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ టెక్నాలజీ వచ్చింది. లాకోన్స్ పేరుతో అరుదైన, అంతరించే ప్రమాదం ఉన్న వన్యప్రాణులకు జీవం పోసే సంస్థ కూడా దీని నుండి వచ్చిందే. శాస్త్ర ప్రపంచానికే గాక, ప్రజా సైన్సు ఉద్యమానికి భార్గవ లేని లోటు పూడ్చలేనిది. మతోన్మాదులు విజృంభించి ఆచారం పేరుతో, ఆహారం పేరుతో నరభక్షణ చేస్తున్న నేటి క్లిష్ట పరిస్థితుల్లో భార్గవ మృతి హేతువాదుల్ని, మానవతావాదుల్ని కలవరపరుస్తున్నది. కానీ ఆయన రాజీలేని తీరు, పోరాట పటిమ సహజ మార్పుకోరుకునే ప్రతి ఒక్కరికీ చిరకాలం గుర్తుంటుంది. స్ఫూర్తినిస్తుంది.



పి.ఎం.భార్గవ (ఫైల్)

సెల్: 9490098918

నితీష్‌కుమార్ నిర్ణయం చారిత్రక తప్పిదం కానున్నదా!



సిహెచ్.రమణకుమార్ రెడ్డి

అవకాశాలను అందిపుచ్చుకునేవారే విజేతలవుతారు, ఇది చరిత్ర చెప్పిన నగ్న సత్యం. బలమైన పాలక పక్షం, బలహీన మైన ప్రతిపక్షం తో నేడు భారత ప్రజాస్వామ్యం సంధికాలం లో ఉన్నది అనేది వాస్తవం. ప్రపంచం లోనే అతిపెద్దదైన భారత ప్రజాస్వామ్యం సుదీర్ఘ కాలం సురక్షితం గా ప్రయాణించాలి అంటే బలమైన పాలకునితో పాటు బలమైన ప్రతిపక్షం కూడా ఎంతో అవసరం. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో సమాఖ్య స్ఫూర్తి పారదర్శకంగా ఉండాలి అంటే బలమైన, క్రియాశీలమైన ప్రతిపక్షం ఉన్నప్పుడే అది సాధ్యం. ఏకపక్షంగా సాగిన ఏ వ్యవస్థ కూడా ఎక్కువకాలం కొనసాగినట్టు చరిత్రలో లేదు.


సమకాలీన రాజకీయాలను చూస్తే ప్రధాన ప్రతిపక్షం నాయకత్వ లేమితో బాధపడుతున్నది. రాష్ట్రాల్లో చూస్తే స్వాతంత్ర్య కాలం నాటి పరిస్థితులను తలపించేలా దేశంలో ప్రాంతీయ పార్టీలు, ప్రాంతీయ నాయకత్వాలు ఆయా ప్రాంతాలకే పరిమితమై అధికారం కోసం ఎత్తులు పై ఎత్తులు వేసుకుంటూ జాతీయ రాజకీయాల్లో తమపాత్రను కేవలం ప్రేక్షకపాత్రకే పరిమితం చేసుకుంటున్నాయి. అవినీతి మరకలతో మాయావతి తనపాత్రను ఉత్తరప్రదేశ్ కే పరిమితం చేసుకుంటే, ఫైర్ బ్రాండ్ మమతా బెనర్జీ బెంగాల్ దాటి రాలేని సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. అవినీతిని ఊడిచేస్తాడనుకున్న కేజ్రీవాల్ తన ఇంటి అవినీతికి సమాధానం చెప్పుకునే పనిలో ఉన్నాడు. ఇటువంటి తరుణంలో దేశంలోని ప్రజాస్వామ్య వాదుల దష్టంతా నితీష్ కుమార్ వైపు మరలింది. లోక్ నాయక్ జయ ప్రకాష్ నారాయణ అనుంగు శిష్యునిగా, నాలుగు దాశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సోషలిస్టు నాయకునిగా, దశాబ్ద కాలానికి పైగా కేంద్రమంత్రి, ముఖ్యమంత్రి గా అనుభవం గడించిన పరిపాలనా దక్షునిగా, అనేక సందర్భాల లో, సంక్షోభాలలో ప్రతిపక్ష కూటముల కు నాయకత్వం వహించి, మార్గదర్శనం చేసి ప్రభుత్వాలమీద ఒత్తిడి తెచ్చిన అపర చాణుక్యునిగా నితీశ్ కుమార్ జాతీయ నాయకుడు అనేది నాలుగు దశాబ్దాల రాజకీయాలపై అవగాహన ఉన్న ఎవరైనా ఒప్పుకోవలసిన విషయమే.

జాతీయస్థాయి నాయకత్వ లేమితో బాధపడుతున్న ప్రతిపక్షాలకు నాయకత్వం వహించగలిగే అవకాశం, వహించాల్సిన గురుతర భాద్యత నితీష్ కుమార్ మీద ఎంతైనా ఉన్నది. విలువలే ఆధారంగా రాజకీయాలు నడిపిన నాటి తరానికి, పదవులే ఆలంబనగా రాజకీయాలు నడిపిస్తున్న నేటి తరానికి మధ్య వారధిగా అది వారి నైతిక బాధ్యత. సమాఖ్య స్ఫూర్తికి సవాళ్లు ఎదురవుతున్న నేటి తరుణం లో, కమ్ముకొస్తున్న యుద్ధ మేఘాలు, దారితప్పుతున్న వితండవాదాలు జాతిని కలవరపెడుతున్న సమయంలో క్రియాశీలకంగా వ్యవహరించాల్సింది పోయి నితీష్ కుమార్ రాజీపడిపోవటం శోచనీయం. అయినా నెలల తరబడి దానా స్కాంలో జైలు జీవితం గడిపిన లాలు ప్రసాద్ యాదవ్ తో పొత్తులు కుదుర్చుకున్నప్పుడు కానరాని అవినీతి, లాలూతో కలిసి ఒకేవేదికపై మోడీ వ్యతిరేక ప్రచారం చేసినప్పుడు కానరాని అవినీతి, ఆర్.జే.డీ.తో పొత్తుల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు అగుపడని అవినీతి, కేవలం సి.బీ.ఐ. చార్జిషీట్ దాఖలు చేయగానే అగుపించిందా? అలా చెబితే నమ్మేంత వెర్రిమాలోకాలా ప్రజలు. బ్లాక్ మెయిల్ రాజకీయాలను ఎదుర్కోవాల్సింది పోయి పోరాట పంథానే వదిలేయటం ఎంతవరకు సమంజసం? విలువలతో కూడిన రాజకీయాలు కొనసాగించాల్సిన పరిణతి చెందిన నాయకుడు కూడా పదవులే లక్ష్యంగా రాజకీయాలు చేయటం ప్రజాస్వామ్యవాదులకు ఆశనిపాతమే. మహాత్మా గాంధీ, జయప్రకాష్ నారాయణ, దీన దయాళ్ ఉపాద్యాయ, అటల్ బిహారీ వాజ్పాయ్, సర్దార్ పటేల్, అంబేద్కర్ లాంటి ఎందరో మహానుభావులు పదవులకోసం కాకుండా, బలమైన ప్రభుత్వాల కోసం, రాజకీయ విలువల పరిరక్షణ లక్ష్యంగా తమ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు, వారి అడుగుజాడల్లో నడచిన నాటితరం యువ నాయకుడు నితీష్ కుమార్ రాజకీయజీవిత చరమాంకంలో పదవీ రాజకీయాలు చేయడం బాధాకరం.

నాటి మత్స్య బేహారీ నేడు మిత్రుడేలా అయ్యాడో ప్రతిపక్షానికీ, ప్రజాస్వామ్య వాదులకూ కాకపోయినా బీజేపీకి వ్యతిరేకంగా తనకు అనుకూలంగా ఓట్లేసిన ప్రజానీకానికి చెప్పాల్సిన బాధ్యత నితీష్ కుమార్ మీద ఉన్నది. వారికి బీ.జే.పీతో స్నేహం నల్లేరుమీద నడక ఎంతమాత్రం కాదు. జనతా దళ్ జాతీయ అధ్యక్షునిగా కాశ్మీర్ అంశం, పశువధ నిషేధం, అయోధ్య రామాలయ నిర్మాణం, వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అనైతిక సమీకరణాలు, అధికార కేంద్రీకరణ లాంటి అనేక విషయాల్లో అధికార పార్టీని సమర్థించడం ఆషామాషీ వ్యవహారం కాదు. స్వయంక్రుతాపరాధంతో నితీష్ కుమార్ తన స్థాయిని జాతీయ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికే పరిమితం చేసుకున్నాడు. ఏది ఏమైనా వారి నిర్ణయం ప్రజాస్వామ్యానికి అపశకునమే .

> **నాటి మత్స్య బేహారీ నేడు మిత్రుడేలా అయ్యాడో ప్రతిపక్షానికీ, ప్రజాస్వామ్య వాదులకూ కాకపోయినా బీజేపీకి వ్యతిరేకంగా తనకు అనుకూలంగా ఓట్లేసిన ప్రజానీకానికి చెప్పాల్సిన బాధ్యత నితీష్ కుమార్ మీద ఉన్నది. వారికి బీ.జే.పీతో స్నేహం నల్లేరుమీద నడక ఎంతమాత్రం కాదు. జనతా దళ్ జాతీయ అధ్యక్షునిగా కాశ్మీర్ అంశం, పశువధ నిషేధం, అయోధ్య రామాలయ నిర్మాణం, వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అనైతిక సమీకరణాలు, అధికార కేంద్రీకరణ లాంటి అనేక విషయాల్లో అధికార పార్టీని సమర్థించడం ఆషామాషీ వ్యవహారం కాదు.**

సెల్ :9440449392



బండారి బాబు

అనేక ఏండ్లుగా క్రైస్తవులు, దళిత క్రైస్తవులు అన్ని విధాలుగా వెనుకబడిపో తూనే ఉన్నారు. అణచివేతకు, వివక్షకు గురవుతూనే ఉన్నారు. దళితులు ఏ మతం స్వీకరించినా వారి స్థితి గతులు మారడం లేదు. సామాజిక స్థాయి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు గడిచినా దళితక్రైస్తవుల పరిస్థితి ఏ మాత్రం మారక పోగా సామాజికంగా ఇంకా వెనుకబాటుతనాన్నే అనుభవించడం దురదృష్ట కరం. ప్రజాస్వామ్య వ్యవస్థలో క్రైస్తవుల పట్ల అణచివేత, వివక్ష కొనసాగుతున్న ది. క్రైస్తవుల స్థితిగతులను మార్చేందుకు పాలకులు ఏమాత్రం శ్రద్ధ చూపలేదు.

మారని క్రైస్తవులు, దళిత క్రైస్తవుల స్థితిగతులు

భారతదేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నుంచి క్రైస్తవమత సంఘాలు, సంస్థలు కుల, మత, పేద, ధనిక తేడా లేకుండా అనేక రకాలుగా నిస్వార్థంగా వైద్య, విద్య, సామాజిక రంగాలలో సేవలందించడం జరుగుతున్నది. అనేక రంగాలలో ప్రభుత్వంతో సమానంగా సేవలు చేస్తూనే ఉంది. ఈరోజుకీ కూడా క్రైస్తవ సమాజం బాధ్యతా యుతమైన సేవలను అందిస్తూనే ఉంది. కేవలం క్రైస్తవ మతం స్వీకరించిన కారణం గా హక్కులను కోల్పోవడం జరుగుతుం దంటే భారత రాజ్యాంగానికి మాయని మచ్చ. మతం మారినా కూడా క్రైస్తవుల స్థితిగతులు మారలేదని 1955 నుంచి 2007 వరకు నియమించబడిన అనేక కమిషన్స్ ధృవీకరించాయి. క్రైస్తవ మతం స్వీకరించిన దళితు ల స్థితిగతులు మార్పుచెందేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా కొన్ని హక్కులు, భద్రత కల్పించబడినా వాటిని అమలు చేయడంలో మన పాలకులు ఏమాత్రం దృష్టి సారిం చడం లేదు.ఈ స్థితి దళిత క్రైస్తవుల పైనా, క్రైస్తవులపైనా తీవ్ర ప్రభా వం చూపుతోం ది. మత పరమైన వివక్ష, దాడులు, అణచివేత కొనసాగినా మన పాలకులు పట్టిం చుకోకపోగా వాటిని సమర్థించే విధంగా వ్యవహరిం చడం క్రైస్తవు మతంపై పాలకులే వివక్ష చూపుతున్నారనడానికి నిదర్శంగా నిలుస్తోంది. దేశంలో అనేక ప్రాంతాల్లో క్రైస్తవులపై ఇప్పటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి స్థితిలో ప్రభుత్వాలు క్రైస్తవుల పట్ల, దళిత క్రైస్తవుల పట్ల నిర్లక్ష్యం వీడాలి. అన్ని రకాలుగా భరోసానివ్వాలి. 1956లోనూ దేశంలో సిక్కు మతం స్వీకరించిన దళితుల కోసం, బౌద్ధం, క్రిస్టియన్ మతాన్ని స్వీకరించిన దళితుల కోసం 1990లో కూడా ప్రెసిడెన్సియల్ (ఎస్సీ) ఆర్డర్ 1950 సవరించబడింది. ఈ ఆర్డర్‌ను అనుసరించి హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు స్వీకరించిన దళితులకున్న హక్కులు, భద్రతను దళిత క్రిస్టియన్లకు, క్రిస్టియన్లకు, దళిత ముస్లింలకు కూడా హక్కులు, భద్రత కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టా లి. క్రిస్టియన్ మతాన్ని స్వీకరించిన దళితులను ఎస్సీలుగానే గుర్తించి అన్ని రకాలుగా ఆదుకోవాలి. అందు కోసం కేంద్ర ప్రభుత్వం 1950 నాటి ప్రెసిడెన్సియల్ (ఎస్సీ) ఆర్డర్‌ను సవరించాలి. దళిత క్రిస్టియన్లకు, క్రిస్టియన్లకు తగు న్యాయం చేయాలి.

సెల్ : 9490099197



వంగరి రవిరాజు

డెబ్బై ఒకటవ స్వాతంత్ర సంబరాలు జరుపుకున్నాము. ఆర్థిక సంస్కరణలు అమలు చేసుకొని అర్ధరాత్రి పార్లమెంటు సమావేశాలు జరుపు కున్నాము. 104 ఉప గ్రహాలను ఏకకాలంలో నింగికి పంపించి శాస్త్ర సాంకేతిక రంగాల్లో తిరుగులేని విజయాల ను నమోదు చేసుకు న్నాము. 'దళితున్ని' రాష్ట్రపతిని చేసినామని జబ్బలు చరుచుకుం టున్నాము. ఇదే దేశంలో ఇంకోవైపు దళితులపై దాడులు, తెలుగు రాష్ట్రాల్లో దళితుల వెలివేతలు జరగడం, ఇంకా నాగరిక సమాజంలో దళితులు వివక్షతకు, అణచివేతకు గురవుతున్నారని ప్రత్యక్ష ఉదాహరణలు. అసలు ప్రశ్నల్లా ఈ దేశంలో దళితులు రెండవ తరగతి పౌరులుగా ఉన్నారా?

'వెలి' అనే పదం కుల భూస్వామ్య పెత్తందారీ అహంకార పూరితమైన నిరంకుశత్వానికి నిదర్శనం. స్వాతంత్ర్యం అనంతరం మన దేశాన్ని గణతంత్ర ప్రజాస్వామ్య దేశంగా ప్రకటించుకున్నాము. ఇటువంటి గణతంత్ర ప్రజాస్వామ్య దేశంలో 'వెలి' కి స్థానం ఉంటుందా. తెలుగు రాష్ట్రాల్లో వెలివేతలు బాహటంగానే జరుగుతున్నా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలు చోద్యం చూడటంలో ప్రధాన కారణం బలమైన కుల వ్యవస్థ. ఒక వర్గం మరొక వర్గాన్ని వెలి వేస్తున్నాయి అంటే దానికి కారణం కులం, ఆధిపత్యం, అధికారం, బలం ఉండటమే. అనాదిగా అగ్రకులాల చేతిలో భూములు, సంపద ఉండటం, దళితులు ఆశ్రితులుగా ఉండటం వల్ల 'వెలి' సాధ్యమవుతుంది. స్వాతంత్ర్యం అనంతరం కొద్ది మంది చేతుల్లో ఉన్న భూమి, సంపద శాస్త్రీయంగా పంపిణీ జరుగకపోవడం, ప్రభుత్వాలు భూసంస్కరణలు నామమాత్రంగా చేసి చేతులు దులుపుకోవడం, సంపద ఒక వర్గం వద్ద కేంద్రీకతం అవడం వల్ల, ఆ వర్గం ఆధిపత్యం, అధికారం చేజిక్కించుకోగలిగారు. వాళ్ళ వద్ద ఆశ్రితులుగా ఉన్న దళితులు తాము చెప్పినట్టు వినకపోతే వెలి వేయడం జరుగుతుంది.

దళితులపై దాడులు

రెండు తెలుగు రాష్ట్రాల్లో వెలివేతలు పరిశీలించినట్లయితే, పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రులో దళితులు ఆ గ్రామ చెరువుగట్టు మీద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దాన్ని సహించలేని అగ్రకులాలు దళితులను సాంఘికంగా బహిష్కరించడం, ఆశ్రితులుగా ఉన్న దళితులకు కౌలుకు భూమి ఇవ్వకపోవడం, కూలి పనులకు పిలవకపోవడం, వారిని ఆర్థికంగా దెబ్బతీయడంతో అణిగి ఉంటారని అనుకున్నారు. వెలి వేయడం ద్వారా వారిని సమాజం నుండి సామాజికంగా, మానసికంగా దూరం గా ఉంచడంతో కాలిన కడుపులతో ఆత్మగౌరవ ఉద్యమాలు చేశారు. ఆ వేడి చల్లారకముందే నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మంథనిలో దళితులు వెలివేతకు గురయ్యారు. గతంలో దళితులకు ఇచ్చిన భూమిని కాజేయడానికి ప్రయత్నించిన అగ్రకులాల పెత్తందారులు దళితులు ప్రతిఘటించడంతో గ్రామాభివద్ధి కమిటీ మాటున వెలి వేయడం జరిగింది. ఇక్కడ దళితుల వ్యవసాయ అవసరాలకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు పంపకుండా అడ్డుకోవడం, తదితర కనీస అవసరాలు తీర్చకుండా అడ్డుకోవడం వల్ల మానసిక క్షోభకు గురై జిల్లా యంత్రాంగాన్ని ఆశ్రయించి కేసులు పెట్టడంతో రాజీకి వచ్చారు.

> **తెలుగు రాష్ట్రాల్లో దళితులపై దాడులు, వెలివేతలు ఆగ్రహం కలిగిస్తున్నాయి. ఈ దేశంలో దళితుల్ని రెండవ తరగతి పౌరులుగా చూడటం, సాంఘిక బహిష్కరణకు గురిచేసి మానసికంగా వేధించడం వెలివేతలు ఎదుర్కొంటూ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవడం కోసం పోరాటాలు చేసిన దళితనాయకులు మద్దతు నివ్వకపోవడం తమని మరింత ఆత్మాన్యూత స్థితికి లోనుచేస్తున్నది.**

ఈ రెండు ఘటనలు కూడా సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చాయి. దళిత సంఘాలు ఆందోళన చేయడంతో మీడియా రావడంతో సమస్య తీవ్రత వెలుగులోకి వచ్చి ప్రభుత్వ యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. ఈ రెండు సందర్భాల్లో దళిత ప్రజాప్రతినిధుల సహకారం లేకపోవడం గమనించదగ్గ విషయం. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు ఉపయోగించుకొని చట్టసభల్లో హోదాలు వెలగబెడుతున్న నాయకులకు దళితుల వెలివేతలు కానరాకపోవడం ఒకింత విస్మయానికి గురిచేస్తుంది. దళితులకు రాజ్యాంగ హక్కులు, రాజకీయ హక్కులు రిజర్వేషన్ల ద్వారా కల్పిస్తే దళితుల సమస్యలపై చట్టసభల్లో పోరాడే అవకాశం ఉంటుందని అంబేద్కర్ భావించాడు. కానీ ఆయన కల్పించిన రిజర్వేషన్లు వాడుకొని అగ్రకులాల పార్టీలకు ఊడిగం చేయడం తప్ప దళితుల సమస్యలు ప్రస్థావించిన సందర్భాలు ఏవి? గరగపర్రులో అంబేద్కర్ విగ్రహం నేలకొల్పినందుకే దళితులను వెలి వేస్తే, ఆ రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్న నాయకులు చోద్యం చూస్తుండటం తప్ప వారి గురించి పోరాడినవాడు లేడు.

అంబేద్కర్ రాజకీయ రిజర్వేషన్లు ఎందుకు కల్పించాడో తెలువకుండా, కేవలం ఆ రిజర్వేషన్లను ఉపయోగించుకుని పదవులు అనుభవిస్తూ అంబేద్కర్ సిద్ధాంతాలకు ద్రోహం తలపెడుతూ రాజకీయ చెంచాలుగా బతుకుతున్నారు. దళితులపై ఒక వైపు దాడులు జరుగుతున్నా, వెలివేతకు గురవుతున్నా, హత్యలు జరుగుతున్నా దళిత నాయకులు స్పందించకపోవడం అత్యంత శోచనీయం. పార్టీల్లో, ప్రభుత్వ కార్యక్రమాల్లో తమను చిన్నచూపు చూస్తే, 'దళితులము కాబట్టి చిన్నచూపు చూస్తున్నారు' అన్న నాయకులకు తాము నాయకత్వం వహిస్తున్న దళితులను చంపుతున్నా కనబడకపోవడం అత్యంత బాధాకరం. ప్రోటోకాల్ పాటించట్లేదని అధికారులను నిలదీస్తున్నారు, శిలాఫలకాల్లో తమ పేర్లు కింద వేస్తున్నారని నిరసన వ్యక్తం చేస్తున్నారు కానీ 500 పైగా దళిత కుటుంబాలను వెలి వేసి మానసికంగా కుంగదీస్తున్నా ఆ నాయకులకు కానరాకపోవడం సిగ్గుచేటు. అగ్రకులాల అమ్మాయిని ప్రేమించిన కారణానికి మర్మాంగాలు కోసి అత్యంత దారుణంగా హత్య చేసినప్పటికీ, దళిత నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం, తమ పార్టీ అధినేతపై ప్రతిపక్షాలు విమర్శిస్తే మాత్రం తామే ముందునిలచి కౌంటర్ ప్రెస్‌మీట్లు పెడతారు. మరి ఎందుకు దళితులపై వివక్ష, అణచివేత, హత్యాకాండలు కానరావడం లేదు. తమని చట్టసభల్లోకి ఎందుకు పంపించారో తెలియకపోవడం, వారిని గురించి పట్టించుకోకపోవడం జాతి ద్రోహమే అవుతుంది.

తెలుగు రాష్ట్రాల్లో దళితులపై దాడులు, వెలివేతలు దళితుల్లో ఆగ్రహాన్ని కలిగిస్తున్నాయి. ఈ దేశంలో దళితుల్ని రెండవ తరగతి పౌరులుగా చూడటం, సాంఘిక బహిష్కరణకు గురిచేసి మానసికంగా వేధించడం వెలివేతలు ఎదుర్కొంటూ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవడం కోసం పోరాటాలు చేసిన దళితనాయకులు మద్దతు నివ్వకపోవడం తమని మరింత ఆత్మాన్యూత స్థితికి లోనుచేస్తుంది. దళితున్ని రాష్ట్రపతి చేయడం దళితుల సమస్యలకు పరిష్కారం కాదు. క్షేత్ర స్థాయిలో దళితులు ఎదుర్కొంటున్న వివక్ష, దాడులు, వెలివేతలపై ప్రభుత్వాలు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టి దళితులకు రక్షణగా నిలవాలి. ఇలాగే వెలివేతలు జరుగుతున్నా పట్టించుకోకుంటే ఆ అణచివేత నుండి తిరుగుబాటు మొదలవుతుంది.

సెల్ : 9908170175

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. లేనట్లయితే ఎడిటింగ్‌లో మీరు చెప్పదలచిన అభిప్రాయాలు స్పష్టత కోల్పోవచ్చు. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. - ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228


నవచిత్రం

మెగాస్టార్ 151 షురూ..



సురేందర్‌రెడ్డి, పరుచూరి బ్రదర్స్, చిరంజీవి, రామ్‌చరణ్, సురేఖ, అల్లు అరవింద్

చిరంజీవి నటించబోయే 151వ చిత్రం 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' మొదలైంది. కొణిదెల ప్రొడక్షన్స్ కార్యాలయంలో జరిగిన పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ, రామ్‌చరణ్, అల్లు అరవింద్, దర్శకుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం విదితమే. ఆగస్ట్ 22న మెగాస్టార్ చిరంజీవి బర్త్‌డే నేపథ్యాన్ని పురస్కరించుకుని ఈచిత్ర లోగో, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసే యోచనలో చిత్రయూనిట్ ఉందని సమాచారం. బాలీవుడ్ కథానాయిక ఐశ్వర్యరాయ్‌తో చర్చలు జరిపినప్పటికీ ఈ చిత్రంలో చిరంజీవి సరసన కథానాయికగా నయనతార నటించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే, ఈ చిత్రానికి 'మహావీర్' అనే టైటిల్‌ను చిత్రయూనిట్ పరిశీలిస్తున్నట్టు సోషల్‌మీడియాలో హల్‌చల్ అవుతోంది.



రాజు వచ్చినాడు..!

పవన్‌కళ్యాణ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రానికి సంబంధించి రోజుకొక టైటిల్ సోషల్‌మీడియాలో సందడి చేస్తోంది. 'ఇంజనీర్ బాబు', 'గోకుల కృష్ణుడు', 'దేవుడు దిగివచ్చిన వేళ' వంటి టైటిల్స్ ఇప్పటివరకు వినిపించినప్పటికీ తాజాగా 'రాజు వచ్చినాడు' అనే టైటిల్ పరిశ్రమ వర్గాల్లో బాగా వినిపిస్తోంది. ఇక సామాజిక మీడియాలోనైతే ఇదే ఫైనల్ టైటిల్ అంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. యాదృచ్ఛికమైనప్పటికీ ఎన్టీఆర్ నటించిన 'దమ్ము' చిత్రంలోని 'రాజు వచ్చినాడు..' అంటూ సాగే పాట ఆధారంగా ఈ టైటిల్ పెట్టబోతున్నట్టు సమాచారం. సెప్టెంబర్ 2వ తేదీ పవర్‌స్టార్ బర్త్‌డే కానుకగా ఈచిత్ర లోగోను, ఫస్ట్‌లుక్‌ను అభిమానులకు కానుకగా చిత్ర బృందం విడుదల చేయబోతున్నట్టు తెలుస్తోంది. 'జల్సా', 'అత్తారింటికి దారేది' వంటి బ్లాక్‌బస్టర్స్ తర్వాత పవర్‌స్టార్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రంలో పవన్‌కళ్యాణ్ సరసన కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ కథానాయికలుగా నటిస్తున్నారు.

నవయుగ సవ్యసాచి..

అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా చందు మొండేడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం.4కు 'సవ్యసాచి' అనే టైటిల్ నిర్ణయించారు. ఈ చిత్రానికి సంబంధించి ప్రీలుక్‌తోపాటు టైటిల్ పోస్టర్‌ను చిత్రయూనిట్ బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ,'దర్శకుడు చందు మొండేటి రాసిన అత్యద్భుత హీరో క్యారెక్టరైజేషన్‌కు 'సవ్యసాచి' అనేది పక్కా యాప్ట్ టైటిల్. 'ప్రేమమ్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అక్కినేని నాగచైతన్య, చందు మొండేటి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తాం. మిగిలిన వివరాలను త్వరలోనే తెలియజేస్తాం' అని చెప్పారు.



'సవ్యసాచి' చిత్ర ఫస్ట్‌లుక్

షాడో మిస్సింగ్ కాన్సెప్ట్‌తో నెపోలియన్



భోగేంద్ర గుప్త, కోమలి, ఆనంద్ రవి, దామోదర ప్రసాద్, సందీప్ కిషన్

ఆచార్య క్రియేషన్స్, ఆనంద్ రవి కాన్సెప్ట్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'నెపోలియన్'. ఆనంద్ రవి దర్శకత్వంలో భోగేంద్ర గుప్త మడుపల్లి నిర్మిస్తున్న ఈచిత్ర ట్రైలర్ లాంచ్ బుధవారం ప్రసాద్‌ల్యాబ్స్‌లో వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన నిర్మాత కె.ఎల్.దామోదర ప్రసాద్, హీరో సందీప్‌కిషన్ ట్రైలర్‌ను సంయుక్తంగా విడుదల చేశారు.

ఈ సందర్భంగా కె.ఎల్.దామోదర ప్రసాద్ మాట్లాడుతూ,' దర్శకుడు, ఈ చిత్ర కథానాయకుడు ఆనంద్ రవి నాకు ఎప్పుడ్నుంచో పరిచయం. అతను చేసిన 'పేరెంట్స్' మూవీ చూసి భవిష్యత్‌లో మంచి దర్శకుడు అవుతాడని భావించాను. ఆ తర్వాత అతనందించిన మంచి కథతో రూపొందిన 'ప్రతినిధి' అందరినీ అలరించడంతోపాటు ఆలోచించేలా చేసింది. ఈ సినిమాలో కథానాయకుడిగా ఇతనే యాప్ట్ అని ట్రైలర్ చూసిన తర్వాత అర్థమైంది. డబ్బులు పెడితే సినిమా అయిపోతుందిలే అని కాకుండా సినిమాకి సంబంధించిన ప్రతి విభాగంపై అవగాహన పెంచుకున్న నిర్మాత భోగేంద్ర గుప్త అభినందనీయుడు. ఈ సినిమాతో ఆయన సక్సెస్ సాధించాలని ఆశిస్తున్నాను. విజువల్‌గా, మ్యూజిక్ పరంగా సినిమా చాలా చాలా బాగా వచ్చిందని నమ్ముతున్నాను. మంచి కాన్సెప్ట్‌తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈచిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు.

'నాది, ఆనంద్‌రవిది ఒకేరోజు పుట్టినరోజు. 12 సంవత్సరాలుగా నా కష్టనష్టాల్లో తోడుగా నిలిచాడు. అతని రాసిన 'ప్రతినిధి' సినిమా నేనే చేయాల్సి ఉంది. అలాగే ఈ సినిమా కూడా నేనే చేద్దామనుకున్నాను. కాన్ని కొన్ని కారణాల వల్ల చేయలేకపోయాను. తదుపరి సినిమా కచ్చితంగా చేస్తాననుకుంటున్నాను. ఆనంద్ రవి రాసే కథలన్ని చాలా బాగుంటాయి. వాటితో పోలిస్తే ఈ నెపోలియన్ కథ మరో ఎత్తులో ఉంటుంది' అని సందీప్ కిషన్ అన్నారు.

'ఈ కథతో నేను చాలా మందిని కలిశాను. 'నీడ పోయింది' అనే పాయింట్ చెప్పగానే ఇది షార్ట్ ఫిల్మా అని అడిగారు. ఇందులో నేనే హీరోగా నటిస్తున్నానని చెప్పగానే, నువ్వు హీరోనా.. అని అడిగారు. ఇలా రకరకాల స్టేజెస్‌లో ఎదురైన ప్రతి సవాల్‌ని ఎదుర్కొని ఈ రోజు ఈ స్థాయికి వచ్చాను. థ్రిలర్ జోనర్ మూవీనే అయినప్పటికీ చాలా కొత్తగా ఉంటుంది. గత సినిమాలకు పొందిన అనుభవంతో ఈచిత్రాన్ని తెరకెక్కించాను. అందరినీ అలరించే చిత్రమిది' అని దర్శకుడు, హీరో ఆనంద్ రవి చెప్పారు.

'రెగ్యులర్ సినిమాలు చూసే ప్రేక్షకులకు కొత్తదనం ఇచ్చే చిత్రమిదని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. మంచి కాన్సెప్ట్‌తో సోషల్ ఎవేర్‌నెస్ తీసుకొచ్చేలా ఈ చిత్రాన్ని ఆనంద్ రవి రూపొందించారు. ఆయనకు, నిర్మాతకు ఈ సినిమా మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నాను' అని మాటల రచయిత లక్ష్మీభూపాల్ చెప్పారు.

'ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ. 100కి 110 శాతం ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది' అని కథానాయిక కోమలి అన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న ఫిల్మ్ జర్నలిస్ట్ వరప్రసాద్ కోసం తనకి చెందిన ట్రిపుల్ ఎస్ అనే ఎన్.జి.ఓ. సంస్థ ద్వారా 25 వేల రూపాయల చెక్‌ను సీనియర్ జర్నలిస్ట్‌లు బి.ఎ.రాజు, పసుపులేటి రామారావుకు నిర్మాత భోగేంద్ర గుప్తా అందించి సేవా గుణాన్ని చాటుకున్నారు. నిర్మాత చూపిన ఔదార్యానికి సినిమా జర్నలిస్ట్‌లందరూ కృతజ్ఞతలు తెలిపారు.



కె.ఎస్.రామారావు, సాయిధరమ్ తేజ్, కరుణాకరన్

ప్రేమకథ నేపథ్యంలో..

సాయిధరమ్ తేజ్, అనుపమా పరమేశ్వరన్ జంటగా ఎ.కరుణాకరన్ దర్శకత్వంలో క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై ప్రొడక్షన్.నెం.45గా నిర్మాత కె.ఎస్.రామారావు నిర్మిస్తున్న చిత్రం పూజా కార్యక్రమాలతో బుధవారం హైదరాబాద్‌లోని ఎఫ్ఎన్‌సీసీలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్మాత కె.ఎస్.రామారావు మాట్లాడుతూ,'ఈ రోజు మా ప్రొడక్షన్‌లో నిర్మించబోతున్న 45వ సినిమాను పూజా కార్యక్రమాలతో ప్రారంభించాం. రెగ్యులర్ షూటింగ్ విజయదశమి నుంచి స్టార్ట్ అవుతుంది. ఈ సినిమా స్టార్ట్ అవ్వడంలో కథానాయకుడు సాయిధరమ్ తేజ్ కృషి ఎంతో ఉంది. దర్శకుడు కరుణాకరన్ చెప్పిన కథ ఆయనకెంతో బాగా నచ్చి, ఈచిత్రాన్ని నేనైతే బాగా చేస్తానని పిలిచి ఈచిత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. కరుణాకరణ్ సినిమాలన్ని మంచి మంచి ప్రేమకథలతో వచ్చినవే. ఆ కోవలోనే ఆయన మరో మంచి మ్యూజికల్ లవ్‌స్టోరీతో మీముందుకు రాబోతున్నారు. ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభమయ్యాయి. దర్శకుడు కరుణాకరన్ ఇచ్చిన స్ఫూర్తితో సంగీత దర్శకుడు గోపీసుందర్ రెండు అద్భుతమైన ట్యూన్స్ ఇప్పటికే సిద్ధం చేశారు. అలాగే కథానుగుణంగా డార్లింగ్ స్వామి సంభాషణాలు రాస్తున్నారు. మంచి టీమ్‌తో ఈచిత్రాన్ని నిర్మిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని చెప్పారు. 'తేజుతో సినిమా చేయడానికి చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నాను. ఇది కంప్లీట్ లవ్ స్టోరీ. కలర్‌ఫుల్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో జాలీగా ఉండే చిత్రమిది' అని దర్శకుడు కరుణాకర్ తెలిపారు. 'అభిరుచిగల నిర్మాత కె.ఎస్.రామరావుతో గతేడాదిగా ఓ సినిమా చేయాలనుకున్నాను. సరైన కథ దొరక్కపోవడంతో వెయిట్ చేశాం. ఫైనల్‌గా కరుణాకర్ చెప్పిన కథ మాకు నచ్చింది. దీంతో ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. నాకు చిన్నప్పట్నుంచి కరుణాకర్ తెలుసు. ఆల్‌మోస్ట్ నాకు మరో మావయ్య. నెరేషన్ టైమ్‌లో ఈ కథ విని ఎంత బాగా ఎంజాయ్ చేశానో, అలాగే సినిమా షూటింగ్ టైమ్‌లో కూడా అదే స్థాయిలో ఎంజాయ్ చేస్తాననే నమ్మకం ఉంది. మా యంగ్ జనరేషన్‌తో కూడా సినిమాలు తీస్తున్న కె.ఎస్.రామరావుకి ఒక మంచి సినిమా ఇస్తామని కాన్ఫిడెంట్‌గా చెప్పగలను' అని సాయిధరమ్ తేజ్ అన్నారు.



అద్భుతమైన జర్నీ..

'బాహుబలి'లో అద్భుత యుద్ధ పోరాటలు చేసి ప్రేక్షకులను మెస్మరైజ్ చేసిన తమన్నా అందుకు భిన్నంగా 'అభినేత్రి'లో నటించి అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. తాజాగా మరోసారి యాక్షన్ సీక్వెన్స్‌లతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రస్తుతం విక్రమ్ సరసన 'స్కెచ్' చిత్రంలో తమన్నా నటిస్తోంది. విజయ్ చందర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా చేసే యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను అలరిస్తాయని చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రంలో తన షూటింగ్ పార్ట్ పూర్తయిన సందర్భంగా తమన్నా స్పందిస్తూ, "స్కెచ్' చిత్రం ఒక అద్భుతమైన జర్నీ. విక్రమ్, విజయ్ చందర్ సార్‌లను చాలా మిస్ అవుతున్నాను. వారితో పనిచేయడం గ్రేట్ మెమరీ' అని తెలిపింది. యాక్షన్ కామెడీగా రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే నెలలో విడుదల కానుంది. తమన్నా దీంతోపాటు 'ఖామోషి', కూనల్ కోహ్లి చిత్రంలోనూ నటిస్తోంది.



భద్రత ప్రతి మహిళ హక్కు..

'ఇప్పుడు అమ్మాయిలను కాపాడ్డంలో 'భేటీ బచావో' కార్యక్రమం ఏమైంది?. కుమారుడికి జన్మనివ్వాలని నాకస్సలు లేదు. కానీ ఇప్పుడు అమ్మాయికి జన్మనివ్వాలంటే భయంగా ఉంది. స్వర్గం నుంచి నరకానికి నన్నెందుకు తీసుకొచ్చావని మా అమ్మాయి అడిగితే నేను ఏం చెప్పగలను' అంటూ అవేదన వ్యక్తం చేసింది బుల్లితెర నటి దివ్యాంక త్రిపాఠి. స్వాతంత్ర్య దినోత్సవం రోజే చండీగడ్‌లో ఓ వ్యక్తి 12 సంవత్సరాల బాలికపై ఆత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పాఠశాలలో పతాకావిష్కరణకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్న తరుణంలో బాలికపై జరిగిన ఈ అఘాయిత్యం నేపథ్యంలో దేశంలో మహిళల భద్రతను ఉద్దేశించి దివ్యాంక ట్విటర్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. 'క్రూరమైన నేరాలు చేసే వారిని ఎందుకు క్రూరంగా శిక్షించరు?, మళ్లీ మరో అత్యాచారం. మనం ఏ స్వాతంత్ర్యం గురించి మాట్లాడుకుంటున్నాం?, దేశానికి మహిళలు ముఖ్యం కాదు అనుకునే పార్టీలకు ఓట్లు వేయడాన్ని మహిళలు ఇకపై ఆపాలి. రేపిస్టులు స్వేచ్ఛగా తిరుగుతున్న లోకంలో జీవిస్తున్నామా? అని ప్రశ్నించారు. 'మేమెందుకు ఓటు వేయాలి. 70 ఏండ్ల స్వాతంత్ర్యం ఇంకా మాకెందుకు స్వేచ్ఛనివ్వలేదు. పార్టీలన్ని ఇప్పుడు నిద్ర లేవాల్సిన తరుణం ఆసన్నమైంది. భద్రత ప్రతి మహిళ హక్కు' అంటూ దివ్యాంక ఘాటైన రీతిలో పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దివ్యాంక నటించిన హిందీ సీరియల్ 'మనసు పలికే మౌనగీతం' పేరుతో తెలుగునాట ప్రసారమవుతోంది.

ఇదే మంచి తరుణం



కృతి సనన్

'నా పాత్రల ద్వారా లేదా నా సినిమా ద్వారా ప్రేక్షకులకు కొత్త విషయాలను చెప్పాలనుకుంటాను. అలా చెప్పడానికి స్కోప్ ఉండే నవ్య పాత్రలను బాగా ఇష్టపడతాను' అని అంటోంది కృతి సనన్. 'వన్ నేనొక్కడినే'లో మహేష్ సరసన నటించి తెలుగునాట హీరోయిన్‌గా తెరంగేట్రం చేసింది కృతి. 'హీరోపంతి' చిత్రంతో బాలీవుడ్‌లోనూ అడుగిడింది. గ్లామర్‌రోల్స్‌తోనే కాకుండా పక్కింటి అమ్మాయిలా బబ్లీ పాత్రలు చేస్తూనే శక్తివంతమైన మహిళగా పోరాటాలు కూడా చేసి ప్రేక్షకులను మెప్పించింది. ఇప్పటివరకు నటించిన ఐదు సినిమాల్లోనూ భిన్న పాత్రలు పోషించి తన ప్రత్యేకత చాటుకుంది.

తాజాగా 'బరేలీ కి బర్ఫీ' చిత్రంలో నటిస్తోంది. ఈ నెల 18న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో కృతి మాట్లాడుతూ,'ఈ చిత్రంలో నేను బిట్టీ అనే పాత్రలో కనిపిస్తాను. ఇది నా గత పాత్రలతో పోల్చితే డిఫరెంట్ రోల్. స్క్రిప్ట్ నెరేట్ చేసినప్పుడు నా పాత్ర చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. నేను ఒక సినిమాను ఎంపిక చేసుకున్నానంటే అది భిన్న, నవ్యమైన అంశాలను ఎక్స్‌ప్లోర్ చేసేదిగా ఉండాలి. బిట్టీ పాత్ర ఈ కోవలోనే ఉంటుంది. ఇందులో తొలిసారి స్మాల్ టౌన్ గర్ల్‌గా, ఉత్తర ప్రదేశ్ మాండలికం మాట్లాడే అమ్మాయిగా, మేకప్ లేకుండా కనిపించబోతున్నా. ఇదొక ట్రయాంగిల్ లవ్ స్టోరీ నేపథ్యంలో సాగే చిత్రం. కచ్చితంగా అందరినీ అలరిస్తుంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో మంచి సినిమాలొస్తున్నాయి. మాలాంటి వారికి మంచి నటిగా పేరు తెచ్చుకునేందుకు మంచి తరుణం' అని తెలిపింది.

స్క్రీన్‌ప్లే హైలైట్‌గా మేడ మీద అబ్బాయి

అల్లరి నరేష్, నిఖిల విమల్ జంటగా శ్రీమతి నీలిమ సమర్పణలో జి.ప్రజిత్ దర్శకత్వంలో బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్న చిత్రం 'మేడ మీద అబ్బాయి'. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈచిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉంది. ఈ సందర్భంగా నిర్మాత బొప్పన చంద్రశేఖర్ మాట్లాడుతూ,'కొత్తదనంతో ఉన్న కథతో చేస్తున్న విభిన్న చిత్రమిది. నరేష్ కెరీర్‌లో ఓ మైలురాయిగా ఈచిత్రం నిలుస్తుందనే నమ్మకం ఉంది. 'గమ్యం', 'శంభో శివ శంభో' తర్వాత ఆ తరహా సున్నితమైన కథతో నరేష్ చేస్తున్న చిత్రమిది. రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా నిలుస్తుంది. నేచురల్ థ్రిల్లింగ్ అంశాలతోపాటు నరేష్ శైలి వినోదం ఉంటుంది. ఈ చిత్రంలోని పాటలను త్వరలోనే విడుదల చేసి, సెప్టెంబర్ మొదటి వారంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం' అని చెప్పారు. అవసరాల శ్రీనివాస్, జయప్రకాష్, తులసి, సుధ, సత్యంరాజేష్, మధునందన్, జబర్దస్త్ ఆది, పద్మాజయంతి, రవిప్రకాష్, వెన్నెల రామారావు తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి కెమెరా : ఉన్ని ఎస్.కుమార్, సంగీతం: షాన్ రెహమాన్, ఆర్ట్ : రాజీవ్ నాయర్, ఎడిటింగ్ : నందమూరి హరి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత : ఎం.ఎస్.కుమార్, సమర్పణ : శ్రీమతి నీలిమ, నిర్మాత : బొప్పన చంద్రశేఖర్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం :జి.ప్రజిత్.



నిఖిల విమల్ , అల్లరి నరేష్

సెన్సేషనల్ హిట్ సాంగ్..



'దళపతి' చిత్రయూనిట్ సభ్యులు

ఆది అక్షర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సదా దర్శకత్వంలో పెదపూడి బాబురావు నిర్మిస్తున్న చిత్రం 'దళపతి'. సదా, కవితా అగర్వాల్, బాబు, ప్రియాంకశర్మ ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. ఇటీవల 'నీకు నాకు మధ్య ఏదో ఉంది..' అంటూ సాగే పల్లవిగల పాటను ఈ చిత్రం కోసం ప్రముఖ గాయని శ్రేయాఘోషాల్‌తో యాజమాన్య కలిసి పాడారు. ఈ పాట ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'యూ ట్యూబ్‌లో విడుదల చేసిన శ్రేయాఘోషాల్ పాడిన పాట సెన్సేషనల్ హిట్ అయ్యింది. యాజమాన్య సంగీతం, జై కెమెరా పనితనం సినిమాకు పెద్ద ప్లస్ అవుతాయి. విభిన్న కథాంశంతో యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించాం. షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు.

నీతి, నిబద్ధతతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిజాయితీతో, నిబద్ధతతో పనిచేస్తే ఏదైనా సాధించవచని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పనిచేస్తే కచ్చితంగా గుర్తింపు లభిస్తుందన్నారు. ఆ శాఖ కమిషనర్‌గా ఉత్తమ సేవలు అందించినందుకు గాను ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వ 'ఎక్సలెన్స్' అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ, సంస్థ, లీగల్ మెట్రాలజీ ఉద్యోగులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారంనాడు కమిషనర్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ఈ అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందని, ఈ అవార్డు ఒక్కరి విజయం కాదు, సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందని, తనకు అవార్డు వస్తే మీ అందరికి వచ్చినట్టేనని చెప్పారు. శాఖలోని ప్రతి ఒక్కరు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కింది స్థాయి నుండి పై స్థాయి వరకు నిజాయితీగా, నిబద్ధతతో పనిచేయడం వల్లే అవార్డు లభించింది. నీతి, నిజాయితీగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్న మార్పు మీ అందరిలో రావడం వల్లే శాఖకు మంచి గుర్తింపు లభిస్తోంది. పారదర్శకత, జవాబుదారీతనం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సత్వర ఫలితాలే లక్ష్యంగా చేపట్టిన సంస్కరణలకు, విధాన నిర్ణయాల అమలులో ఉద్యోగుల కృషి వల్ల పౌరసరఫరాల శాఖకు ప్రశంసలు లభిస్తున్నాయని కమిషనర్ అన్నారు.

అగ్రకుల ఉపసర్పంచ్‌పై
అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

టీ మాస్ ఫోరం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంద్రాగస్టునాడు ఖమ్మం జిల్లా దమ్మాయిగూడెం గ్రామంలో గిరిజన మహిళా సర్పంచ్‌ను అవమానించిన అగ్రకుల ఉప సర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని టీ మాస్ ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు గద్దర్, తమ్మినేని వీరభద్రం, విమలక్క, జాన్‌వెస్లీ, దాస్‌రాం నాయక్, కోలా జనార్థన్ ఒక ప్రకటన విడుదల చేశారు. దమ్మాయిగూడెంలో జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా గ్రామ ప్రథమ మహిళ అయిన మాళోతు జ్యోతిని జెండా ఎగరవేయకుండా ఉప సర్పంచ్ ఎ.నాగేశ్వరరావు అడ్డుకున్నారని వారు తెలిపారు. వీఆర్వో సత్యనారాయణతో జెండాను ఎగురవేయించి సర్పంచ్‌ను అవమానపరిచారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావుతోపాటు వీఆర్వో సత్యనారాయణలపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇది వారి నిర్లక్ష్యానికి నిదర్శమని పేర్కొన్నారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనులు, మహిళలపై రోజురోజుకు దాడులు, కుల దురహంకార హత్యలు, బహిష్కరణలు, అవమానాలు పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. దళితులనుద్దేశించి ముఖ్యమంత్రి అవహేళనగా మాట్లాడటం వల్లే అగ్రకులాల వారు మరింతగా రెచ్చిపోతున్నారని పేర్కొన్నారు. పోలీసులు కూడా అగ్రకులాల వారికే వంతపాడుతున్నారని తెలిపారు.

ఈ నేపథ్యంలో దోషి అయిన నాగేశ్వరరావుపై తక్షణమే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఆర్వో సత్యనారాయణపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే టీ మాస్ ఫోరం తరపున ఉద్యమానికి సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.

రోహిత్ ఆత్మహత్య వెనుక..

(మొదటిపేజీ తరువాయి)

మంది విద్యార్థులపై వర్సిటీ అధికారులు చర్యలు తీసుకున్నారని రూపన్‌వాలా పేర్కొన్నారు. గతేడాది జనవరి 17న రోహిత్‌వేముల యూనివర్సిటీలోని హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యగల కారణాలపై దర్యాప్తు నిర్వహిం చేందుకు అప్పటి మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి స్మృతిఇరానీ రిటైర్డ్ న్యాయమూర్తి రూపన్‌వాలా నేతృత్వంలోని ఏకసభ్య కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక అక్టోబర్ 2016లో లీక్ అయినప్పటికీ.. తాజాగా యూజీసీ బహిర్గతం చేసింది. రోహిత్‌వేములతో పాటు మరికొంత మంది విద్యార్థులపై వర్సిటీ యంత్రాంగం చేపట్టిన చర్యలను సవాల్ చేస్తూ విద్యార్థులు హైకో ర్టులో పిటిషన్ వేశారని నివేదికలో పేర్కొన్నారు. కాబట్టి యూనివర్సిటీ చర్యల వల్ల రోహిత్‌వేముల ఆత్మహత్య చేసుకోలేదని తెలిపారు. ఒకవేళ వర్సిటీ అధికారుల చర్యల వల్ల ఆత్మహత్య చేసుకుని ఉంటే ఆ విషయాలను ఆత్మహత్య లేఖలో పొందుపరిచే వాడని పేర్కొన్నారు. పైగా ఆయన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని లేఖలో పేర్కొన్న విషయాన్ని ఉటంకించారు. ప్రపంచంలో జరుగుతున్న వ్యవహారాల పట్ల రోహిత్ సంతోషంగా లేరని, తీవ్ర నిరాశలో ఉన్నారని రూపన్‌వాలా తన నివేదికలో పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచీ రోహిత్ ఒంటరిగా ఉన్నాడని తెలిపారు. 'రోహిత్‌వేముల ఆత్మహత్యకు గల కారణాలు ఆయనకే బాగా తెలుసు' అని పేర్కొన్నారు. విద్యార్థులు తమ అకాడమిక్ కెరీర్‌పై దృష్టి పెట్టాలని, ఇతర అంశాలు జోలికి వెళ్లొద్దనే యూనివర్సిటీ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ రోహిత్ వేములపై చర్యలు తీసుకుందని సమర్థించారు. పైగా రోహిత్‌వేముల దళితుడు కాదని ఓబీసీ అని నివేదికలో పేర్కొన్నారు. అయితే యూనివర్సిటీలో వెనుకబడిన వర్గాల, సాధారణ విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకమైన యంత్రాంగం అంటూ లేదని కమిటీ పేర్కొంది.

కేంద్రమంత్రులకు క్లీన్‌చీట్..

కేంద్రమంత్రులు స్మృతిఇరానీ, బండారు దత్తాత్రేయ లేఖల వల్లే రోహిత్‌పై యూనివర్సిటీ అధికారులు చర్యలు చేపట్టారని, ఫలితంగా ఆత్మహత్య చేసుకున్నాడన్న ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే రోహిత్ వేముల ఆత్మహత్యతో కేంద్రమంత్రులకు ఎలాంటి సంబంధం లేదని నివేదికలో క్లీన్‌చిట్ ఇచ్చారు.

సిరిపురం నిర్వాసితులకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-మంథని



విలువైన పంట భూములను ప్రాజెక్టులకిస్తే వారిపై కనికరం లేకుండా పోలీసులు చితకబాదటం అన్యాయమని, నిర్వాసితులకు అండగా ఉంటామని మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భరోసానిచ్చారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని సిరిపురంలో సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులను బుధవారం ఆయన పరామర్శించారు. బాధితులకు న్యాయపరమైన పరిహారం అందించేవరకు వారికి మద్దతు పలుకుతామన్నారు. అదనపు పరిహారం కోసం అడిగితే కేసులు పెట్టి పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని బాధితుడు చంద్రమోహన్ వాపోయాడు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... భూములు కోల్పోయిన వారిని అధికారులు, కాంట్రాక్టర్లు, పోలీసులు ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ప్రాజెక్టులకు తాము అడ్డుపడుతున్నామని అంటున్న ప్రభుత్వం... భూనిర్వాసితుల సమస్యలను తీర్చడంలో ఎందుకు విఫలమవుతుందో సమాధానం చెప్పాలన్నారు. స్థానిక సమస్యలను వదిలేసి కాంగ్రెస్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. గోలివాడలో ఇచ్చినట్టుగా ఎకరాకు రూ.13 లక్షల పరిహారం అందించాలని నిర్వాసితులు కోరారు. నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను తీర్చాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల స్థానికంగా సాగునీరు ఎంత ఇస్తారో తెలియజేయలేదన్నారు. సుమారు రెండు గంటల పాటు నిర్వాసితులతో జరిగిన ఈ సమావేశంలో నాయకులు గోమాస శ్రీనివాస్, మహంకాళి స్వామి, కొత్త శ్రీనివాస్, శశిభూషన్, ఉప్పట్ల శ్రీనివాస్, ఎడ్ల సత్యనారాయణ, అజింఖాన్, ఊదరి శంకర్, పుప్పాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సర్కారును ప్రశ్నిస్తే అరెస్టులు



ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్ విడుదల చేయాలి

- దసరా తర్వాత హైదరాబాద్‌లో బహిరంగసభ: నిరుద్యోగ సదస్సులో ప్రొఫెసర్ కోదండరామ్

నవతెలంగాణ-రఘునాథపాలెం

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే అరెస్టులు చేయిస్తోందని టీజేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో "ఉపాధి కల్పన - ఉద్యోగాల సాధన" డిమాండ్‌తో బుధవారం నిరుద్యోగ సదస్సును ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్బూరి మహేష్, సిద్దినేని కర్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో కోదండరామ్ మాట్లాడుతూ..అత్యధిక శాతం ప్రజలు ఆధార పడిన వ్యవసాయరంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని, వ్యవసాయం అంటే భయపడే స్థితి దేశంలో నెలకొందని వాపోయారు. ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి డీఎస్సీ ప్రకటన లేకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి క్యాలెండర్‌ను విడుదల చేస్తే తదనుగుణంగా విద్యార్థులు అధ్యయనం చేస్తారని తెలిపారు. స్థూల ఆర్థిక రేటు పెరగడమే ఒక్కటే ఆర్థికాభివృద్ధికి ప్రాతిపదిక కాదన్నారు. తెలంగాణ రాష్ట్రసాధన కోసం పోరాడమనే హక్కుతోనే గాడి తప్పిన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని కొట్లాడి తెచ్చుకున్నది ఇసుక కాంట్రాక్ట్ ఇతర వ్యవహారాల కోసం కాదని, నిధులు, నీళ్ళు, నియామకాలు కోసమన్నారు. దసరా తర్వాత హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ పెట్టనున్నట్టు తెలిపారు. కేసీఆర్ మాటలు కోటలు దాటుతున్నాయని సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో యువత ఏకమై కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోటు కళావతి, సీపీఐ జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు, టీజేఏసీ జిల్లా చైర్మెన్ డాక్టర్ శీలం పాపారావు, పాల్గొన్నారు.

'మేడిగడ్డ'లో స్మితా సబర్వాల్

- బ్యారేజీ పనుల పరిశీలన
- అత్యంత గోప్యంగా సీఎం పర్సనల్ సెక్రటరీ పర్యటన

నవతెలంగాణ-మహాదేవపూర్

ప్రొఫెసర్ జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ పనులను సీఎం పర్సనల్ సెక్రటరీ స్మితా సబర్వాల్(ఐఏఎస్) బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిపై చీఫ్ ఇంజినీర్ నల్లా వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు మేనేజర్ రాజును అడిగి తెలుసుకున్నారు. గతేడాది మే-2వ తేదీన సీఎం కేసీఆర్ మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి భూమిపూజ చేసిన స్థలాన్ని, గోదావరి ఒడ్డును ఆమె పరిశీలించారు. అనంతరం మేడిగడ్డ క్యాంపు కార్యాలయంలో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంపై అధికారులు, ఇంజినీర్లు, పోలీసులతో సమీక్షించారు. ఆమె వెంట జిల్లా ఎస్పీ భాస్కరన్, జేసీ అమయ్‌కుమార్, ఆర్డీవో వీరబ్రహ్మాచారి, తహసీల్దార్ సాంబ మూర్తి, ఈఈ ఓంకార్‌సింగ్, కాటారం డీఎస్పీ కేఆర్‌కే.ప్రసాదరావు ఉన్నారు.

అత్యంత గోప్యంగా...

స్మితా సబర్వాల్ వర్షంలోనే మేడిగడ్డ బ్యారేజీ పనులను పరిశీలించారు. సీఎం ఆదేశాల మేరకు మేడిగడ్డ పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆమె పర్యటనను పోలీసు అధికారులు అత్యంత గోప్యంగా ఉంచడం విశేషం. ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీ వద్ద సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఉండడం.. ఏ అధికారికి, మీడియాకు తెలియకపోవడం గమనార్హం.

ఇంటికో ఉద్యోగం.. రూ.20లక్షలు ఇవ్వాలి : రైతుల వినతి

మేడిగడ్డ క్యాంపు కార్యాలయంలో స్మితా సబర్వాల్‌ను సూరారం రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. తమ భూములకు రూ.20లక్షలతోపాటు ఇంటికో ఉద్యోగమివ్వాలని కోరారు. గ్రామసభ నిర్వహించకుండానే నోటిఫికేషన్ విడుదల చేశారని, భూములకు రకరకాల పరిహారం ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం నాయకులు నాగుల అశోక్‌రెడ్డి, సూరం మహేష్‌రెడ్డి, ముల్కల శ్రీనివాస్‌రెడ్డి, చల్లా మహేష్‌రెడ్డి ఉన్నారు.

గులాబీకి 'సినీ' గ్లామర్

(మొదటిపేజీ తరువాయి)

సహకారం అందిస్తానని కూడా చెప్పినట్టు సమాచారం. తెలంగాణ సెంటిమెంట్ నినాదంతో పద్నాలుగేండ్లుగా టీఆర్ఎస్‌పార్టీని కేసీఆర్ నడిపించారు. ఆ నినాదంతోనే 2014 ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడిచినా తెలంగాణ సెంటిమెంట్‌తోనే కాలం వెళ్లబుచ్చుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని చెప్పుకున్నా ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. లక్షలాది మందితో మెంబర్‌షిప్ చేయించినా చాలాచోట్ల పార్టీ నిర్మాణం ఆశించిన స్థాయిలో లేదని టీఆర్ఎస్ పెద్దలు గుర్తించారు. ఇతర రాష్ట్రాల్లో ఆయా పార్టీలకు సినిమా గ్లామర్ తోడుగా ఉన్నది. రాష్ట్రం లోనూ టీఆర్ఎస్‌పార్టీలోని సినిమా పెద్దలను ఆహ్వానించి, వారి ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నది ముఖ్యమంత్రి ఆలోచనగా ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో శంకర్‌లాంటివారు టీఆర్ఎస పార్టీకి పనిచేస్తూ వచ్చారు. ఇంకా కొంతమంది ఉన్నా పార్టీకి, ప్రభుత్వానికి అనుకూలంగా వారి మద్దతు నామమాత్రమేనని టీఆర్ఎస్‌నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భాగంగా నిజామాబాద్‌కు చెందిన దిల్‌రాజును పార్టీలోకి తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు విశ్వస నీయ సమాచారం. తెలంగాణలో సినీపరిశ్రమను అభివృద్ధి చేయాలంటే దిల్‌రాజు లాంటివారిని ప్రోత్సహిస్తే బాగుం టుందన్న భావనలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నారని తెలిసింది. డ్రగ్స్ కేసు విచారణ సమయంలో సినిమా పెద్దలు ప్రభుత్వాన్ని ఆశ్రయించినప్పుడు, వారికి అండగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్న విషయాన్ని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. దిల్‌రాజు కూడా రాజకీయాలపై సుముఖంగానే ఉన్నారని సినీ సర్కిళ్లలో చర్చ జరుగుతున్నది. ఆయనకు పవన్‌కల్యాణ్‌తో సంబంధాలు బాగున్నా, ఆయన టీఆర్ఎస్‌పార్టీపైనే మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఎంపీ కవిత జగిత్యాల నుండి పోటీ చేస్తే, నిజామాబాద్ లోక్‌సభ నుంచి పోటీ చేయాలన్న ఆలోచనలో దిల్‌రాజు ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. ఇటీవల విడుదలైన ఫిదా సినిమాను ముఖ్యమంత్రి కేసీఆర్ బాగుందని చెప్పడం, దిల్‌రాజును ఆకాశానికెత్తడం జరిగింది. దీంతో ఆ సినిమా విజయవంతంలో టీఆర్ఎస్‌పార్టీ నేతలు బాగా పనిచేశారని ప్రచారం జరుగుతున్నది. టీఆర్ఎస్‌పార్టీలో చేరేందుకు దిల్‌రాజు రూట్ క్లియర్ అయినట్టేనని ఆ పార్టీ నేతలు కొందరు చెబుతున్నారు. అయితే ఈ విషయంలో దిల్‌రాజు మాత్రం స్పందించడానికి నిరాకరిస్తున్నారని తెలిసింది.

కాంగ్రెస్‌కు పెరిగిన సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులు గెలిచారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని సర్కారుకు వ్యతిరేకంగా మందసోర్ రైతులు ఉద్యమించిన విషయం విదితమే. ఆ రైతులపై పోలీసులు కాల్పులకు తెగబడిన సంగతి కూడా తెలిసిందే. ఇప్పుడు మందసోర్ ప్రాంత ఓటర్లు బీజేపీకి షాక్ తగిలేలా తీర్పు ఇచ్చారు.. ఇక్కడి మూడు స్థానాల్లో నిలబడ్డ బీజేపీ అభ్యర్థులు ఓడిపోగా.. కాంగ్రెస్ విజయం సాధించింది. 2013లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేవలం తొమ్మిది సీట్లే వచ్చాయి. ఈసారి 14 చోట్ల కాంగ్రెస్ పార్టీ విజయాన్ని నమోదు చేసుకోగా, బీజేపీ ఐదు సీట్లను కోల్పోయింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి 27 చోట్ల ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రసంగాలు చేశారు. వాటిలో 13 చోట్ల బీజేపీ పరాజయం పాలైంది. దీంతో బీజేపీ వర్గాల్లో అంతర్మథనం మొదలైంది. ఇప్పుడే ఈ విధంగా ఉంటే.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లు ఏ విధంగా దెబ్బతీస్తారోనన్న భయం బీజేపీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నది. ఈనెల 11న జరిగిన 43 నగరపాలిక ఎన్నికల్లో సుమారు ఎనిమిది లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవుల కోసం 161 మంది, పరిషత్ కోసం 2,133 మంది బరిలో దిగారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న జీఎస్టీ

- కొందరి ప్రయోజనాల కోసం ఒకేపన్ను
- కేంద్రాన్ని ప్రతిపైసా అడుక్కోవాల్సిందే: నవతెలంగాణ ఎడిటర్ ఎస్.వీరయ్య


సెమినార్‌లో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

నవతెలంగాణ - నిజామాబాద్

సామాన్యుల నడ్డి విరిచేందుకే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం పేరుతో గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ (జీఎస్‌టీ) చట్టం చేసిందని నవతెలంగాణ పత్రిక ఎడిటర్ ఎస్.వీరయ్య అన్నారు. నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐ(బాలికల) కళాశాలలో ఎంప్లాయిస్ స్టడీ సర్కిల్ నిజామాబాద్ కన్వీనర్ రామ్మోహన్‌రావు అధ్యక్షతన 'జీఎస్టీ ఎవరి కోసం' అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఎస్ వీరయ్య మాట్లాడుతూ...జీఎస్టీని స్వాతంత్ర్యోద్యమంతో పోల్చడంపై విస్మయం వ్యక్తం చేశారు. 2010లో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ ఇదే జీఎస్టీపై చర్చపెడితే బీజేపీ వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. జీఎస్టీని వ్యతిరేకిస్తూ గుజరాత్‌లో పక్షం పాటు వ్యాపారుల నిరసనలు మిన్నంటాయన్నారు. దేశవ్యాప్తంగా ఒకే పన్ను తెస్తే ధరలూ తగ్గుతాయని నమ్మించి జీఎస్టీ అమల్లోకి తెచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఎలాంటి చర్చ, అవగాహన లేకుండా మద్దతు తెలపడంతో నేడు ప్రజలపై విపరీతమైన భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సినిమాకు వెళ్తే గతంలో రూ.100గా ఉన్న ధర నేడు రూ.118 చెల్లించాల్సి వస్తోందని వివరించారు. ధరలు పెరిగినా కొద్ది పన్నూ పెరుగుతూ పోతోందన్నారు. 141 దేశాల్లో జీఎస్టీ అమలవుతుండగా అందులో కేవలం మూడు దేశాల్లో తప్ప ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఉదహరించారు. రాజకీయ లబ్ది కోసం జీఎస్టీకి మద్దతు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు తలబాదుకోవడం విడ్డూరమన్నారు. బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బోసుబాబు మాట్లాడుతూ... పెద్ద, చిన్న పరిశ్రమలకు ఒకే విధమైన పన్ను విధిస్తే చిన్న పరిశ్రమలు కోలుకోలేని స్థితి చేరుతాయని, ఉపాధి కోల్పోయి నిరుద్యోగ సమస్య మరింత పెరుగుతుం దని ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సాయిలు మాట్లాడు తూ...పెట్టుబడిదారుల కోసమే జీఎస్టీ చట్టం వచ్చిందన్నారు. సామాజిక ఉద్యమకారులు, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కేశవులు మాట్లాడుతూ.. రైతులు, చేనేత కార్మికులు ఒకవైపు ఆకలి చావులకు గురవు తుంటే కేంద్రం అమలు చేస్తున్న జీఎస్టీతో సామా న్యుడిపై మరింత భారం పడు తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎస్ రమ,టీఎన్జీవోస్ సంఘం జిల్లా అధ్యక్షులు అలుక కిషన్, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పోతన్‌కర్ లక్ష్మినారాయణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సత్యా నందం, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు శంతన్, సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గంగాధరప్ప, పాల్గొన్నారు.

మేడిగడ్డలో మాఫియా

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ఏ లారీ వచ్చి ప్రాణాలు కబళిస్తుందో అనే భయం వెన్నాడుతున్నది. ఈ మూడు నెలల వ్యవధిలోనే ఇసుక లారీలు ఢీ కొని ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. నెల వ్యవధిలో 15 మంది వరకు క్షతగాత్రులయ్యారు. ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. దాదాపు 60కి పైగా ఆవులు, గేదెలు లారీలు ఢీకొని అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మంజీరా నదిలో ఇసుక తవ్వకాల వల్ల జరిగిన విధ్వంసమే గోదావరిలో జరుగుతోందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మిత ప్రతిపాదిత స్థలంలో ఇసుక తొలగింపు వల్ల ఇప్పటికిప్పుడు ఇబ్బంది ఉండదుగానీ మనుముందు నదిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉంది. భవిష్యత్‌లో గోదావరి ఎడారిని తలపించే ప్రమాదముందని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ భూగర్భ శాస్త్రవేత్త పేర్కొన్నారు.

సర్కారు ఖజానాకు చిల్లు

మేడిగడ్డ, కాళేశ్వరం, అన్నారం బ్యారేజీల పరిధిలో ఇసుక తవ్వకాల కోసం 21 క్వారీలకు టీఎస్ఎండీసీ అనుమతులిచ్చింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు దశలవారీగా 15 ఇసుక క్వారీలు ప్రారంభించారు. వర్షాలు పడుతుండటంతో మహదేవపూర్ మండలం పరిధిలోని కుంట్లం, పుసుక్కుపల్లి, పల్గులకు చెందిన ఆరు క్వారీల నుంచి ఇసుకు తరలింపు జరుగుతున్నది. ప్రభుత్వం క్యూబిక్ మీటరు ఇసుకకు 600 రూపాయలు నిర్ణయించింది. ఒక లారీ ద్వారా 13.5 క్యూబిక్ మీటర్ల ఇసుక రవాణా కోసం రూ.8, 800 ఆన్‌లైన్ ద్వారా చెల్లించే బిల్లులు పొందుతున్నారు. క్వారీలకు వచ్చే లారీల్లో వే బిల్లు ప్రకారం కాంట్రాక్టర్లు ఇసుక లోడు చేయాలి. ఇక్కడ నుంచి ప్రధానంగా హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నారు. ఎండా కాలంలోనే నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో తవ్వకాలు చేపట్టి గుట్టల మాదిరిగా వ్యవసాయ భూముల్లో ఇసుక డంపింగ్ చేశారు. వర్షాలు పడుతుండటంతో దానిని ప్రస్తుతం తరలిస్తున్నారు. రోజకు ఐదు వేల క్యూబిక్ మీటర్ల ఇసుక ప్రస్తుతం డంప్‌ల నుంచి తరలుతుందంటేనే ఏ స్థాయిలో ఇసుక రవాణా జరుగుతుందో అర్థమవుతున్నది. వర్షాల నేపథ్యంలో డిమాండ్ పెరిగి అక్కడ ఇసుక ధర టన్నుకు రూ.1200 నుంచి రూ.1500, రూ.1800కు పెరిగింది. ఇదే అదనుగా ఇసుక మాఫియా అక్రమాలకు తెరలేపుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా సాయంత్రం ఆరు గంటల తర్వాత క్వారీల్లో లారీల్లో ఇసుక లోడ్ చేయొద్దు. కానీ, నిబంధనలకు తూట్లు పొడిచి లారీల్లో లోడ్ చేసి రక్షణ మధ్య రాత్రి పూట తరలిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న లారీల్లో 27 క్యూబిక్ మీటర్లుకు పైగా ఇసుక నింపి ఓవర్‌లోడ్‌తో తరలిస్తున్నారు. ఇలా వెళ్లడం ప్రమాదాలకు దారితీస్తున్నాయి. దీనివల్ల టీఎస్ఎండీసీకి రోజుకు రూ.2లక్షల పైగా నష్టం వాటిల్లుతున్నది. ఇది బయటకు పొక్కకుండా ఉండేందుకు కాంట్రాక్టర్లు, టీఎస్ఎండీ అధికారులు మిలాఖత్ అయ్యారనే విమర్శలొస్తున్నాయి.

లెక్కలేనన్ని మూగజీవులు బలయ్యాయి : ఆశోక్‌రెడ్డి, సూరారం

ఇసుక లారీలు అతివేగంతో పోతున్నయి. రోడ్డు ఎక్కితే ఎటువైపు నుంచి ఏ ఇసుక లారీ వచ్చి ఢీకొంటదోనన్న భయంగా ఉంది. లారీల వేగానికి లెక్కలేనని మూగజీవులు బలైపోయాయి.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బైక్ నడపాల్సి వస్తోంది : దేవేందర్, మహాదేవపూర్

ఇసుక లారీలతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటున్నది. బైక్‌పై ప్రయాణించాలంటే..ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తున్నది. ఇసుక తరలింపు కోసం లారీలు వెళ్లేందుకు ప్రత్యేక రోడ్డు ఏర్పాటు చేసుకుంటే సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది ఉండదు.

విజయ కుమార్‌కు కన్నీటి వీడ్కోలు

- అంతిమ యాత్రలో పాల్గొన్న పలు పార్టీల నాయకులు

నవతెలంగాణ - కొత్తగూడెం

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన డాక్టర్ విజయకుమార్, ఆయన అత్త దాసరాజు సావిత్రిబాయిలకు భద్రాది కొత్తగూడెంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు బుధవారం కన్నీటి వీడ్కోలు పలికారు. వారి అంత్యక్రియలు కొత్తగూడెంలోని రామవరం గోధుమ వాగు వద్ద గల హిందూ శ్మశాన వాటికలో జరిగాయి. పీఎన్ఎంయు కళాకారులు డప్పు వాయిద్యాలు, నృత్యాలతో పాటలు పాడుతూ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. విజయ్ కుమార్ భౌతిక కాయానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కాసాని ఐలయ్య, నాయకులు అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రమేష్, ఐద్వా జిల్లా నాయకులు ఎం.జ్యోతి, లక్ష్మీ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, ఎంసీపీఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిరవెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా నాయకులు గొల్లపూడి ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తొండ్ర కుమార్, గౌరి కుమార్, వరంగల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగెళ్ల కొమరయ్య, సీపీఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యులు బుర్రా విజయ్‌కుమార్ తదితరులు నివాళ్లర్పించారు.

హాజరైన భూపాలపల్లి కలెక్టర్ మురళి

విజయ్‌కుమార్ అంతిమ యాత్రలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఆకునూరి మురళి పాల్గొన్నారు. విజయ్ కుమార్ కుటుంబానికి కలెక్టర్ మురళి కుటుంబానికి బంధుత్వం ఉండటంతో ఆయన హాజరై విజయ్‌కుమార్ కుమారుడు హర్ష, సావిత్రిబాయి కుమారుడు వెంకటేశ్వర్లును పరామర్శించి ఓదార్చారు.

వాటర్‌షెడ్‌పై కర్నాటకలో అధ్యయనం

- బయలుదేరి వెళ్లిన రాష్ట్ర అధికారులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కర్నాటక రాష్ట్రంలో అమలవుతున్న వాటర్‌షెడ్ కార్యక్రమం, దాని ఫలితాలపై అధ్యయనం చేసేందుకోసం రాష్ట్రం నుంచి తొలి విడతగా 35 మంది అధికారుల బృందం బుధవారం బయలుదేరి వెళ్లింది. ఈ యాత్రను గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నీతూ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. నాలుగు రోజులపాటు ఈ బృందం కర్నాటకలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి అధ్యయనం చేస్తుందని ఆమె తెలిపారు. బృందంలోని అధికారులకు ఆమె ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. మొదటి విడతగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులను కర్నాటకకు పంపిస్తున్నామని తెలిపారు.

వీరు తిరిగొచ్చాక మరికొన్ని జిల్లాల అధికారులను ఆ రాష్ట్రానికి పంపిస్తామని చెప్పారు.

చంద్రన్న వర్గం చేతిలో టీడీపీ కార్యకర్త హత్య

- భూ తగాదాలే కారణమంటున్న గ్రామస్తులు

నవతెలంగాణ - పాల్వంచ రూరల్

భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం నర్సంపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రాయల భాస్కర్‌ను చంద్రన్న వర్గం బుధవారం కర్రలతో కొట్టి చంపింది. దీనికి సంబంధించిన గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేట గ్రామానికి చెందిన రాయల భాస్కర్ టీడీపీ కార్యకర్త. నర్సంపేట, రాజీవ్‌నగర్ గ్రామాల మధ్య భూమి విషయంలో కొన్ని రోజులుగా తగాదా నడుస్తున్నట్టు తెలిసింది. ఈ తగాదాలో కొంతమంది చంద్రన్న వర్గం వైపు, మరికొంత మంది రాయల వర్గం వైపు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మూడు, నాలుగు రోజుల కిందట చంద్రన్న వర్గానికి సంబంధించిన వారిని రాయల వర్గం వారు కొట్టారని వినికిడి. అందుకు రాయల భాస్కర్ కారణమని భావించిన చంద్రన్న వర్గానికి చెందిన మోరే రవి అలియాస్ రామన్న దళం బుధవారం ఉదయం సుమారు 17 మంది గ్రామానికి వచ్చారు. రాయల భాస్కర్‌ను విచక్షణా రహితంగా కర్రలతో కొట్టారు. గ్రామంలో ఎవరైనా అడ్డుకునేందుకు ముందుకొస్తే కాల్చి చంపుతామని దళ సభ్యులు బెదిరించినట్టు గ్రామస్తులు తెలిపారు. చంద్రన్న వర్గం వెళ్లిపోయిన తరువాత అచేతన స్థితిలో ఉన్న భాస్కర్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా, అప్పటికే మృతిచెందినట్టు గ్రామస్తులు తెలిపారు. రెండు వర్గాల మధ్య ఉన్న విభేదాల కారణంగానే భాస్కర్ హత్యకు గురయ్యాడని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఢిల్లీని తాకిన గోరఖ్‌పూర్ సెగ

(మొదటిపేజీ తరువాయి)

ఆదిత్యనాథ్ రాజీనామా చేయాలని, గోరఖ్‌పూర్ విషాదానికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అంటూ పెద్దఎత్తున నినదించారు. నరమేథానికి యూపీ ప్రభుత్వానిదే బాధ్యత, సీఎం రాజీనామా చేయాలంటూ బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యార్థుల నిరసన నేపథ్యంలో యూపీ భవన్ వద్ద ఢిల్లీ పోలీసులను, సెంట్రల్ రిజర్వు పోలీసు బలగాలు (సీఆర్‌పీఎఫ్) పెద్దఎత్తున నియమించారు. యూపీ భవన్ వద్ద బారికేడ్లను, వాటర్ కానన్లను సిద్ధం చేసి ఉంచారు. 'పాలనా యంత్రాంగం బాధ్యత తీసుకొని ఉంటే, ఈ విషాద ఘటన జరిగి ఉండేది కాదు' అని సుగంధ అనే విద్యార్థి అన్నారు.

ఆ అధికారమెక్కడిది?

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగాలు భర్తీ చేస్తానని ప్రకటించడం నిరుద్యోగులను మరో సారి మోసం చేశారన్నారు. రెండునెలల్లో ప్రకటించిన లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. దళితులకు మూడెకరాల భూమి, తెలంగాణ వస్తే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానన్న హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కేసీఆర్‌ను నిలదీయాలని పిలుపునిచ్చారు.

నయీమ్ ఆస్తులన్నీ సీఎం కేసీఆర్ పరం: రాజగోపాల్‌రెడ్డి

యాదాద్రి భువనగిరిలోని రహదారి బంగ్లాలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ...నయీమ్ డెన్‌లో దొరికిన రూ.వెయ్యి కోట్ల డంప్, రూ.20 వేల కోట్ల బినామీ ఆస్తులు, డైరీ ఏమయ్యాయని ప్రశ్నించారు. సిట్‌ను కంట్రోల్‌లో పెట్టుకొని నయీం సొమ్మును కేసీఆర్ దోచుకొంటున్నాడని ఆరోపించారు. రాజధానిలోని బంధువుల కార్పొరేట్ ఆస్పత్రులకు మేలుచేసేందుకే బీబీనగర్‌లోని నిమ్స్‌ను సీఎం నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. యాదాద్రి, వేములవాడ దేవాలయాలకు వందల కోట్లు నిధులు ఇస్తున్న కేసీఆర్ నిమ్స్‌కు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. వెయ్యి పడకల ఆస్పత్రిగా నిమ్స్‌లో ఇన్‌పేషెంట్ సేవలు ప్రారంభించేందుకు వెంటనే రూ.300 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కోదండరామ్ అరెస్ట్ తెలంగాణ ఉద్యమకారులకు అవమానకరమన్నారు. సీమాంధ్ర కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రాజెక్టుల రీడిజైన్ పేరిట కేసీఆర్ రూ. వేల కోట్లు దండుకుంటున్నాడని ఆరోపించారు. నియంతపాలన సాగిస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాడే శక్తి రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలు పట్టుకున్న నేతలకు లేదని, ఈ విషయం గత ఎన్నికల్లో బయటపడిందని చెప్పారు. సరైన సమయంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుని 2019లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేవారికే బాధ్యతలను అప్పగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ సంస్థాగత ఎన్నికల వరకు మాత్రమే కుంతియా ఇన్‌చార్జిగా ఉంటారన్నారు. పీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర ఇన్‌చార్జిల మార్పులపై అధిష్టానానికే అధికారం ఉందని, ఇది మర్చిపోయి కుంతియా మాట్లాడడం పార్టీ క్రమశిక్షణా చర్యల కిందకు వస్తుందని చెప్పారు. సమావేశంలో పీసీసీ మాజీ కార్యదర్శి తంగెళ్లపల్లి రవికుమార్, నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్, నజీర్ పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▲321	నిఫ్టీ ▲103	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
31,770	9,897	64.14	రూ. 29,508	రూ. 42,200





కోడిగుడ్లు

హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365



వరంగల్ పార్క్‌లో పెట్టుబడులు పెట్టండి..


దక్షిణ కొరియా టెక్స్‌టైల్ బృందానికి కేటీఆర్ పిలుపు



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె. తారకరామారావు దక్షిణ కొరియాకు చెందిన టెక్స్‌టైల్ రంగ దిగ్గజ సంస్థల ప్రతినిధులను కోరారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి దక్షిణ కొరియా బృందంతో సమావేశమయ్యారు. కొపోత్ చైర్మెన్, యంగ్‌గోన్ కార్పొరేషన్ అధినేత కిహాక్ సుంగ్, ఆయన ప్రతినిధి బృందం మంత్రితో సమావేశమయ్యారు. వరంగల్‌లో 2000 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయనున్న ఈ పార్క్‌లో పెట్టుబడి పెట్టేవారికి దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనన్ని ప్రోత్సాహకాలను అందించనున్నట్టుగా మంత్రి వారికి వివరించారు. పార్క్‌లో పరిశ్రమల అవసరాల కోసం ఇక్కడి కార్మికుల్లో నైపుణ్యాభివృద్ధి నిమిత్తం ప్రత్యేకంగా శిక్షణ సంస్థను ఏర్పాటు చేయనున్నట్టుగా తెలిపారు. పార్క్‌లో అవసరమైతే దక్షిణ కొరియా సంస్థలకు ప్రత్యేకంగా కొంత స్థలం కేటాయించేందుకు కూడా తాము సిద్ధమని మంత్రి వారికి తెలిపారు. పార్క్‌లో పెట్టుబడులకు గల అవకాశాలు.. మార్కెటింగ్, రవాణా సౌకర్యాలను గురించి కొరియా బృందం అరా తీసినట్టుగా సమాచారం. ఈసమావేశంలో ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, టెక్స్‌టైల్స్ కార్యదర్శి శైలజా రామయ్యర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వాటా విక్రయానికి అత్యున్నత కమిటీ

- ముగ్గురు కేంద్ర మంత్రులతో ఏర్పాటు
- క్యాబినెట్‌లో నిర్ణయించిన మోడీ సర్కారు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల్లో వ్యూహాత్మకంగా పెట్టుబడుల ఉపసంహరణను వేగవంతంగా చేసేందుకు గాను సర్కారు అత్యున్నత అధికారాల కమిటీని ఏర్పాటు చేయనుంది. బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఇందుకు సంబంధించిన నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకంగా పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు గాను ఆర్థిక మంత్రి, రోడ్డు రవాణా శాఖ మంత్రి, పరిపాలన శాఖ మంత్రులతో కూడిన ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటుకు ప్రధాన మంత్రి నేతృత్వంలోని క్యాబినెట్ సమ్మతి తెలిపినట్టుగా ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా వాటా విక్రయానికి సంబంధించిన నియమ నిబంధనల ఏర్పాటు నుంచి మొదలుకొని.. ఫైనాన్షియల్ బిడ్లను ఆహ్వానించేంత వరకు అన్ని విషయాలను ఈ అత్యున్నత స్థాయి కమిటీ పర్యవేక్షించనుంది. ప్రభుత్వ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా దాదాపు రూ.72,500 కోట్ల మేర నిధులను సమీకరించాలని సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో రూ.46,500 కోట్లు మైనారిటీ స్వల్ప వాటాల విక్రయం ద్వారాను, వ్యూహాత్మక వాటా విక్రయం ద్వారా రూ.11,000 కోట్లను సమీకరించాలని ఇప్పటికే నిర్ణయించుకుంది.

రానున్న రోజుల్లో ధరలు పెరగొచ్చు..

- ఆర్‌బీఐ ఎంపీసీ సభ్యుల భవిష్యత్తు ఆందోళన



ముంబయి: దేశీయంగా రానున్న రోజుల్లో ధరలు పెరిగే అవకాశం లేకపోలేదని 'భారతీయ రిజర్వు బ్యాంకు' (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 2న సమావేశమైన ఎంపీసీ మీటింగ్ వివరాల నివేదిక (మినిట్స్) బుధవారం మీడియాకు వెల్లడయింది. ద్రవ్యోల్బణం తగ్గు ముఖం పట్టడం తమకు వడ్డీరేట్లు తగ్గించాల్సిన ఆవశ్యకతను తెలియపరిచినట్టుగా ఎంపీసీ ఇందులో పేర్కొంది. ఇదే సమయంలో రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం క్రమంగా పెరిగే అవకాశం లేకపోలేదని ఎంపీసీ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 2న సమావేశమైన ఎంపీసీ కీలక వడ్డీరేటును 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించి ఆరేండ్ల కనిష్ఠానికి 6.00 శాతంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయానికి ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్‌తో సహ కమిటీలోని నలుగురు సభ్యులు తమ సమ్మతి తెలిపారు. ఎంపీసీ సభ్యుడు రవీంద్ర హెచ్ ఢోలకియా మరోసారి కీలక వడ్డీరేటులో 50 బీపీఎస్‌ల మేర కోత పెట్టాలని అభిప్రాయపడ్డారు. ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైకేల్ పాత్రా మాత్రం వడ్డీరేట్లను యథాతథ స్థితిలోనే ఉంచాలని సమావేశంలో కోరినట్టుగా సమాచారం. ఈ ఏడాది రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం మరింతగా పెరిగే అవకాశం ఉన్నందున ఇక కొత్తగా వడ్డీరేట్లలో కోత విషయం అటుంచి.. ఇప్పటికే తగ్గించిన వడ్డీ రేట్ల ప్రజలకు చేరేలా వాణిజ్య బ్యాంకులు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీసీ సభ్యులు అభిప్రాయపడ్డట్టుగా మినిట్స్ ద్వారా తెలుస్తోంది.

డొల్ల కంపెనీల ఆడిటింగ్ షురూ!

- తొలత 100 కంపెనీలపై ప్రత్యేక నజర్
- ఆడిట్ ప్యానెల్స్ నియామకం దిశగా అడుగులు



న్యూఢిల్లీ: డొల్ల కంపెనీల ఆర్థిక వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు గాను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆదేశాల మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలు చర్యలు ప్రారంభించాయి. ఇటీవలే డొల్ల కంపెనీలన్న అనుమానంతో నిషేధం విధించిన 331 సంస్థల్లో తొలి విడతగా దాదాపు 100 కంపెనీల ఆర్థిక లావాదేవీలపై స్టాక్ ఎక్స్ఛేంజీలు ఆడిట్ ప్రక్రియను షురూ చేసినట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నెల 9న సెబీ ఇందుకు సంబంధించి స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఒక లేఖ రాస్తూ ఆయా సంస్థల నుంచి ఆడిటర్స్ సర్టిఫికేట్‌తో పాటు మూడేండ్లకు సంబంధించిన వార్షిక ఆదాయపు పన్ను రిటర్నులు, పన్ను చెల్లింపు వివరాలకు సంబంధించిన పత్రాలు ఇతర డాక్యుమెంట్లను సమీకరించాలని సూచించింది. ఆయా కంపెనీల వివరాలు, ట్రేడింగ్ సమాచారాన్ని పరిశీలించేందుకు స్టాక్ ఎక్స్ఛేంజీలు ఆడిట్ ప్యానెల్‌లను నియమించుకొనే ప్రక్రియలో ఉన్నట్టుగా సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. డొల్ల కంపెనీల విషయంలో వ్యవహరించాల్సిన తీరును గురించి గత వారం నిర్వహించిన సమావేశంలో సెబీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. ఆయా సంస్థలకు చెందిన ప్రమోటర్ల షేర్ల ట్రేడింగ్‌పై నిషేధం కొనసాగే అవకాశాలు ఉన్నట్టుగా సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. సెబీ నిషేధించిన 331 డొల్ల కంపెనీల్లో 162 సంస్థలు బీఎస్ఈలో నమోదై ఉన్నాయి. వీటిలో దాదాపు 50 కంపెనీలు వరుసగా గత నాలుగేండ్ల నుంచి నష్టాలను నమోదు చేస్తూ వస్తున్నాయి.

ఇండియన్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం




నవతెలంగాణ, వాణిజ్య విభాగం: ఇండియన్ బ్యాంక్ సామాజిక సేవా కార్యక్రమాల్లో తన విలక్షణతను చాటుకుంటోంది. బ్యాంకు 111వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇండియన్ బ్యాంక్ హైదరాబాద్ జోన్ వారు లయన్స్ బ్లడ్‌బ్యాంక్ వారి సౌజన్యంతో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులతో పాటు వివిధ శాఖలకు చెందిన సిబ్బంది, ఖాతాదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వడ్డీరేట్ల కోత బాటలో యెస్ బ్యాంకు

న్యూఢిల్లీ : ఇప్పటికే సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేట్లు తగ్గించని ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు బాటలో తాజాగా యెస్ బ్యాంకు చేరింది. ప్రయివేటు రంగానికి చెందిన యస్ బ్యాంకు సేవింగ్స్ అకౌంట్ మొత్తాలపై పావు శాతం వడ్డీని తగ్గించి 6.25 శాతంగా నిర్ణయించింది. కాగా లక్ష రూపాయల కన్నా తక్కువున్న సేవింగ్ ఖాతాలపై వడ్డీని ఏకంగా 100 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. దీంతో ఈ వడ్డీరేట్లు 5 శాతానికి పడిపోయింది. లక్ష రూపాయల నుంచి కోటి లోపు ఉన్న మొత్తాలకు వడ్డీరేటును 6 శాతంగా ఉంచింది. కోటి రూపాయలు పైబడిన ఖాతాలపై 6.25 శాతం వడ్డీని అందించనుంది.

అనుకూల పవనాలతో.. అనూహ్య ర్యాలీ

- సెన్సెక్స్‌లో 322 పాయింట్ల వృద్ధి
- 9900 పాయింట్లకు చేరువలో నిఫ్టీ
- దన్నుగా నిలిచిన డీఐఐలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్లోను తమ జోరును కొనసాగించాయి. అమెరికా–ఉత్తర కొరియాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని కాస్త తేలిక పరుస్తూ శాంతి ప్రక్రియ మొదలవడం.. అమెరికా ఫెడరల్ నుంచి అందిన సానుకూల పవనాలు.. తక్కువ ధరల వద్ద అధిక మొత్తంలో స్టాక్స్‌ను చేజిక్కించుకొనేందుకు దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐలు) ఉత్సుకత చూపడం.. సెబీ అనుకూల నిర్ణయాలతో పాటు దేశీయంగా పలు అనుకూల పరిణామాల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు బుధవారం పరుగులు పెట్టాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు ఆ తరువాత కొద్దిగా తడబడడం కనిపించింది. దేశీయంగా మార్కెట్ అనుకూల సంకేతాలు అందడం, ఐరోపా మార్కెట్ల దన్నుతో మధ్యాహ్నం తరువాత సూచీలు మరింత దూకుడును ప్రదర్శించాయి. చివరకు మార్కెట్లు ముగిసే సమయానికి బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 321.86 పాయింట్ల మేర పెరిగి 31,770.89 పాయింట్లకు చేరింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 103.15 పాయింట్ల మేర పెరిగి మ్యాజిక్ ఫిగర్ 9,900 పాయింట్లకు చేరవలో 9,897.30 పాయింట్ల వద్ద ముగిసింది.బీఎస్ఈలోని రంగాల వారీ సూచీల్లో ఎఫ్ఎంసీజీ సూచీ అత్యధికంగా 2.94%, లోహ సూచీ 1.72%, వాహన రంగ సూచీ 1.62%, బ్యాంకింగ్ రంగ సూచీ 1.26%, మౌలిక రంగ సూచీ 0.18%, యంత్ర పరికరాల సూచీ 0.13% మేర పెరిగాయి. సెన్సెక్స్‌లో అత్యధికంగా టాటా మోటార్స్ 3.57% మేర పెరిగి ఆరేండ్ల గరిష్టాన్ని తాకింది. దీనికి తోడు సిప్లా 3.54%, ఐటీసీ 3.01%, హెచ్‌యూఎల్ 3.033%, సన్ ఫార్మా 2.69 శాతం మేర పెరిగింది. మరోవైపు అత్యధికంగా నష్టపోయిన స్టాక్స్‌లో ఎన్‌టీపీసీ 1.05%, ఏషియన్ పెయింట్స్ 0.94%, పవర్ గ్రిడ్ 0.81%, లూపిన్ 0.56% స్టాక్స్ ఉన్నాయి. దేశీయంగా రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగినప్పటికీ దేశీయ సంస్థాగత మదుపరులు అధిక మొత్తంలో కొనుగోళ్లకు దిగుతుండడం బాగా కలిసి వస్తోందని స్టాక్ బ్రోకర్లు విశ్లేషిస్తున్నారు.

రుణదాతలే వాటా కొనుక్కోవచ్చు: సెబీ



ముంబయి: దేశీయ బ్యాంకింగ్ రంగంలో అంతకంతకు పెరిగిపోతున్న మొండి బాకీల సమస్య పరిష్కారించే దిశగా సర్కారు చర్యలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఆర్థిక పరిస్థితి బాగులేక ఇబ్బందుల్లో ఉన్న సంస్థల్లోని వాటాను ఆ సంస్థలోని రుణ దాతలే కొనుగోలు చేసుకొనేలా వెసులుబాటు కల్పిస్తూ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిబంధనలను నోటిఫై చేసింది. వాటాదారులకు ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సిన విధానం నుంచి రుణదాతలకు కొన్ని షరతులతో కూడిన మినహాయింపు ఇచ్చింది. ఇందుకు గాను ప్రత్యేక తీర్మానం ద్వారా వాటా విక్రయానికి సంబంధించి వాటాదారుల నుంచి అనుమతులు పొందడంతో పాటు పలు ఇతర షరతులను సెబీ విధించింది. బ్యాంకింగ్ రంగంలో మొండి బాకీల సమస్య అంతకంతకు పెరిగి దాదాపు రూ.8 లక్షల కోట్లకు చేరువవుతున్న నేపథ్యంలో ఆర్‌బీఐ, ప్రభుత్వం వీటిని తగ్గించే చర్యల్లో బాగంగా పలు చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. దివాళా మరియు బ్యాంక్ రప్టసీ స్మృతిలో అనుమతించిన మేరకు ఒత్తిడిలో ఉన్న లిస్టెడ్ సంస్థల పనర్‌నిర్మాణానికి గాను నిబంధనలను సెబీ నిబంధనలను కొంత మేర సరళతరం చేస్తున్నట్టు ఈ నెల 14న వెల్లడించిన ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది.

సమాచార హక్కు చట్టం అపిలేట్ అథారిటీ నియామకం

బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

బీసీ సంక్షేమ శాఖకు సంబంధించి సమాచార హక్కు చట్టం అపిలేట్ అథారిటిని నియమించింది. ఈ మేరకు బుధవారం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అపిలేట్ కమిటీలో వి సైతా అపిలేట్ అథారిటి, బీజీ సుమతి పబ్లిక్ ఇన్‌ఫర్‌మేషన్ ఆఫీసర్, సి విక్రమ్‌రావు అసిస్టెంట్ పబ్లిక్ ఇన్‌ఫర్‌మేషన్ ఆఫీసర్, జి శ్రీనివాస్‌రావు అసిస్టెంట్ పబ్లిక్ ఇన్‌ఫర్‌మేషన్ అధికారులుగా నియమించారు. వీరందరికీ సచివాలయంలోని 'డి' బ్లాక్‌లో కార్యాలయాలను ఏర్పాటు చేశారు.

నేటినుంచి ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు తుదివిడత కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2017–18 విద్యాసంవత్సరానికి బీ ఫార్మసీ, ఫార్మా–డీ, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రవేశాల కన్వీనర్ ఎ వాణీప్రసాద్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. గురు, శుక్రవారాల్లో విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాలని సూచించారు. ఈనెల 20న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

సినీ కార్మికుల గృహ నిర్మాణానికి కేంద్ర సాయం

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

సినీ కార్మికుల గృహ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ 1.5 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. సొంత స్థలం ఉన్న సినీ కార్మిక కుటుంబాలకు ఇల్లు కట్టుకోవడానికి ఈ సాయం చేస్తోందని కేంద్ర కార్మిక శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందు కోసం కనీసం ముప్పై చదరపు గజాల స్థలం లేదా అంతకంటే ఎక్కువ స్థలం లబ్దిదారుడి పేర రిజిస్ట్రేషన్ అయి ఉండాలని సూచించింది. సంవత్సర కాలపరిమితి సర్వీస్ పూర్తి చేసిన కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపింది. ప్రతి సినీ కార్మికుడు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోగలరని కోరింది. ఇతర వివరములకు మెడికల్ ఆఫీసర్, సినీ కార్మికుల ఆసుపత్రి, వెంకటగిరి, జూబ్లీ హిల్స్‌లో లేదా 9966562110 నెంబర్‌లో సంప్రదించవచ్చని మెడికల్ ఆఫీసర్ స్వరూప్ సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్యం, పరిశుభ్రతలపై కొత్త ఆలోచనలు చేయండి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పిలుపు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

స్వచ్ఛ భారత్ మిషన్ అమలులో భాగంగా పారిశుధ్యం, పరిశుభ్రతలపై కొత్త ఆలోచనలు చేయాలని సాంకేతిక కళాశాల అధ్యపకులు, విద్యార్థులు, డీఆర్‌డీఓ, సీఈవోలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆర్పీసింగ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం గత సంవత్సర కాలంగా మంచి ప్రగతి కనబర్చిందన్నారు. త్వరలో మిషన్ భగీరథ నీళ్లు అన్నీ కుటుంబాలకు అందించబోతున్నామని, దీనివల్ల మరిన్ని గ్రామాలు బహిరంగమల విసర్జన రహితంగా మారేందుకు ముందుకు వస్తాయన్నారు. బుధవారం హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని స్వచ్ హ్యాకతాన్ అనే సరికొత్త ఉద్యమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య రంగంలో దేశం ఎదుర్కొంటున్న సవాళ్ళను ప్రజల, మేధావులు, పరిశోధక విద్యార్థుల నుంచి పరిష్కారం కోరుతున్నామన్నారు. ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణకు సంబంధించి ఒక సమగ్రమైన పారిశుధ్య పరిశుభ్రత ఆలోచనలను కావాలన్నారు.

ఉద్యోగాల భర్తీకి రోడ్‌మ్యాప్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నియామకాల ప్రక్రియ వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నది. అందుకనుగుణంగా ఉద్యోగాల భర్తీకి రోడ్‌మ్యాప్ రూపొందించాలని నిర్ణయించింది. ఏ శాఖలో పోస్టులను ఏయే సమయంలో భర్తీ చేయాలన్న అంశంపై చర్చించింది. న్యాయపరమైన అడ్డంకులు లేకుండా నోటిఫికేషన్లు జారీ చేసి వెంటనే ఉద్యోగాలు భర్తీ చేయాలని కార్యాచరణ రూపొందించింది. సీఎం కేసీఆర్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో వివిధ శాఖల్లో 84,876 ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. సీఎం ఆదేశాల మేరకు ఈ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయడానికి, న్యాయపర ఇబ్బందులు లేకుండా టీఎస్‌పీఎస్సీ ద్వారా వెంటనే నోటిఫికేషన్లను ఇవ్వడానికి గల మార్గదర్శకాలను రూపొందించడంపై బుధవారం సచివాలయంలో అత్యవసర సమావేశం కడియం శ్రీహరి నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఆర్థిక ముఖ్యకార్యదర్శి కె రామకృష్ణారావు, సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు పాల్గొన్నారు. టీఎస్‌పీఎస్సీ పనితీరుపై ముఖ్యమంత్రి కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. ఉద్యోగ నియామకాల ప్రక్రియ ఆలస్యం కావడంపై టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల తీరుపట్ల అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇకనుంచి జరిగే నియామకాల్లో చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. కడియం శ్రీహరికి సీఎం ఫోన్ చేసి నియామకాల ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించినట్టు తెలిసింది. సీఎం ఆదేశాల్లో భాగంగానే ఈ సమావేశం జరిగినట్టు సమాచారం.

అనంతరం తనను కలిసిన మీడియాతో కడియం శ్రీహరి మాట్లాడుతూ నోటిఫికేషన్లు ఇచ్చినపుడు ఎదురవుతున్న న్యాయపర, ఇతర ఇబ్బందులు వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించామన్నారు. ఇప్పుడు అమలులో ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు పాత పదిజిల్లాలను ప్రాతిపదికన చేసుకుని నోటిఫికేషన్లు ఇవ్వాలా? కొత్తగా ఏర్పాటు చేసుకున్న 31 జిల్లాలను పరిగణనలోకి తీసుకుని నోటిఫికేషన్లు జారీ చేయాలా?అన్న అంశంపై సాధారణ పరిపాలన శాఖ, న్యాయశాఖ ప్రతిపాదనలు, సలహాలు వెంటనే ఇవ్వాలని ఆదేశించామన్నారు. కొత్త జిల్లాల ప్రకారమైతే రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణ చేయాల్సి వస్తుందా? లేదా?అనే అంశాన్నీ పరిశీలిస్తామని అన్నారు. అదేవిధంగా ఈ ఖాళీల భర్తీ జాప్యం కాకుండా ఉండేందుకు శాఖల వారీగా ఖాళీల సంఖ్యను గుర్తించి, క్యాడర్ వారీగా వివరాలు, వాటి భర్తీ కోసం అభ్యర్థులకు కావాల్సిన విద్యార్హతలు, రోస్టర్ పాయింట్లనూ రూపొందించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈనెల 21వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో మరోసారి ఇదే అంశంపై సమావేశం కావాలని నిర్ణయించామని అన్నారు.

టీఎస్‌పీఎస్సీపై చర్చ జరగలేదు : ఘంటా చక్రపాణి

టీఎస్‌పీఎస్సీపై చర్చ జరగలేదని టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి తనను కలిసిన విలేకరులతో చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన 84,876 ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ గురించే చర్చించామన్నారు. ఉద్యోగాల భర్తీ, నోటిఫికేషన్ల జారీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కార్యాచరణ ఎలా ఉండాన్న అంశంపై చర్చ జరిగిందని అన్నారు. ఉద్యోగాల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్లు వివాదాస్పదం అవుతున్న తీరుపైనా సమీక్ష జరిగిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఖాళీలను భర్తీ చేయడం, ఉత్తర్వులను అమలు చేయడమే టీఎస్‌పీఎస్సీ బాధ్యత అని వివరించారు. ఆ ఉత్తర్వుల్లోని అంశాలపై కొందరు కోర్టును ఆశ్రయిస్తున్నారని చెప్పారు. కోర్టుకు వెళ్లినంత మాత్రాన టీఎస్‌పీఎస్సీ తప్పు చేసినట్టు కాదన్నారు. గురుకులాల పోస్టులపై కోర్టును ఆశ్రయిస్తే ఓ న్యాయమూర్తి స్టే విధించారని, మరో న్యాయమూర్తి స్టే ఎత్తివేశారని గుర్తు చేశారు. గ్రూప్–2పై కోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానాలతో కూడిన అఫిడవిట్‌ను సమర్పించామన్నారు. కోర్టు ఏం ఆదేశాలు జారీ చేస్తుందో వేచిచూడాల్సిందేనని చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేసిన, చేయబోయే పోస్టుల వివరాలు

శాఖ	మొత్తం పోస్టులు	భర్తీ అయినవి	ఖాళీలు
పోలీసు	37,820	10,499	27,440
విద్యుత్	12,961	-	-
ఉపాధ్యాయులు	12,005	-	12,005
గురుకులాలు	8,511	-	12,436
కొత్త గురుకులాలు	3,925	-	3,925
వైద్యఆరోగ్య	8,347	-	8,347
సింగరేణి	7,485	5,515	1,970
ఆర్టీసీ	3,950	3,950	-
రెవెన్యూ	2,506	-	2,506
వ్యవసాయం, ఉద్యానవనం	2,435	1,757	1,418
అటవీ	2,033	-	2,033
పట్టణాభివృద్ధి	1,952	102	-
ఉన్నతవిద్య	1,678	-	1,678
నీటిపారుదల	1,058	-	-
ఆర్థిక	720	-	720
మహిళా, శిశుసంక్షేమం	587	-	-
ఆర్‌అండ్‌బీ	513	-	513
ఎక్సైజ్	340	340	-
రవాణా	182	182	-
పంచాయితీరాజ్	3,528	123	3,528
మొత్తం	1,12,536		

ఇప్పటివరకు భర్తీ చేసిన పోస్టులు	- 27,660
నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉన్న పోస్టులు	- 36,806
భర్తీ చేయనున్న కొత్త పోస్టులు	- 48,070

ఓర్వలేకే పాలమూరు ప్రాజెక్టులపై నిందలు

విపక్షాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలమూరు జిల్లా ప్రాజెక్టులపై విపక్షాలు అనసవర రాద్ధాంతం చేస్తున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ నిరంజన్‌రెడ్డి, ఆ జిల్లా ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్‌లతో కలిసి మాట్లాడుతూ పాలమూరు జిల్లా అభివృద్ధి చెందుతుంటే కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నదని విమర్శించారు. తమ జిల్లా ప్రాజెక్టులపై విపక్షాలు మూకమ్మడిగా జరిపిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నవారంతా తెలంగాణ వ్యతిరేకులేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి వరకు కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబుల వద్ద ఉండి తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన నాయకులు, పార్టీలు సమావేశంలో పాల్గొన్నాయని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు జిల్లా ప్రజలపై ఉసురుపోసుకున్న వారు ప్రస్తుతం అక్కడి ప్రజలపై ప్రేమ ఒలకబోస్తున్నారని ఎద్దేవ చేశారు. గడిచిన 15 ఏండ్లలో పాలించిన కాంగ్రెస్, టీడీపీలకు చెందిన నలుగురు ఎంపీలు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకున్న పాపానపోలేదని దుయ్యబట్టారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాతే ప్రాజెక్టులో కదలికి వచ్చిందని, పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసేందుకు శ్రద్ధపెట్టి 7 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చారని, నియోజకవర్గానికి లక్ష చొప్పున రాష్ట్రంలో మొత్తం కోటి ఎకరాలకు సాగునీరు ఇచ్చేలక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. ప్రాజెక్టు పూర్తయితే తమకు పుట్టగతులుండవనే అడుగడుగున అడ్డుతగులుతున్నారని విమర్శించారు.

వారానిరోసారి సమావేశమవ్వండి

- ఉద్యోగ నియామకాలపై సీఎం ఆదేశం
- త్వరలో గ్రూప్ 1,2 ఫలితాలు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్


ప్రబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ ఘంటా చక్రపాణి నేతత్వంలోని అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతత్వంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కనీసం వారానికోసారి సమావేశమయి ఉద్యోగ నియామక ప్రక్రియను సమీక్షించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఉద్యోగ నియామకాలపై ప్రకటన చేసిన నేపథ్యంలో బుధవారం డిప్యూటి సిఎం కడియం శ్రీహరి, పబ్లిక్ సర్వీసు కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ తదితరులతో సిఎం మాట్లాడారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఖాళీలను భర్తీ చేయడం, కొత్త ఉద్యోగాల నియామకం ప్రక్రియను చేపట్టాలన్నారు. నోటిఫికేషన్లకు ముందే న్యాయశాఖ అధికారులతో చర్చించాలని సూచించారు. ఇప్పటికే టిఎస్‌పిఎస్సీ ద్వారా 58 నోటిఫికేషన్లు జారీ చేసి నియామక ప్రక్రియను ముందుకు తీసుకుపోతున్నట్టు చైర్మెన్ చక్రపాణి ముఖ్యమంత్రికి వివరించారు. టిఎస్‌పిఎస్సి ద్వారా ఇప్పటికే 5000 మందికి పైగా నియామకం అయ్యారని, మరో నెల రోజుల వ్యవధిలో 12 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ముగుస్తుందని సిఎంకు చెప్పారు. న్యాయపరమైన వివాదాలు కూడా కొలిక్కి వచ్చినందున త్వరలోనే గ్రూప్–1, గ్రూప్–2 ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. ఇదే స్పూర్తితో పనిచేసి భవిష్యత్తులో 84 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి కమిషన్ గురుతర బాధ్యత పోషించాలని సిఎం కోరారు. పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు పని భారం పెరిగినందున కొత్తగా 90 మంది ఉద్యోగులను నియమించడానికి కూడా సిఎం అంగీకరించారు.

ఎరువులు, విత్తనాలపై వ్యవసాయ శాఖ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖరీఫ్ పంటలకు ఎరువుల లభ్యత, యాసంగి పంటలకు విత్తనాలు, ఎరువుల అవసరాలపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సీ. పార్థసారధి మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎరువుల అవసరాలు, అందుబాటులో ఉన్న ఎరువుల పరిస్థితిపై వ్యవసాయ శాఖ కమిషనర్ డా.ఎం. జనగ్‌మోహన్,హాకా, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ సమీక్షలో మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ (జీఎం) కె. రాములు, తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ డైరెక్టర్ డా. కేశవులు, హాకా, సీడ్ కార్పొరేషన్ అధికారులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కిలీ మంజారో పర్వతాన్ని అధిరోహించిన బీసీ విద్యార్థి



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

దక్షిణాఫ్రికాలోని కిలీ మంజారో పర్వతాన్ని తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీసీ విద్యార్థులు అధిరోహించారు. సికింద్రారాబాద్ బీసీ హాస్టల్‌లో ఉండి బీయస్సీ రెండవ సంవత్సరంచదువుతున్న చరణ్‌రాజ్ అనే విద్యార్థి మంగళవారం ఈ పర్వతాన్ని అధిరోహించినట్టు బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్ చరణ్‌రాజ్‌ను ప్రోత్సహించి కిలీ మంజారో పర్వతారోహణకు పంపించారు. భూమికి సుమారు 20వేల అడుగుల ఎత్తున ఉండే ఈ పర్వతాన్ని అధిరోహించి ఆ విద్యార్థి ముఖ్యమంత్రి కేసీఆర్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్నలతో కూడిన చిత్రపటాన్ని ఎగురవేశారు. తెలుగు జాతి ఖ్యాతిని చాటిన చరణ్‌రాజ్ సాహసాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్న, ముఖ్య కార్యదర్శి కె అశోక్‌కుమార్, కమిషనర్ అభినందించారు.

కిసాన్
నవతెలంగాణ

మీ కోసం

యంత్రం.. ప్రయోజనం

యాంత్రీకరణపై రైతులు మక్కువ చూపుతున్నారు. సకాలంలో పనులు పూర్తి చేసేందుకు వ్యవసాయ పరికరాలు, యంత్రాలు ఉపయోగపడుతున్నాయంటూ వాటిపై ఆసక్తి పెంచుకుంటున్నారు. కూలీల కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో అవి బాసటగా నిలుస్తున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో యంత్రాల ప్రత్యేకతలు, వాటి సామర్థ్యం తదితర వివరాలు మీ కోసం...

రోటావేటర్

భూమిని వ్యవసాయానికి అనుగుణంగా తయారు చేసేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుంది. దీనికి 36 నుంచి 42 బ్లేడ్లు ఉంటాయి. ఇది 5 హెచ్‌పీ ట్రాక్టర్ కలిగి ఉంటుంది.
ఉపయోగం : దుక్కి, దమ్ము సామర్థ్యం : గంటకు 0.52 హెక్టార్లు

వరినాటు యంత్రాలు

- వరి నాట్లు వేసేందుకు ఉపయోగించే యంత్రాల్లో ఇదొకటి. దీనికి ఎనిమిది వరుసలు ఉంటాయి. స్వీయచోదక శక్తి కలిగి ఉంటుంది.. సామర్థ్యం : గంటకు 0.3 - 0.20 హెక్టార్లు
- ఆరు వరుసలు ఉండే యంత్రం కూడా స్వీయ చోదక శక్తి (14-18 హెచ్‌పీ) కలిగి ఉంటుంది. సామర్థ్యం : రోజుకు 2.5 నుంచి 3.5 హెక్టార్లు.
- నాలుగు వరుసలు కలిగి ఉండే యంత్రం కూడా స్వీయచోదక శక్తి కలిగి ఉంటుంది. వెనుక నుంచి కూడా నడస్తుంది. సామర్థ్యం : రోజుకు 1.6 హెక్టార్లు.



డ్రమ్‌సీడర్

వరి విత్తనాలు విత్తేందుకు ఉపయోగించే యంత్రం ఇది. దీని ద్వారా ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనాలు వేసుకోవచ్చు. సామర్థ్యం : రోజుకు 0.8 హెక్టార్లు.

దుక్కిలేకుండా విత్తనం

దుక్కి లేకుండా విత్తనం వేసేందుకు, ఎరువులు చల్లేందుకు ఉపయోగించే పరికరం 9 టైన్స్. దీని ద్వారా వరి కోత తర్వాత మొక్కజొన్న విత్తుకోవచ్చు. 3.5 హెచ్‌పీ శక్తి ట్రాక్టర్ కలిగి ఉంటుంది. సామర్థ్యం : రోజుకు 3.5 నుంచి 4.5 హెక్టార్లు.

కలుపు తీసేందుకు..

తడి నేల నుంచి కలుపు తీసేందుకు ఉపయోగించే యంత్రం పవర్ వీడర్. ఇది స్వీయఛోదక శక్తి కలిగి ఉంటుంది. సామర్థ్యం : గంటకు 0.15 హెక్టార్లు.
- పొడి నేల నుంచి కలుపు తీసేందుకు ఉపయోగించే పవర్ వీడర్ కూడా స్వీయఛోదక శక్తి కలిగి ఉంటుంది. సామర్థ్యం : గంటకు 0.15హెక్టార్లు.
- పొడి నేల నుంచి కలుపు తీసేందుకు ఉపయోగించే మరో యంత్రం కోనో వీడర్. ఇది కూడా స్వీయ చోదకశక్తి కలిగి ఉంటుంది. సామర్థ్యం : గంటకు 0.15 హెక్టార్లు.

కంబైన్ హార్వెస్టర్

వరి కోత, నూర్పుటకు ఉపయోగించే యంత్రం కంబైన్ హార్వెస్టర్. ఈ యంత్రాలు 55, 60, 80 హెచ్‌పీల శక్తి కలిగి ఉంటాయి. సామర్థ్యం : గంటకు ఒక హెక్టారు.

మేజ్ కంబైన్ హార్వెస్టర్

మొక్కజొన్న కోత, నూర్పుటకు ఉపయోగించే యంత్రం మేజ్ కంబైన్ హార్వెస్టర్. ఈ యంత్రాలు 55, 60, 80 హెచ్‌పీల స్వీయ చోదకశక్తి కలిగి ఉంటాయి. సామర్థ్యం : గంటకు హెక్టారు.

వరి కోత యంత్రం

వరి కోతకు ఉపయోగించే యంత్రం స్వీయ ఛోదకశక్తి కలిగి ఉంటుంద్ి. సామర్థ్యం : గంటకు హెక్టారు.

రీపర్ బైండర్

పంట కోసి కట్టలు కట్టేందుకు ఉపయోగించే యంత్రం ఇది. స్వీయఛోదకశక్తి కలిగి ఉంటుంది. సామర్థ్యం : గంటకు 0.4 హెక్టార్లు.

డిగ్గర్ షేకర్

వేరుశనగ తీసేందుకు ఉపయోగించే యంత్రం ఇది. 35 నుంచి 45 హెచ్‌పీల ట్రాక్టర్ కలిగి ఉంటుంది. సామర్థ్యం 0.27 గంటలకు ఒక హెక్టారు.
- పసుపు డిగ్గర్ 35నుంచి 45 హెచ్‌పీల శక్తి గల ట్రాక్టర్ కలిగి ఉంటుంది. పసుపును తీయడానికి ఇది ఉపయోగపడుతుంది. సామర్థ్యం : 0.4 గంటకు ఒక హెక్టారు.

మల్టీక్రాప్ త్రెషర్

అన్ని రకాల పంటల నూర్పిడి యంత్రం ఇది. 8నుంచి 10 హెచ్‌పీల మోటార్ కలిగి ఉంటుంది. సామర్థ్యం : గంటకు 3 నుంచి 4 క్వింటాళు

ప్యాడీ త్రెషర్

వరి నూర్పిడికి ఉపయోగించే యంత్రం ఇది. 35 నుంచి 45 హెచ్‌పీల ట్రాక్టర్ కలిగి ఉంటుంది. సామర్థ్యం : గంటకు 4 నంచి 5 క్వింటాళ్లు.

డిహాస్కర్

మొక్కజొన్న ఒల్చేందుకు, శుద్ధి చేసేందుకు ఉపయోగించే యంత్రం ఇది. సామర్థ్యం : గంటకు 35 నుంచి40 క్వింటాళ్లు.

ఆముదం షెల్లర్

ఆముదం ఒల్చేందుకు, శుద్ధి చేసేందుకు ఉపయోగపడే యంత్రం ఇది. 5 హెచ్‌పీల మోటారు కలిగి ఉంటుంటుంది. సామర్థ్యం : గంటకు 2 నుంచి 5 క్వింటాళ్లు.

స్ట్రా బేలర్

గడ్డి కట్టడానికి ఉపయోగించే యంత్రం ఇది. స్వీయచోదకశక్తి కలిగి ఉంటుంది. సామర్థ్యం : గంటకు 2 నుంచి 2.5 క్వింటాళ్లు.

- మోత్కూరు యాదయ్య
8332995392

సస్యరక్షణే ప్రధానం



వాణిజ్య ప్రధాన పంటల్లో మిర్చి ఒకటి. దీని వర్షాధార పంటకు నల్ల నేలలు, నీటి ఆధార పంటకు నల్లనేలులు, చెలక నేలలు, లంక భూములు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు అనుకూలం. పలు మెళకువలు, సస్యరక్షణ చర్యలు చేపడితే ఈ పంట ఆశాజనకంగా ఉంటుంది. నేల తయారీకి నాలుగైదుసార్లు మెత్తటి దుక్కి దున్ని, రెండుసార్లు గంటక తోలాలి. ఖరీఫ్‌లో జూన్ నుంచి ఆగస్టు వరకు మిర్చిని విత్తుకోవచ్చు. నాటడానికి ఆరు వారాల వయసున్న మొక్కలు అనుకూలం. వర్షాధారపు పైరుకు 60ఇ15 సెం.మీటర్ల దూరంలో పాదుకు రెండు మొక్కల చొప్పున నాటాలి. నీటి సౌకర్యం కింద 60 X 60 లేదా 75 X 60 లేదా 90 X 60సెం.మీటర్ల ఎడం చొప్పున పాదుకు ఒక మొక్క చొప్పున నాటాలి. సూటి రకాలైతే పాదుకు రెండు మొక్కలు, సంకర రకాలైతే పాదుకు ఒక మొక్క చొప్పున నాటాలి.

విత్తన మోతాదు: నారుపెంచేందుకు సెంటుకు 650గ్రాముల (ఒక ఎకరానికి సరిపడే నారు) విత్తనం, ఎదబెట్టేందుకు ఎకరానికి 2.5 కిలోల విత్తనం కావాలి.

విత్తనశుద్ధి: కిలో మిరప విత్తనానికి మొదటగా రసం పీల్చే పురుగుల నివారణకు 6 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్‌ని, చివరగా ఇతర తెగుళ్ల నివారణరకు 3 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తన శుద్ధి చేయాలి.

నారుమడి యాజమాన్యం: ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు వేయాలి. ఒక మీటరు వెడల్పు, 15సెం.మీ ఎత్తు ఉండేటట్టు ఎత్తైన నారుమడులు చేసి మధ్యలో 30 సెం.మీటర్ల కాల్వలు తీయాలి. సెంటు నారుమడిలో 650 గ్రాముల విత్తనం చల్లుకోవాలి. విత్తనంతో పాటు సెంటు నారుమడికి 80 గ్రాముల ఫిప్రొనిల్ గుళికలను వాడితే రసం పీల్చే పురుగులను(నల్లి తప్ప) నివారించొచ్చు.

రకాలు

జీ-3: పొడవు కాయలు : వర్షాధార పంటకు ఇది అనుకూలం. వర్షాధార పంటకు ఎకరానికి 6-7క్వింటాళ్లు, నీటి సౌకర్యమున్న పంటకు 15 - 18 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

జీ-4 (భాగ్యలక్ష్మి): కాయలు సన్నగా, పొడవుగా ఉంటాయి. పచ్చి కాయకు, ఎండుకాయకు అనుకూలం. వైరస్‌ని తట్టుకుంటుంది. హెక్టారుకు 40నుంచి 45 క్వింటాళ్లు వస్తుంది.

సీఏ 960 (సింధూరు): కాయలు పొడవుగా, లావుగా ఉంటాయి. పచ్చిమిర్చికి, ఎండుమిర్చికి అనుకూలం. నీటి సౌకర్యం కింద వేయదగిన రకం. త్వరగా కాపుకొస్తుంది. కారం తక్కువ. వేసవి పైరుకు అనుకూలం. హెక్టారుకు 50 నుంచి 55 క్వింటాళ్లు.

ఎల్‌సీఏ- 200 (కిరణ్): పొడవైన కాయలు. నీటి ఆధార పైరుకు అనుకూలం. హెక్టారుకు 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

సీఏ 1068 (అపర్ణ): లావైన పొడవైన కాయలు. నీటి సౌకర్యం కింద పచ్చిమిర్చి ఎండు మిర్చిలకు అనుకూలం. హెక్టారుకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి.

ఎల్‌సీఏ 235 (భాస్కర్): కాయల పొడవు తక్కువ. కారం ఎక్కువ. నీటి సౌకర్యం కింద సాగుకు అనుకూలం. వైరస్‌ని బాగా తట్టుకుంటుంది. అన్ని జిల్లాలకు అనుకూలం. హెక్టారుకు 50నుంచి 60 క్వింటాళ్ల దిగుబడి.

ఎల్‌సీఏ 2016 (ప్రకాశ్): పొడవైన కాయలు గల రకం. పచ్చి మర్చికి, ఎండుమిర్చికి అనుకూలం. వర్షాధార, నీటి సౌకర్యం కింద సాగుకు అనుకూలమైన జాతీయ రకం. హెక్టారుకు 45 నుంచి 50 క్వింటాళ్ల దిగుబడి.

ఎల్‌సీఏ 305 (లాం.305): పొడవైన, లావైన కాయలు కలిగిన రకం. పచ్చి మిర్చికి, ఎండు మిర్చికి నీటి ఆధార పంటకు అనుకూలం.

ఎల్‌సీఏ 305 (లాం.334): మొక్కలు గుబురుగా, ఎత్తుగా పెరుగుతాయి. వైరస్ తట్టుకుంటుంది. కాయలు 7-8 సెం.మీటర్ల పొడవుతో మంచి ఎరుపు రంగు కలిగి ఉంటాయి. వర్షాధార, నీటి సౌకర్యమున్న జిల్లాల్లో సాగుకు అనుకూలం. ఎగుమతికి అనువైన రకం. ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా తట్టుకుని సుస్థిర దిగుబడి నివ్వగల రకం. జాతీయ స్థాయిలో ప్రశాంత్ అనే పేరుతో విడుదలైంది. హెక్టారుకు 60 నుంచి 65 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

ఎల్‌సీఏ 353: మొక్కలు గుబురుగా, మధ్యస్థంగా ఉంటాయి. కాయలు లేత ఆకుపచ్చ రంగులో 7 నుంచి 9 సెం.మీటర్ల పొడవుతో సన్నగా ఉంటాయి. పచ్చి, ఎండు మిర్చికి అనుకూలం. ఎల్‌సీఏ 334 రకం కన్నా 20 నుంచి 25 రోజులు ముందుగా కాపుకొస్తుంది. కాయలు పండిన తర్వాత మంచి నిగారింపుతో ఆకర్షణీయమైన ఎరుపు రంగు కలిగి ఉంటాయి. జాతీయ స్థాయిలో లాం-353 అనే పేరుతో విడుదలైంది.

అంతర కృషి: 200 లీటర్ల నీటిలో లీటరు ఫ్లుక్లోరాలిన్ 45 శాతం (ఎకరానికి)ను నాటే ఒకట్రెండు రోజుల ముందు పిచికారీ చేసి భూమిలో కలియదున్నాలి. లేదా 1.3 నుంచి 1.6 లీటర్ల పెండిమిథాలిన్ 30 శాతం లేదా 200 మి.లీటర్ల ఆక్సిఫ్లోరోఫిన్ 23.5 శాతం కలిపి పిచికారీ చేయాలి. నాటిన 25, 30 రోజుల తర్వాత 15,20 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి గొర్రు, గుంటకలతో అంతర కృషి చేయాలి.

ఎరువులు: ఎకరానికి 10 టన్నుల పశువులు ఎరువు వాడాలి. లేదా పచ్చిరొట్ట పైరును పెంచి భూమిలో కలియదున్నాలి. వర్షాధార పైరుకు 60-40-50 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్ ఇచ్చే ఎరువులను వేయాలి.

సస్యరక్షణ

తామర పురుగులు: రెక్కల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చుతాయి. దీంతో ఆకుల అంచులు పైకి ముడుచుకుంటాయి. ఆకులు, పిందెలు రాగి రంగులోకి మారుతుంది. పూత, పిందె నిలిచిపోతుంది. దీని నివారణకు ఎకరానికి 600 గ్రాముల కార్బరిల్ లేదా 400 మిల్లీ లీటర్ల ఫాసలోన్ లేదా 300 గ్రాముల ఎసిఫేట్ 300 లేదా 400 మి.లీటర్ల ఫిఫ్రొనిల్ లేదా 75 మి.లీటర్ల స్పైనోసాడ్ ఆకుల అడుగు భాగం బాగా తడిచేటట్టు పిచికారీ చేయాలి. నాటిన 15 నుంచి 45వ రోజు ఫిప్రొనిల్ 0.3శాతం గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు మొక్కలకు అందించాలి.

కింది ముడుత (తెల్లనల్లి): తెల్లనల్లి పురగులు ఆకుల రసాన్ని పీల్చుతాయి. దీంతో ఆకులు కిందికి ముడుచుకొని తిరగబడిన పడవ ఆకారంలో కనిపిస్తాయి. ఆకుల కాడలు సాగి ముదురు ఆకుపచ్చగా మారతాయి. మొక్కల పెరుగుదల ఆగిపోయి లేత ఆకులు మద్దకడతాయి. దీని నివారణకు ఎకరానికి డైకోఫాల్ ఒక లీటరు లేదా నీళ్లలో కరిగే గంధకం 600 గ్రాములు పిచికారీ చేయాలి. సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు వాడొద్దు. నత్రజని ఎరువులు తగ్గించాలి. పై ముడత, కింద ముడత ఉధృతి ఒకేసారి గమనిస్తే ఉధృతినిబట్టి ఎకరానికి 400 మి.లీటర్ల జోలోన్ లేదా 300 గ్రాముల పైగాసస్ లేదా 400 మి.లీటర్ల క్లోర్‌ఫెనాపైర్ పిచికారీ చేయాలి. నారుకుళ్లు తెగులు, బాక్టీరియా ఆకుమచ్చ తెగులు, సెర్కోస్పారా ఆకుమచ్చ తెగులు, కొయినోఫొరా కొమ్మకుళ్లు తెగులు, కొమ్మ ఎండు, కాయకుళ్లు తెగులు, మొక్కల ఎండు తెగులు, బూడిద తెగులు, వైరస్ తెగులు, ఆకుముడత తెగులు (జెమిని వైరస్), కుకుంబర్ మొజాయిక్ వైరస్, పీనట్ బడ్ నెక్రోసిస్ వైరస్ (మొవ్వకుళ్లు తెగుళ్లు) నివారణకు నిపుణుల సూచనల మేరకు మందులు వాడాలి.



-చింత ప్రదీపిక, శాస్త్రవేత్త, ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)

నిబంధనలు రూపొందించి'నారు'

ఉద్యాన పంటలు వేసుకునే రైతులు ఇక టెన్షన్ పడాల్సిన పనిలేదు. నర్సరీల్లో దొరికే నారు నాణ్యత గురించి దిగులు పడాల్సిన అవసరం లేదు. నాసిరకం అమ్మకాలకు సర్కారు అడ్డుకట్ట వేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా నర్సరీల నిర్వహణకు సంబంధించి నిబంధనలు రూపొందించింది. వీటిని కచ్చితంగా పాటించాల్సిందేనని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది.



'మా వద్ద నాణ్యమైన నారు తక్కువ ధరకే లభ్యమవు తుంది' అనే ప్రకటనలకు ఆకర్షితులై చాలామంది రైతులు మోసపోతుంటారు. దళారులు, నర్సరీల నిర్వాహకుల మాటలు నమ్మి ఉద్యాన పంటలు వేసి నష్టపోతుంటారు. గతేడాది ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో జరిగిందదే. సుమారు 20 వేల హెక్టార్లలో నాసిరకం మిరపనారు వేసి 6,200 మంది రైతన్నలు మోసపోయారు. పూతా, కాతా రాక తీవ్రంగా నష్టపోయారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాద్దని భావించింది రాష్ట్ర ప్రభుత్వం. నర్సరీ నిర్వాహకుల ఆగడాలకు అడ్డకట్ట వేసేందుకు రంగం సిద్ధం చేసింది. అనుమతుల్లేకుండా నర్సరీలు నిర్వహించకుండా పటిష్ట చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రత్యేక నియమావళిని రూపొందించింది. నర్సరీల నిర్వాహకులు ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలో అందులో పేర్కొంది. ఈ మేరకు ఉద్యానవన శాఖ అధికారి కార్యాలయంలో నర్సరీల నిర్వాహకులకు దృవీకరణ పత్రాలు (లైసెన్సులు) జారీ చేస్తారు. నర్సరీల్లో జరుగుతున్న మోసాలను అరికట్టేందుకే ఈ నిబంధనలు తీసుకొచ్చినట్టు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

- ఈ ఏడాది నుంచి నర్సరీలు పెంచే వారు ప్రధానంగా హరిత పందిరిని ఏర్పాటు చేసుకోవాలి. ఆరుబయట నారు పెంచడం చట్టవిరుద్ధం.
- నర్సరీ నిర్వాహకులు ఏ రకం విత్తనం ఎక్కడ కొనుగోలు చేశారో స్పష్టం చేయాలి. అవి జీఓటీ (గ్రో ఆఫ్ టెస్ట్) అనుమతులు ఉన్న విత్తనాలే అయ్యుండాలి.

మా దృష్టికి తీసుకురండి



అనుమతుల్లేకుండా నర్సరీలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది. నిబంధనల ప్రకారమే నారు విక్రయించాల్సి ఉంటుంది. నాసిరకం నారుతో రైతులను మోసగిస్తే శిక్ష తప్పదు. నూతన నియమావళి ప్రకారం భద్రాద్రి జిల్లాలో ఇప్పటి వరకు 10 నర్సరీలకు మాత్రమే అనుమతులున్నాయి. అశ్వారావుపేట నియోజక వర్గం-4, జూలూరుపాడు మండలం-4, పినపాక-1, భద్రాచలం-1కు మాత్రమే అనుమతులు ఇచ్చాం. మిగిలిన ఎక్కడైనా నర్సరీలు ఉంటే మాదృష్టికి తీసుకురావచ్చు.

- జినుగు మరియన్న, భద్రాద్రి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి

- నర్సరీలకు బయట అందరికీ కనిపించేలా బోర్డు ఏర్పాటు చేయాలి. ఎన్ని రకాల నారు అమ్ముతున్నారో, వాటి బ్రండ్ తదితర అంశాలు పేర్కొనాలి.
- ఏ రకం విత్తనం సాగు చేస్తే ఎంత దిగుబడి వస్తుందో రైతులకు వివరించాలి.
- నారుకు సంబంధించిన బిల్లులు, లాట్, బ్రాండ్ తదితర వివరాలు ఉండాలి.
- కూర మిరపకాయ నారు 33-36 రోజుల వయసు మాత్రమే కలిగి ఉండాలి. టమాట నారు 3-4 వారాల వయసు, వంకాయ 30-35రోజుల వయసు, బొప్పాయి నారు 30-40రోజుల వయసు, మిర్చి నారు 40-45 రోజుల వయసు, బంతినారు 30రోజుల వయసు కలిగి ఉండాలి.
- వివిధ రకాల పండ్ల, కూరగాయలు, పుష్పాలు, ఔషధ, సుగంధ ద్రవ్యాల పంటలకు నాణ్యమైన మొక్కల తయారీకి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజును కూడా నిర్ధారించింది. పండ్ల మొక్కల ఉత్పత్తికి రూ. 5 వేలు, కూరగాయలు, పుష్పాలు, ఔషధ, సుగంధ ద్రవ్యాల నాణ్యమైన మొక్కల తయారీకి రెండు లక్షల మొక్కల ఉత్పత్తికి రూ. వెయ్యి, నాలుగు లక్షల వరకూ పెంపకానికి రూ. వెయ్యి, నాలుగు లక్షలకు మించి పైబడి ఉత్పత్తికి రూ. 2,500 చెల్లించాల్సి ఉంటుంది.
- ఏయే రైతులు ఎంత మేరకు నారు కొన్నారో, పూర్తి వివరాలు నర్సరీల నిర్వాహకుల వద్ద ఉండాలి.
- నర్సరీల నిర్వాహకులు ఈ నిబంధనలు పాటించకపోతే నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటారు. మోసం చేస్తే ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 50 వేల జరిమానా విధిస్తారు.

- వనం నాగయ్య,
9490099343

రైతులు మోసపోవద్దు

నర్సరీల నిర్వాహకులు ఏయే అంశాలు పరిగణనలోకి తీసుకోవాలో ప్రభుత్వం నియమావళిని రూపొందించింది. దీన్ని కచ్చితంగా పాటించాల్సిందే. లేదంటే చర్యలు తప్పవు. ఇప్పటి వరకు తెలంగాణలో 110 నర్సరీలకు మాత్రమే అనుమతులున్నాయి. ఒక్క ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోనే 65 మందికి లైసెన్సులు జారీ అయ్యి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండటం విశేషం. ఖమ్మం జిల్లాలో 55 నర్సరీలకు మాత్రమే అనుమతులున్నాయి.



ఖమ్మం జిల్లాలో పాలేరు నియోజకవర్గంలో 7, ఖమ్మం నియోజకవర్గంలో 4, మధిర 16, వైరా 18, సత్తుపల్లి నియోజకవర్గంలో 10 మందికి మాత్రమే నర్సరీలు పెంచుకునేందుకు లైసెన్సులు జారీ చేశాం. అనుమతులు ఉన్న నర్సరీల వద్ద మాత్రమే రైతులు రశీదు పొంది నారు కొనుగోలు చేయాలి. అనుమతుల్లేని నర్సరీలను నమ్మొద్దు. నారు కొనే ముందు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి.

- శ్రీనివాసరావు, ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి

రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

'ఫిప్రోనిల్'తో తామరపురుగు నివారణ

కందులు విత్తన శుద్ధి ఎలా?
- వెంకటరావు, ముదిగొండ (ఖమ్మం జిల్లా)
కిలో విత్తనాలకు 3 గ్రాముల థిరామ్ లేదా కాప్టాన్ పట్టించాలి. ఆ తర్వాత విత్తుకునే ముందు 200 నుంచి 400 గ్రాముల రైజోబియాన్ని ఎకరా విత్తనానికి కలిపి విత్తుకోవాలి.

కందిని ఎప్పుడు విత్తుకోవచ్చు?
- అనిల్, తంగళ్లపల్లి (రాజన్న సిరిసిల్ల జిల్లా)
ఖరీఫ్‌లో జూన్ 15నుంచి జూలై 15 వరకు విత్తుకోవచ్చు. అయితే.. ఆగస్టు 15 వరకు మొక్కల సంఖ్య పెంచి దగ్గర అచ్చులో వేసుకోవచ్చు.

బెండలో మెరుగైన రకాలు ఏవి?
- మోహన్‌రెడ్డి, అక్కెనపల్లి (నార్కెట్‌పల్లి మం, నల్లగొండ జిల్లా)
పర్భని క్రాంతి, అర్క అభయ, అర్క అనామిక తదితర రకాలు

పత్తిలో మెగ్నీషియం లోపాన్ని ఎలా నివారించుకోవాలి?
- రాంచందర్, మంగనూర్ (మహబూబ్‌నగర్ జిల్లా)
లీటరు నీటిలో 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి విత్తిన 45, ,75 రోజులకు రెండుసార్లు పిచికారీ చేయాలి.

పెసరలో తామర పురుగు నివారణ ఎలా?
- శేషారావు, జుక్కల్ (కామారెడ్డి జిల్లా)
ఈ పురుగులు తొలిదశల్లో లేత ఆకులపై వృద్ధి చెందుతాయి. ఆకుల అడుగు నుంచి రసాన్ని పీలుస్తాయి. వీటి వల్ల ఆకుముడత అనే వైరస్ వ్యాధి కూడా వ్యాపిస్తుంది. దీని నివారణకు లీటరు నీటిలో 1.5 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా 1గ్రాము ఎసిఫేట్ లేదా 1.మి.లీ ఫిప్రోనిల్ కలిపి పిచికారీ చేయాలి.

అడగండి.. చెబుతాం!

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

మా చిరునామా
'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020.
kisan@navatelangana.com



ఫిట్‌నెస్ ప్రమాణాలు అలా ఉండాలి! : కెప్టెన్ కోహ్లి, కోచ్ శాస్త్రి


వీళ్లనూ తొలగించండి

● సుప్రీంకోర్టును కోరిన పాలకుల కమిటీ



నవతెలంగాణ-ముంబయి

భారత క్రికెట్ బోర్డు బాధ్యతలు చూస్తున్న పాలకుల కమిటీ (సీఓఏ) మరో సంచలన నిర్ణయం తీసుకున్నది. జస్టిస్ లోధా సిఫారసుల అమలుకు అడ్డుపడుతున్నారని గతంలో బీసీసీఐ అధ్యక్ష, కార్యదర్శులు అనురాగ్ ఠాకూర్, అజయ్ షిర్కేలను పదవుల నుంచి తొలగించిన మాదిరిగానే.. ప్రస్తుత తాత్కాలిక అధ్యక్ష, కార్యదర్శులపైనా వేటు వేయాలని సుప్రీంకోర్టును కోరనున్నది. బీసీసీఐలో లోధా సిఫారసుల అమలుపై ఐదో మధ్యంతర నివేదిక సమర్పించిన పాలకుల కమిటీ.. తాత్కాలిక అధ్యక్షుడు సి.కె ఖన్నా, తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరిలను పదవుల నుంచి తప్పించాలని కోరింది. జులై 24న సుప్రీంకోర్టు తీర్పునకు పూర్తిగా వక్ర బాష్యం చెప్పిన బీసీసీఐ.. ప్రత్యేక సర్వ సభ్య సమావేశం నుంచి సీఈవో రాహుల్ జోహ్రీ సహా ఇతర అధికారులను బయటకు పంపించిన విషయాన్ని సీవోఏ సీరియస్‌గా తీసుకున్నది. అలాగే 13 మంది మాజీ క్రికెటర్లకు 'ఏక కాల ప్రయోజనాలు' కింద ఇవ్వాల్సిన ఆర్థిక సాయం విషయంలో కోశాధికారి చెక్‌లపై సంతకం చేసేందుకు నిరాకరించారు. దీంతో సీఎఫ్ఓ, జనరల్ మేనేజర్‌లకు చెక్ పవర్ కల్పించిన సీఓఏ 13 మందికి ఆర్థిక సాయం అందజేసింది. ఇక ఇటీవల జరిగిన ప్రత్యేక సర్వ సభ్య సమావేశంలో విరుద్ధ ప్రయోజనాల అంశాన్ని ఆమోదించటంలోనూ బీసీసీఐ విఫలమైంది. అంబుడ్స్‌మన్‌గా ఏ.పి షా పదవీకాలం ముగిసిన తర్వాత బీసీసీఐ మరోకరిని నియమించలేదు. ఇంకా లోధా కమిటీ సిఫారసుల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై వీరు అలసత్వం వహిస్తున్నారు. దీంతో తక్షణమే వీరిని తప్పించి.. సీఈవో రాహుల్ జోహ్రీ నేతృత్వంలోని అధికారులకు బీసీసీఐ 'పరిపాలన, అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్' బాధ్యతలను అప్పగించాలని, నూతన రాజ్యాంగం ప్రకారం ఎన్నికలు జరిగే వరకూ బాధ్యతలు వారు కొనసాగాలని వినోద్ రాయ్ సూచించారు. దీనిపై సుప్రీంకోర్టు తదుపరి విచారణ సందర్భంగా అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.



మళ్లీ ఓడిన టైటాన్స్

అహ్మదాబాద్ : ప్రొ కబడ్డీ లీగ్-5లో తెలుగు టైటాన్స్ ఓటమి బాట వీడలేదు. బుధవారం గుజరాత్‌ఫార్చ్యూన్‌జెయింట్‌తో జరిగిన మ్యాచ్‌లో 19-29తో పది పాయింట్ల తేడాతో తెలుగు టైటాన్స్ ఓటమిపాలైంది. దీంతో టైటాన్స్ లీగ్‌లో ఏడోసారి పరాజయం పాలైంది. గుజరాత్ స్టార్ రైడర్ సచిన్ పది పాయింట్లతో చెలరేగాడు. తెలుగు టైటాన్స్ తరఫున ఎవ్వరూ మెరుగైన ప్రదర్శన చేయలేకపోయారు. అంతకముందు హర్యానా స్టీలర్స్, తమిళ తలైవాస్ మధ్య జరిగిన మరో మ్యాచ్ 25-25తో టైగా ముగిసింది.

గొప్ప గౌరవం

వైస్‌కెప్టెన్సీపై రోహిత్ శర్మ



పల్లెకల్ : భారత క్రికెట్ జట్టులో సుమారు దశాబ్దకాలంగా కొనసాగుతున్నా.. ప్రతి రోజూ కొత్తగానే గడుపుతున్న విచిత్ర అనుభవం రోహిత్ శర్మది!. వన్డే క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (264)లో ప్రపంచ రికార్డు నెలకొల్పినా.. రోహిత్ శర్మ ఇంకా టెస్టు క్రికెట్‌లో తన స్థానం కోసం నిరీక్షిస్తూనే ఉన్నాడు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో జట్టులో ఉన్నా రోహిత్ శర్మ మైదానంలోకి దిగే అవకాశం దక్కలేదు. కానీ శ్రీలంకతో ఐదు మ్యాచుల వన్డే సిరీస్‌కు రోహిత్ శర్మను సెలక్షన్ కమిటీ వైస్ కెప్టెన్‌గా ప్రకటించింది. కోహ్లికి అజింక్య రహానె డిప్యూటీగా వ్యవహరించినా... వన్డేల్లో అతడు తుది జట్టులో ఉండేది లేనిది అనుమానమే. దీంతో టెస్టులకు రహానె వైస్ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ.. వన్డేల్లో రోహిత్ శర్మకు డిప్యూటీ బాధ్యతలు అప్పగించారు. 'తొలుత, వైస్ కెప్టెన్‌గా నియమించటం గొప్ప గౌరవం. పదేండ్ల క్రితం కేవలం భారత్‌కు ఆడటం గురించే ఆలోచించే వాడిని. ఇప్పుడు వైస్ కెప్టెన్ కావడంతో ఎంతో సంతోషంగా ఉంది' అని రోహిత్ శర్మ ఆనందం వ్యక్తం చేశాడు. 'కొత్త బాధ్యతలతో తొలి వన్డే కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఐపీఎల్‌లో కెప్టెన్‌గా నేను ముందున్నాను. ఇక్కడ వైస్ కెప్టెన్‌గా సహాయక బాధ్యత!. ఐపీఎల్‌కు, అంతర్జాతీయ క్రికెట్‌కు స్పష్టమైన తేడా ఉన్నా.. నిబద్ధతలో మాత్రం మార్పు ఉండదు' అని రోహిత్ పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌కు సారథిగా వ్యవహరిస్తున్న రోహిత్ శర్మ ఆ జట్టును మూడు సార్లు చాంపియన్‌గా నిలిపిన సంగతి తెలిసిందే.

ఫీల్డింగే ప్రధానం

2019 ప్రపంచకప్‌లో ఫీల్డింగ్‌లో భారత్ అత్యుత్తమ జట్టుగా నిలవాలి

భారత్ చీఫ్ కోచ్ రవిశాస్త్రి

నవతెలంగాణ-పల్లెకల్

అనిల్ కుంబ్లే నుంచి చీఫ్ కోచ్‌గా పగ్గాలు అందుకున్న రవిశాస్త్రి.. తొలి పర్యటనలోనే 3-0తో చారిత్రక టెస్టు సిరీస్ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ద్వీపదేశంలో 11 రోజుల్లోపే వరుసగా రెండో సిరీస్‌ను సాధించిన కోహ్లిసేన.. ఈక్రమంలో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. టెస్టు సిరీస్ విజయం నేపథ్యంలో చీఫ్ కోచ్ రవిశాస్త్రి ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వన్డే జట్టును ప్రకటిస్తూ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ భారత జట్టు ఫీల్డింగ్ ప్రమాణాలపై మాట్లాడాడు. ఫీల్డింగ్, ఫిట్‌నెస్, నైపుణ్యం విషయంలో ఇతర దేశాలు ఎంతో ముందున్నా.. మనమింకా ఆ దిశగా వెనుకంజలోనే ఉన్నామని అభిప్రాయపడ్డాడు. రానున్న భారత జట్ల ఎంపికలో ఫిట్‌నెస్, ఫీల్డింగ్ నైపుణ్యం సైతం ప్రమాణికం చేయనున్నామని ప్రసాద్ పరోక్ష సంకేతమిచ్చాడు. తాజా ఇంటర్వ్యూలో రవిశాస్త్రి సైతం అదే అంశంపై తన అభిప్రాయాన్ని వెల్లడించటం.. భారత జట్టులో జరుగబోతున్న మార్పులపై ఆసక్తి రేపుతోంది. టెస్టు క్రికెట్‌లో నిలకడైన విజయాలు సహా 2019 ప్రపంచకప్ లక్ష్యాలుగా పెట్టుకున్న రవిశాస్త్రి.. చీఫ్ కోచ్‌గా అదే ప్రధానంగా సాగనున్నట్టు తెలిపాడు. '2019 వన్డే ప్రపంచకప్ సమయానికి టీమ్ ఇండియా అత్యుత్తమ ఫీల్డింగ్ జట్టును బరిలోకి దింపాలనుకుంటోంది. ప్రపంచకప్ ప్రాధాన్యత జాబితాలో ప్రామాణిక ఫిట్‌నెస్ సాధించినవారే తుది జాబితాలో నిలుస్తారు' అని శాస్త్రి వెల్లడించాడు. 'ప్రపంచకప్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నది. దాన్ని మనం గౌరవించాలి. అదే సమయంలో టెస్టు క్రికెట్‌లో టీమ్ ఇండియా సాధించాల్సిన లక్ష్యాలు అలాగే ఉంటాయి. ఓవరాల్‌గా టెస్టు క్రికెట్ విజయాలే సక్సెస్‌కు చిరునామా' అని రవిశాస్త్రి అన్నాడు. 'భారత్ ముందు ఇప్పుడు రెండు లక్ష్యాలు ఉన్నాయి. ఒకటి ప్రపంచకప్, మరొకటి టెస్టు క్రికెట్. వేటికవే ప్రత్యేకం. రెండింటి కోసం భిన్నమైన స్థాయిలో సన్నద్ధమవ్వాలి. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా వంటి జట్లను చూస్తే, టెస్టుల్లో తిరుగులేని ప్రదర్శన చేస్తూనే పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో అత్యుత్తమంగా ఆడుతున్నారు. ప్రపంచకప్ ప్రతి నాలుగేండ్లకు ఓసారి వస్తుంది. అభిమానుల్లో దానికున్న క్రేజ్ దృష్ట్యా అది కీలకం. కానీ ఈ జట్టును నిజంగా పరీక్షించాలనుకుంటే అది కచ్చితంగా టెస్టు ఫార్మాట్‌లోనే' అని శాస్త్రి అభిప్రాయపడ్డాడు. 'ఇదే సమయంలో క్రమశిక్షణతో కూడిన ప్రదర్శన కోరుకుంటున్నాం. శ్రీలంకతో టెస్టు సిరీస్‌నే తీసుకుంటే, రెండో టెస్టులో హార్దిక్ పాండ్య రెండు నో బాల్స్ వేశాడు. పల్లెకల్‌లో మహ్మద్ షమి ఓ నో బాల్ విసిరాడు. ఇక క్యాచుల విషయానికి వస్తే రెండు క్యాచులు నేలపాలయ్యాయి. దీంతో మేము వీటిని అధిగమించాలి' అని శాస్త్రి అన్నాడు.

ఇక కెప్టెన్ విరాట్ కోహ్లి సహా డ్రెస్సింగ్‌రూమ్‌లో ఆటగాళ్లందరితోనూ ఏడాది క్రితం ఉన్న సంబంధాలే ఉన్నాయి. ఆటగాళ్లకు నాపై నమ్మకం ఉందా లేదా అనేది వారు చెప్పాలి. కానీ అనవసరంగా జోక్యం చేసుకోవడాన్ని నేను విశ్వసించను. జట్టు నాయకుడు ఎప్పుడైనా కెప్టెనే. కోచ్ దానికి కొంత కొనసాగింపు మాత్రమే. శ్రీలంక పర్యటన ఆరంభానికి ముందే జట్టుతో మాట్లాడాను. ఏడాది క్రితం ఏ బృందంతోనైతే పనిచేశానో, ఇప్పుడూ అదే సహాయక సిబ్బందితో వచ్చాను. ఏమీ కొత్తగా లేదు. అంతా అప్పటిలాగే ఉంది. ఆటగాళ్లపై నాపై అదే నమ్మకం ఉంది. 35 ఏండ్లుగా క్రికెట్‌లో కొనసాగుతున్న అనుభవంతో నేను చేయగలిగినది చేస్తున్నానని శాస్త్రి అన్నాడు.


కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సుద్దాల అశోక్‌తేజ


కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జయరాజ్

సాహితీ ప్రముఖులకు పురస్కారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ముగ్గురు సాహితీ ప్రముఖులకు తెలంగాణ ప్రభుత్వం విశిష్ట పురస్కారం ప్రదానం చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రముఖ గీత రచయితలు సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్, ప్రముఖ సంస్కృత తెలుగు విద్వాంసుడు శ్రీభాష్యం విజయ సారథిలను సన్మానించారు.

81 లక్షల ఆధార్ కార్డుల రద్దు



ముంబయి: రేషన్ నుంచి సబ్సిడీ వరకూ అన్ని ప్రభుత్వాలకు అనుసంధానమైన ఆధార్ సంఖ్యల్లో కొన్నింటిని ప్రభుత్వం డియాక్టివేట్ చేసింది. సుమారు 81 లక్షల ఆధార్ సంఖ్యలను డియాక్టివేట్ చేసినట్టు ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. ఆధార్ జీవిత చక్ర నిర్వహణ (ఎఎల్‌సీఎం) మార్గదర్శకాలను అనుసరించి బోగస్, మనుగడలో లేని ఆధార్ సంఖ్యలను నిలిపివేసినట్లు కేంద్ర మంత్రి పిపి చౌదరి వివరించారు. ప్రస్తుతం మన ఆధార్ సంఖ్య మనుగడలో ఉందా? లేదా? అనే అంశం తెలుసుకునేందుకు యూఐడీఎఐ వెబ్‌సైట్ https://uidai.gov.in లో లాగిన్ అవ్వాలి. అందులో ఆధార్ సర్వీసెస్ ట్యాబ్ కింద 'వెరిఫై ఆధార్ నంబర్' అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అప్పుడు ఓ నోటిఫికేషన్ పాప్ అవుతుంది. 'ఓకె' అనే ఆప్షన్‌ను క్లిక్ చేస్తే కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. దీనిలో రెండు ఖాళీ బాక్సులు ప్రత్యక్షమౌతాయి. మొదటి బాక్సులో ఆధార్ సంఖ్య, రెండో బాక్సులో ఆ పక్కనే ఇచ్చిన సెక్యూరిటీ కోడ్‌ను ఎంటర్ చేయాలి. దీంతో మరో పేజీ ఓపెన్ అవుతుంది. అందులో పరీక్షిస్తున్న ఆధార్ సంఖ్య మనుగడలో ఉందా, లేదా? అనే అంశాన్ని వివరించే వివరాలు స్క్రీన్‌పై ప్రత్యక్షమౌతాయి. ఆధార్ మనుగడలో ఉంటే పచ్చని రంగులో 'రైట్' అని వస్తుంది. అక్కడ వ్యక్తి వయసు, ఫోన్ నెంబర్ రిజిస్టర్ అయి ఉంటే చివరి మూడు అంకెలు కనిపిస్తాయి. రాష్ట్రం పేరు కూడా కనిపిస్తుంది.

ఆర్టికల్ 35ఎ పై విచారణకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం



న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్ వాసులకు ప్రత్యేక హక్కులు కల్పిస్తున్న రాజ్యాంగంలోని 35ఎ అధికరణంపై విచారణకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు చేసిన ప్రకటన మరో వివాదానికి దారి తీస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఈ అధికరణం ద్వారా ప్రత్యేక హక్కులు కల్పించటం లింగ వివక్షతో కూడినదా? ఇది రాజ్యాంగానికి సంబంధించిన మూల వ్యవస్థను ఉల్లంఘిస్తోందా? అన్న అంశాలను ఈ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పరిశీలిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం చెప్పటమే ఇందుకు కారణం. 1954లో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం రాజ్యాంగంలో చోటు చేసుకున్న ఆర్టికల్ 35 ఎ ప్రకారం జమ్మూ కాశ్మీర్ పౌరులకు ప్రత్యేక హక్కులు, సౌకర్యాలు కల్పించటమే కాక రాష్ట్రేతరులను వివాహమాడిన మహిళలకు ఆస్థి హక్కును నిరాకరిస్తోంది. ఈ నిబంధన కేవలం ఆ మహిళకు మాత్రమే కాక ఆమె వారసులకు కూడా వర్తిస్తుండటం గమనార్హం. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక హక్కులు, సౌకర్యాలు కల్పిస్తున్న ఆర్టికల్ 35ఎ రాజ్యాంగ మౌలిక సూత్రాలను ఉల్లంఘిస్తున్నదా? రాజ్యాంగ పరిధిని అతిక్రమిస్తోందా? అన్న అంశాలను ఈ ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారిస్తుందని సుప్రీంకోర్టు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే ఆర్టికల్‌ను సవాలు చేస్తూ దాఖలై ముగ్గురు సభ్యుల ధర్మాసనం ముందు పెండింగ్‌లో వున్న మరో పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు దీనికి జత చేసింది.

నేటి నుంచి మీజిల్స్‌రూబెల్లా వ్యాక్సిన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురువారం నుంచి ప్రారంభమయ్యే మీజిల్స్‌రూబెల్లా వ్యాక్సిన్ కోసం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల వచ్చేనెల 25 వరకు కొనసాగే కార్యక్రమంలో సుమారు 9 నెలల నుంచి 15 ఏండ్లలోపు గల 90 లక్షల మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేసేందుకు అధికారులు గుర్తించారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాలు, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వేస్తారు. ఉదయం 9 గంటలకు మంత్రి లక్ష్మారెడ్డి రాజ్‌భవన్ పాఠశాలలో టీకాలు వేస్తారు. తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు గతంలో టీకాలు వేయించినా మరోసారి కూడా వేయాలని ఆరోగ్య శాఖ సూచించింది. ఇతర ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు, గతంలో తట్టు, రుబెల్లా నివారణకు టీకా వేయించిన సమయంలో అలర్జీకి గురైన వారు ఈ టీకా వేయించుకోవద్దని పేర్కొంది. రెండో విడత కార్యక్రమంలో భాగంగా దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో వ్యాక్సిన్ వేసేందుకు సిద్ధమైంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.